Mana Telangana

ఆదివారం మన తెలంగాణ

అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

www.manatelangana.news

హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 246
25, ఆదివారం
ఫిబ్రవరి, 2018

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

రెవెన్యూకు నజరానా



భూ రికార్డుల ప్రక్షాళన కృషికి మెచ్చి రెవెన్యూ సిబ్బందికి ప్రోత్సాహకంగా నెల మూలవేతనం

- 10,809 మంది ఆ శాఖ ఉద్యోగులకు, 24,410 మంది విఆర్ఎలకు, 530 మంది సర్వే సిబ్బందికి వర్తింపజేయాలని సిఎం ఆదేశం

> దేశంలో ఎక్కడా లేని విధంగా వంద రోజుల్లోనే ప్రభుత్వ అంచనాలకు మించి రేయింబవళ్లు కష్టపడి పని పూర్తి చేశారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకువచ్చారు
> – ముఖ్యమంత్రి కెసిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసినందుకు రెవెన్యూ ఉద్యోగులకు ఒక నెల మూలవేతనాన్ని ప్రోత్సాహకంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10,809 మంది రెవెన్యూ ఉద్యోగులు, 24,410 మంది విఆర్ఎలు, 530 మంది సర్వే విభాగం ఉద్యోగులతో పాటు మొత్తం 35,749 మంది ఉద్యోగులకు ఈ ప్రోత్సాహకం చెల్లించాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు జిఆర్ రెడ్డి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు పలువురు సీనియర్ అధికారులతో సిఎం కెసిఆర్ ప్రగతిభవన్‌లో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కేవలం వంద రోజుల వ్యవధిలోనే రెవెన్యూ ఉద్యోగులు రేయింబవళ్ళు కష్టపడి భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వ అంచనాలకు మించి పని చేశారని, 80 ఏళ్ళుగా సరిగా లేని భూ రికార్డుల నిర్వహణను ప్రక్షాళన చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడి భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకొచ్చారని అభినందించారు. విధి నిర్వహణ పట్ల చిత్తశుద్ధి, అంకిత భావం కలిగిన ఉద్యోగులు ఉండడం తెలంగాణ ప్రజల, రైతుల అదృష్టం అని సిఎం తరువాయి 6లో

నేడు రైతు సమితుల ప్రాంతీయ సదస్సు

- రాజేంద్రనగర్ జయశంకర్ వర్శిటీ ప్రాంగణంలో నిర్వహణ
- రాష్ట్ర సమితి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డిని ప్రకటించే అవకాశం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రైతు సమన్వయ సమితి మొదటి ప్రాంతీయ సదస్సు ఆదివారం రాజేంద్రగనర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వర్శిటీ ప్రాంగణంలో జరగనుంది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రైతు సమన్వయ సమితుల తరువాయి 6లో

10,002 మెగావాట్లు

- రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్ 3



28 నుంచి ఇంటర్ పరీక్షలు

ఉదయం 8.45 నుంచి 12 వరకు

9 తరువాత నిమిషం లేటైనా అనుమతి నో

ఎగ్జామ్ సెంటర్ లొకేటర్ యాప్ ద్వారా పరీక్షా కేంద్రం గుర్తుపట్టే అవకాశం

వెబ్‌సైట్ నుంచి కూడా హాల్ టికెట్లు

1294 పరీక్షా కేంద్రాలు



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఎ.అశోక్ వెల్లడించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ తరువాయి 6లో

డాక్టర్ కొలువుల భర్తీకి ఉత్తర్వులు 3



భూ హక్కుల చట్టం నుంచి కౌలుదారు తొలగింపు

- తణఖాదారు పదానికి ఉద్వాసన
- తహశీల్దారుకు ఐదెకరాల వరకు క్రమబద్ధీకరణ అధికారాలు
- ఆర్డినెన్స్ జారీ, 9 నిబంధనలు సవరిస్తూ ఆర్డినెన్స్

మన తెలంగాణ / హైదరాబాద్ : పట్టాదారు పాస్ బుక్ చట్టం (1971)కు తొమ్మిది సవరణలు ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఈ నెల 19వ తేదీన ఆమోదం తెలపగా రెండు రోజుల క్రితం గెజిట్ విడుదలైంది. మూల చట్టంలోని 2,3,5,6,7,8,9,10,11 సెక్షన్లకు ప్రతిపాదించిన సవరణలు గతేడాది జూన్ 17వ తేదీ నుంచి అమల్లోకి తరువాయి 6లో

పట్టాదారు పాస్‌బుక్‌ల ముద్రణ ఒప్పందం రద్దు

- సెక్యూరిటీ ప్రెస్‌తో కుదుర్చుకున్న కాంట్రాక్టును రద్దు చేసిన ప్రభుత్వం
- పుస్తకానికి రూ.200 మించి డిమాండ్ చేసిన ప్రెస్
- ముఖ్యమంత్రి ఆగ్రహం, మళ్లీ టెండర్లకు పిలుపు



మన తెలంగాణ / హైదరాబాద్ : పట్టాదారు పాస్‌బుక్‌ల ముద్రణ కోసం సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకుంది. మళ్ళీ టెండర్లను ఆహ్వానించాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఒప్పందం సమయంలో ఒక్కో పాస్‌బుక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ముద్రించడానికి రూ. 200 చొప్పున సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌తో ఒప్పందం కుదిరినా ముద్రణా పనులు ప్రారంభమయ్యే సమయానికి రూ.250 చొప్పున చెల్లించాలని కొత్త డిమాండ్ ముందుకు రావడంతో వారం రోజుల పాటు ప్రతిష్టంభన కొనసాగి చివరకు ఒప్పందాన్ని రద్దు తరువాయి 6లో

ప్రశాంతంగా టిఆర్‌టి

- ఉదయం పరీక్షలకు 92% హాజరు
- నేడు ఒఎంఆర్ విధానంలో ఎగ్జామ్స్

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఉపాధ్యాయ నియామక పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా తరువాయి 6లో

ఫార్మాలో మనమే ఫస్ట్

- కొత్త రాష్ట్రం అయినప్పటికీ ఔషధ ఉత్పత్తిలో తెలంగాణదే అగ్రస్థానం : మంత్రి కెటిఆర్
- ఔషధ తయారీ రంగంలో భారత్ త్వరలోనే ప్రపంచంలో నెంబర్‌వన్ అవుతుంది: కేంద్రమంత్రి సురేష్ ప్రభు



మన తెలంగాణ/ హైదరాబాద్ : కొత్త రాష్ట్రం అయినప్పటికీ ఔషధ ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి కెటి. రామారావు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బయో ఏషియా సదస్సు ముగింపు రోజున కేంద్రమంత్రి సురేష్ ప్రభుతో కలిసి మంత్రి కెటిఆర్ ప్యానల్ చర్చలో పాల్గొన్నారు. హైదరాబాద్ ఇప్పటికే బల్క్ డ్రగ్ హబ్‌గా ప్రసిద్ధి గాంచిందని, వ్యాక్సిన్ తయారీలో ప్రపంచంలోనే గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఫార్మా రంగంతో పాటు సౌందర్య ఉత్పత్తులకు కూడా భారీ డిమాండ్ ఉంటోందన్నారు. పెరుగుతున్న అవసరాలకనుగుణంగా కాస్మో ప్రొడక్ట్స్‌కు కూడా మంచి మార్కెట్ ఉంటోందన్నారు. ప్రజల అవసరాలను తీరుస్తున్న ఫార్మా రంగాన్ని కేంద్ర, రాష్ట్రాలు తప్పనిసరిగా ఆదుకోవాలని చెప్పారు. పేదలకు మందులు అందుబాటు ధరల్లో లభించే విధంగా మానవీయ కోణంలో చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఔషధ ఉత్పత్తుల్లో తెలంగాణ అగ్రభాగంలో ఉన్నా రీసెర్చ్ డెవలప్‌మెంట్ కోసం ఈ రంగానికి కేంద్రం ఇవ్వాల్సిన బడ్జెట్‌ను ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ఫార్మా విభాగాల్లో పెట్టుబడుల కోసం కేంద్రం ఎందుకు చొరవ చూపకూడదని వ్యాఖ్యానించారు. ఇతర విభాగాల నుండి పెట్టుబడులు వచ్చేలా చర్యలు తరువాయి 6లో

డబుల్‌కు హడ్కో అవార్డు 2లో



కుంచెపోటు



మీకు మలేరియా కాదు, 'స్కామే'రియా.. వెంటనే విదేశాలకు చెక్కేస్తే సరిపోతుంది!

కోణార్క్‌లో బాంబులు



- రెండు సంచుల్లో భద్రపరిచి ఉంచగా, ఖమ్మం జిల్లా మధిర స్టేషన్‌లో గుర్తింపు
- కిందకు దించి పరీక్షలు

మన తెలంగాణ/ మధిర : ఖమ్మం జిల్లా మధిర రైల్వే స్టేషన్‌లో శనివారం బాంబు కలకలం సృష్టించింది. భువనేశ్వర్ నుంచి ముంబయి వెళ్తున్న కోణార్క్ తరువాయి 6లో

ఆర్‌బిఐ ఏంచేస్తోంది?


ఎన్‌డిఎ హయాంలో బ్యాంకుల ఎన్‌పిఎలు రూ.7 లక్షల కోట్లకు పెరిగాయి

బ్యాంకుల ప్రైవేటుకు శక్తిమంతమైన లాబీ పనిచేస్తోంది : కేంద్ర మాజీమంత్రి చిదంబరం



మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిది బడా వ్యాపారుల అనుకూల ఆర్థిక విధానమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరం విమర్శించారు. తాము అధికారంలో ఉండగా 2014 మార్చి 31న బ్యాంకుల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ) సుమారు రూ.2 లక్షల కోట్లు కాగా, 2017 డిసెంబర్ నాటికి అవి రూ.9 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఈ నాలుగేళ్ళలో ఎన్‌పిఎలు పెరగడానికి కారణమేమిటని, నియంత్రణ వ్యవస్థ ఏమి చేస్తుందని, ఆడిటర్‌లు, ఆర్‌బిఐ ఏమి చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. దేశంలో బ్యాంకుల ప్రైవేటీకరణకు శక్తివంతమైన లాబీ పని చేస్తుందని, కాని మెజారిటీ ప్రజానీకం ప్రైవేటీకరణకు వ్యతిరేకమనేది తన బలమైన విశ్వాసమన్నారు. ఇటీవల విడుదలైన చిదంబరం వ్యాస సంకలనాల పుస్తకం ''స్పీకింగ్ ట్రూత్ టు పవర్'' పై హైదరాబాద్‌లో శనివారం మంథన్ సంస్థ చర్చా గోష్ఠి నిర్వహించింది. విద్యారణ్య పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత గంటపాటు సమకాలీన రాజకీయాలు, బడ్జెట్, జిఎస్‌టి, నోట్ల రద్దు వంటి అంశాలపై చిదంబరం ప్రసంగించారు. అనంతరం సభికులు అడిగిన పలు ప్రశ్నలకు తరువాయి 6లో

ప్రముఖ రచయిత మునిపల్లె రాజు కన్నుమూత



మన తెలంగాణ/ కాచిగూడ : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత, వ్యాసకర్త, విశ్లేషకుడు మునిపల్లె రాజు (92) కన్నుముశారు. హైదరాబాద్ సైనిక్‌పురిలోని తన నివాసంలో శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మునిపల్లె రాజు గుంటూరు జిల్లాలో 1925లో జన్మించారు. భారత రక్షణ శాఖలో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు. రాజుకు భార్య సులోచనదేవి, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు తరువాయి 6లో

స్కాలర్ షిప్ నిధులు మంజూరు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఎస్‌సి విద్యార్థుల ప్రి మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం రూ. 2,41,92,000 మంజూరు చేస్తూ తెలంగాణ ఎస్సీ అభివృద్ధి శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017–18 సప్లిమెంటరీ ఎస్టిమేట్ బడ్జెట్ నుంచి క్వార్టర్లీ నిధులను ప్రభుత్వం విడుదల చేయగా ఎస్‌సి అభివృద్ధి శాఖ మంజూరు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు అందించనున్నారు.

టిఎస్ కాప్‌కు ఎన్‌ఆర్‌సిబి ట్రోఫీ

మన తెలంగాణ/సిటీబ్యూరో: 'పోలీసులకు సాంకేతికతతో సమాచార సాధికారమివ్వడం'లో సత్ఫలితాలను సాధిస్తున్న తెలంగాణ పోలీసుల 'టిఎస్‌కాప్' మొబైల్ యాప్‌గా జాతీయ నేర పరిశోధన సంస్థ (ఎన్‌సిఆర్‌బి) గుర్తింపు రూపొందించింది. అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా పోలీసు శాఖలో కంప్యూటర్ వినియోగం పట్ల చైతన్యం కలిగించేందుకు, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగాన్ని పెంపొందించేందుకు ఎన్‌సిఆర్‌బి పోటీల్లో 'టిఎస్‌కాప్' మొబైల్ యాప్‌గా ట్రోఫీని గెలుచుకున్నది. దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు రాష్ట్రాల పోలీసు శాఖలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోలీసు అధికారులు, సిబ్బందికి ఏవేళలా ఏప్రాంతం నుండైనా, సమగ్ర సమాచారాన్ని పొందే విధంగా టిఎస్‌కాప్ మొబైల్ యాప్ ఉందని ఎన్‌సిఆర్‌బి ప్రసంశించింది. ఈ నెల 28న చెన్నైలో జరిగే అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమంలో ట్రోఫీని అందజేయనున్నట్లు సంస్థ క ప్రకటనలో తెలియజేసింది.





లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాల్సిందే

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా.లక్ష్మణ్

మన తెలంగాణ/హైదరాబాద్: నిరుద్యోగులు, విద్యార్థులను టిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరిస్తోందని, ఉద్యమ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం లక్ష ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాల్సిందేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల క్యాలండర్‌ను ప్రకటించాలన్నారు. బిజెపి యువమోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో శనివారం 'నిరుద్యోగ యువ గర్జన' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మణ్‌తో పాటు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో 3లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే నాలుగేళ్లలో ప్రభుత్వం కేవలం 16వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని విమర్శించారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ 8,972 టీచర్ పోస్టులకు 18లక్షల మంది దరఖాస్తు పెట్టుకున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని వర్గాలూ టిఆర్ఎస్‌పై వ్యతిరేకంగా ఉన్నారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ముద్ర యోజన పథకం ప్రతి సామాన్యుడికి ఉపపయోగపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి రాంచంద్రరావు, బిజెపి నేతలు పాల్గొన్నారు.

సర్పంచే సర్వాధికారి!

పంచాయతీ కార్యదర్శుల అధికారాలకు కత్తెర

- నిధుల విడుదలకు సర్పంచి సంతకం ఉంటే చాలు
- తుది రూపుదిద్దుకున్న పంచాయతీరాజ్ కొత్త చట్టం?

మన తెలంగాణ/హైదరాబాద్: గ్రామాలకు ఇక సర్పంచే సర్వాధికారి కాబోతున్నారు. ముఖ్యమైన అధికారాలన్నీ సర్పంచికే దాఖలు కానున్నాయి. పంచాయతీ కార్యదర్శుల అధికారాలకు కత్తెర పడబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్నట్లు ప్రకటించిన కొత్త పంచాయతీరాజ్ చట్టంలో వీటితో పాటు పలు కీలక మార్పులకు దాదాపు ఆమోదం లభించింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలోని మంత్రి వర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులలో చాలా స్వల్ప సవరణలను మాత్రమే చేసిన ప్రభుత్వం మరి కొన్ని అంశాలను అదనంగా చేర్చి పంచాయతీరాజ్ కొత్త చట్టానికి తుదిరూపు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే నెలలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లోనే దీనిని ప్రవేశపెట్టి ఆమోదం పొందనుంది. ప్రస్తుతం పంచాయతి కార్యదర్శి వద్ద ఉన్న కార్యనిర్వహణ అధికారాల్లో కొన్నింటిని సర్పంచికి ఇచ్చేలా కొత్త చట్టంలో ప్రభుత్వం మార్పులు చేయనుంది. జాయింట్ చెక్‌పవర్ విధానాన్ని తొలగించి గ్రామ కార్యదర్శి సంతకం అవసరం లేకుండా కేవలం సర్పంచ్ సంతకం మాత్రమే చెల్లుబాటయ్యేలా చట్టంలో స్పష్టత ఇవ్వనుంది. పంచాయతీ రిజర్వేషన్ల విధానంలో రొటేషన్ పద్ధతితో పాటు పదేళ్ల కోసారి రిజర్వేషన్లలో మార్పులు చేసేలా, మహిళా రిజర్వేషన్లను 33 శాతం నుంచి 50శాతానికి పెంచేలా స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. ఫిర్యాదుల పరిశీలనకు రాష్ట్ర స్థాయిలో ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయడం, రెండు నెలలకు ఒకసారి గ్రామసభను నిర్వహించడం, ప్రతీ నెలా పంచాయతి పాలక వర్గాల సమావేశాలను నిర్వహించడం, పంచాయతీ జనాభాను బట్టి గ్రామసభకు హాజరు కావాల్సిన వారి సంఖ్య(దాదాపు 50 నుంచి 300కు పైగా) ను నిర్ణయించడం, పంచాయతీ పాలకవర్గంలో వివిధ వర్గాలకు చెందిన ముగ్గురు ప్రతినిధులను కో– ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకోనుండడం తదితర అంశాలను మంత్రివర్గ ఉప సంఘం సిఫారసు చేయడంతో వీటిని ప్రభుత్వం ఆమోదించినట్లు తెలిసింది. పంచాయతీల్లో ఏయే సేవలు ఎన్ని రోజుల్లో పూర్తి చేయాలో నిర్దేశించే పౌరసేవల పట్టికను ప్రవేశపెట్టడం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా నిర్దిష్ట గడువును నిర్ణయించనుండడం, వీధిదీపాలు, మరుగుదొడ్లు పొందడాన్ని ప్రజలు తమ హక్కుగా భావించి ఆయా పనులు చేయించుకునే వీలును కల్పించడం తదితరాలన్నీ కొత్త చట్టంలో ఉండనున్నట్లు తెలిసింది. సర్పంచి ఎన్నిక పరోక్ష పద్ధతిలో ఉండబోతున్నట్లు సమాచారం.



'డబుల్' ఇళ్లకు హడ్కో డిజైన్ అవార్డు



మన తెలంగాణ/హైదరాబాద్: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు హడ్కో డిజైన్ అవార్డు–2017 లభించింది. పట్టణ, గ్రామీణ పేదలకు తగిన ఖర్చుతో సృజనాత్మకత, విపత్తులను ఎదుర్కొనేలా పటిష్టమైన డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇస్తున్నందుకు ఈ అవార్డు ఇస్తున్నట్లు హడ్కో ప్రకటించింది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం డిజైన్‌లో హడ్కో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఈ ఏడాది ఏప్రిల్ చివరి వారంలో అవార్డును అందజేయనున్నట్లు తెలిపింది. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట, ఖమ్మం, సూర్యాపేటలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను హడ్కో బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఇళ్ల నిర్మాణంలో మెరుగైన పనితీరు కనబరుస్తున్నందుకు ఈ అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేస్తూ, పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తుండడంతో హడ్కో అవార్డు లభించిందని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ తెలిపారు. కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్ లైన్ ద్వారా బిల్లులు చెల్లిస్తుండటాన్ని హడ్కో ప్రశంసించిందన్నారు. బహిరంగ మార్కెట్ తో పోలిస్తే టన్నుకు రూ.9440 డబుల్ ఇళ్లకు ఇనుమును విక్రయించేలా స్టీల్ కంపెనీలను ఒప్పించినందుకు కేంద్రం ప్రభుత్వం నుంచి కూడా అభినందనలు వచ్చాయన్నారు.

మా కృషికి గుర్తింపు..

డబుల్ బెడ్ రూం ఇళ్లకు హడ్కో డిజైన్ అవార్డు 2017 రావడంతో మా కృషికి సరైన గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నా. సిఎం కెసిఆర్ 'కలల' ప్రాజెక్ట్ అయిన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది.

– గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

28 నుంచి ప్రత్యక్ష ఆందోళనలు

- మున్సిపల్ కార్మిక సంఘాల జెఏసి

మన తెలంగాణ/హైదరాబాద్: మున్సిపల్ కార్మికులందరికీ వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల సాధనకు ఈనెల 28 నుంచి ఉద్యమ ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జెఏసి ప్రకటించింది. సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనె 28న మున్సిపల్ శాఖ, ముఖ్య కార్యదర్శికి సమ్మె నోటీసు ఇవ్వాలని, మార్చి 1 నుంచి 5 వరకు ఎంఎల్‌ఎలకు వినతిపత్రాలు, మార్చి 6,7 తేదీలలో ఇంటింటి భిక్షాటన, 12న కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నా, 14న అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలతో హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం, మార్చి 15 నుంచి 17 వరకు సమ్మె చేయనున్నట్లు జెఏసి వెల్లడించింది. అప్పటికీ స్పందించకపోతే నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో జెఏసి నేతలు ఏసురత్నం, సహదేవ్ (ఎఐటియుసి), పాలడుగు భాస్కర్, జె. వెంకటేశ్ (సిఐటియు), కె. సూర్యం, జి.మల్లేశ్ (ఐఎఫ్‌టియు) మాట్లాడారు. వేతనాల పెంపు కోసం నాలుగు దఫాలుగా చర్చలు జరిగాయని, పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో సమ్మెను విరమిస్తే ఇప్పటివరకు పెంచలేదని ఏసురత్నం చెప్పారు.

అంతా ఇన్‌చార్జీల పాలనే!

- జిల్లా పరిషత్‌లలో ఖాళీగా ముఖ్య అధికారుల పోస్టులు



మన తెలంగాణ/హైదరాబాద్: పెద్ద దిక్కుగా ఉంటూ దిశానిర్దేశం చేస్తూ అభివృద్ధిబాటలో నడిపించే ముఖ్యమైన అధికారులు లేక గ్రామ పంచాయతీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. జిల్లా స్థాయి ముఖ్య అధికారుల రెగ్యులర్ పోస్టులు గత కొన్నేళ్లుగా ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. దీతో కిందిస్థాయి, ఇతర శాఖల అధికారులు ఆ బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తోంది. ఐఎఎస్ స్థాయి పోస్టుల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు నియమితులయ్యారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్రాలు ఇచ్చే నిధులను, పథకాలను జిల్లా స్థాయిలో జిల్లాపరిషత్‌లు, మండల స్థాయిలో మండల పరిషత్తులు, గ్రామ స్థాయిలో పంచాయతీలు అమలు చేయాల్సి ఉన్నా, రాష్ట్రంలోని తొమ్మిది జిల్లా పరిషత్‌లకు ఐఎఎస్ స్థాయి సిఇఒలు లేకుండా పోయారు. ఆదిలాబాద్ జిల్లా పరిషత్‌కు ఒక ఎంపిడిఒ సిఇఒగా వ్యవహరిస్తున్నారు. నిజామాబాద్ సిఇఒగా అదే జిల్లాకు చెందిన ఎంపిడిఒ పనిచేస్తున్నారు. ఖమ్మం సిఇఓగా అటవీ, పర్యావరణ శాఖకు చెందిన డివిజన్ స్థాయి అధికారి, వరంగల్ సిఇఒగా సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన అధికారి, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లా పరిషత్ల సిఇఒలుగా రెవెన్యూ శాఖకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం తొమ్మిది జిల్లా పరిషత్‌లకు రెగ్యులర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు లేరు. కింది స్థాయి వారికి బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారుల పోస్టుల్లో సైతం ఇదే లోపం కొనసాగుతూ ఉంది. డివిజనల్ పంచాయతీ రాజ్ అధికారులే బాధ్యతలను నెట్టుకొస్తున్నారు. మండల స్థాయిలో 44 ఎంపిడిఒ పోస్టులు ఖాళీలు ఉంటే 72 మంది డిప్యూటేషన్‌పై వివిధ విభాగాలకు వెళ్ళిపోయారు. ఆ విధంగా 116 మండలాల్లో ఎంపిడిఒ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. మండల స్థాయిలో పూర్తి గ్రామ పంచాయతీల అభివృద్ధి బాధ్యతలను మాత్రమే చూసుకునే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(పిఆర్ అండ్ ఆర్‌డి) పోస్టులు కూడా 71 ఖాళీగానే ఉన్నాయి. దీనికి తోడు తొమ్మిది మందిని డిప్యూటేషన్‌పై పంపించడంతో మొత్తం ఖాళీల సంఖ్య 80కి చేరింది. ఇక గ్రామ స్థాయిలో గ్రామ కార్యదర్శుల పోస్టులు 5165 పోస్టులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

రేపటి నుంచి ఈ గవర్నెన్స్‌పై జాతీయ సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర సమాచార కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సు' ఈ నెల 26 నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్ నగరంలో జరగనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రులు, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కెటిఆర్ హాజరవుతున్నారు. శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి శాలిని మిశ్రా సదస్సు వివరాలను వెల్లడించారు. రెండు రోజుల పాటు 8 విభాగాలలో 5 ప్లీనరీ సెషన్స్ జరుగుతాయన్నారు. సదస్సులో కేంద్ర మంత్రులు వైఎస్ చౌదరి, సీఆర్ చౌదరి, తెలంగాణ సిఎస్ ఎస్‌కె జోషి పాల్గొంటున్నారని తెలిపారు. సదస్సు రెండో రోజు ఫిబ్రవరి 27న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ గవర్నెన్స్ అవార్డులను ప్రదానం చేస్తారు. మొత్తం 19 మందికి ఈ గవర్నెన్స్ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వారు వెల్లడించారు.

కౌలుదారుకు కష్టాలు?

- కొత్త పాస్ పుస్తకంలో పేరు మినహాయింపు
- 1951 రక్షిత కౌలుదారు, 2011 లైసెన్స్ చట్టం లేదు..

మన తెలంగాణ/హైదరాబాద్: పట్టాదారు పాస్ పుస్తకాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు కౌలు రైతులకు మరిన్ని కష్టాలను కలిగించనున్నాయా ? పంట రుణాలు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అందేలా చూడాలని వేడుకుంటున్న కౌలు రైతులకు ఇక మీదట గుర్తింపే ప్రశ్నార్థకంగా మారనుందా అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇటీవల ప్రభుత్వం 1971 భూమి హక్కులు, పట్టాదారు పుస్తక చట్టానికి సవరణ చేస్తూ నూతన విధానాలను రూపొందించి గెజిట్ విడుదల చేసింది. వీటి ప్రకారంగా త్వరలోనే రైతులందరికీ నూతన పట్టా పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇందులో అసలు వాస్తవ సాగుదారు (కౌలుదారు) పేరుకు మినహాయింపు అవకాశం లేకపోవడమే విమర్శలకు తావిస్తోంది. రాష్ట్రంలో దాదాపు 14 లక్షల మంది కౌలు రైతులున్నారు. ఈ లెక్క తేల్చింది బ్యాంకులే. వాస్తవానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే అనేక రకాలుగా ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలను కోల్పోతున్న కౌలు రైతులకు ఇది మరిన్ని కష్టాలను తీసుకురానుందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ విధానం ఆహార ఉత్పాదకతకు ప్రమాదకరంగా మారనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో భూ పరిపాలన శాఖ ముఖ్య కమిషన్ (సిసిఎల్‌ఎ) ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం, ప్రభుత్వానికి ఎటువంటి దిశానిర్దేశం చేయకపోవడం గమనార్హం. 1971 చట్టం పట్టాదారు పుస్తకాలు భూముల సర్వే నెంబర్‌లతో పాటు భూమి హక్కులను చూపుతోంది. ఇందులో సెక్షన్ 6(ఎ)లో సబ్ సెక్షన్ 4లో పట్టాదారు, తనఖాదారు, కిరాయిదారు పేరు నమోదుకు అవకాశం ఇచ్చారు. సెక్షన్ 91 ప్రకారం వాస్తవ సాగుదార్ల పేర్లు రిజిస్టర్‌లో రాయడంతో పాటు సెక్షన్ 97 ప్రకారం వారికి పాసుపుస్తకాలు ఇవ్వాలి. అంతేకాకుండా 1951 చట్టంలో సెక్షన్ 48ఎ ప్రకారం రక్షిత కౌలుదారి హక్కులు కూడా కల్పించాలి. ఈ విధంగా భూమిని సాగు చేసే వాళ్లకు నిజాం కాలం నుంచి ఉమ్మడి రాష్ట్ర సిఎంగా కిరణ్ కుమార్ రెడ్డి పనిచేసినంత అవకాశం వరకు కల్పించారు. పట్టాదారులు, కౌలు చేసేవారి పేర్లు రాయడంపై భయాందోళన చెందుతున్నారని 2011లో కౌలు అనే పదం లేకుండా లైసెన్స్‌డ్ రైతులు అన్న పదం ఉపయోగిస్తూ మరొక చట్టం తీసుకొచ్చారు. దీని ప్రకారం ప్రతి ఏడాది ఏప్రిల్‌లో రెవిన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి కౌలుదారుల పేర్లు నమోదు చేయించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక రిజిస్టర్ కూడా నిర్వహించాలి. అయితే ఇవేవీ అమలునకు నోచుకోవడం లేదు. నిజాం కాలంలోనే పహుతిబహి పేరు ఇచ్చే పుస్తకంలోనే శిస్తు దగ్గర నుంచి పట్టా మార్పిడి వరకు ప్రతిదీ స్పష్టమైన రికార్డులు నిర్వహించారు. ప్రభుత్వం భూ యాజమానులను దృష్టిలో ఉంచుకుని పాసు పుస్తకాలను జారీ చేయడం శ్రేయస్కారం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ. 4 వేలు అందించే పెట్టుబడి పథకం కౌలు రైతులకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇక కొత్తగా పంపిణీ చేస్తామని చెప్పిన పట్టా పుస్తకాల్లో వాస్తవ సాగుదారు పేరు లేక పోవడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.



27న సింగరేణిలో సిఎం పర్యటన

మన తెలంగాణ/హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఈ నెల 27న సింగరేణిలో పర్యటించనున్నారు. మంచిర్యాలలోని శ్రీరాంపూర్ గనుల ప్రాంతంలో పర్యటించిన అనంతరం స్థానిక ప్రగతి మైదాన్‌లో మధ్యాహ్నం జరిగే సమావేశంలో సింగరేణి కార్మికులనుద్దేశించి ప్రసం గించనున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొనింది. సిఎం పర్యటన నేపథ్యంలో ఈ నెల 27న రామగుండం 1, 2, 3 గనులతో పా టు బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ గనులకు చెందిన కార్మికులకు సెలవు ప్రకటించారు. సిఎం సింగరేణి యాత్రకు సంబంధించి శనివా రం ప్రగతి భవన్‌లో సమీక్షించారు. అలాగే వచ్చే నెల 5వ తేదీన ధర్మపురి, ముథోల్, నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ముఖ్యమంత్రి పర్యటించ నున్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మపురి నియోజ కవర్గ కేంద్రంలోని ఆలయంలో సిఎం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. నియోజక్వర్గ సమస్యలపై చర్చించనున్నారు. ఆ తర్వాత విఠల్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ముథోల్ నియోజకవర్గంలోని బాసర దేవాలయంలో పూజలు చేసి ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు. సాయంత్రం ఇంద్రకరణ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే నిర్మల్ జిల్లా పర్యటనలో పలు జిల్లా అధికారుల కార్యాలయాల సముదాయాలకు సిఎం శంకుస్థాపన చేస్తారని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

వైద్యారోగ్యశాఖలో నియమాకాలు

- **ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల్లో డాక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విధాన పరిషత్‌లో 1280, ఆయుష్‌లో 183 పోస్టులను డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ (డిఎస్‌సి) ద్వారా భర్తీ చేయనున్నట్లు, వీటికి ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకోసం వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.శాంతికుమారి ఉత్తర్వులను జారీ చేశారు. వైద్య విధాన పరిషత్‌లోని 1280 పోస్టులలో 42 సూపర్ స్పెషాలిటీ, 1133 స్పెసాలిటీ, 91 మంది డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా సివిల్ అసిస్టెంట్ సర్జన్లతో పాటు మరో 14 మంది డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. దీంతో పాటు ఆయుష్‌లోని 183 పోస్టులలో మెడికల్ ఆఫీసర్లు, ప్రొఫెసర్ పోస్టులున్నాయి. వైద్య విధాన పరిషత్ పోస్టుల భర్తీకి ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఛైర్మన్‌గా వైద్య, విధాన పరిషత్ కమిషనర్ కన్వీనర్‌గా వైద్య, విద్యా డైరెక్టర్‌తో పాటు కాళోజి నారాయణ రావు హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ సభ్యులుగా కొనసాగుతారు. ఆయుష్ పోస్టుల కోసం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ చైర్మన్‌గా ఆయుష్ డైరెక్టర్‌తో పాటు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశా కమిషనర్, వైద్య, విద్యా సంచాలకులు సభ్యులుగా ఉంటారని ఆ జిఒలో పేర్కొన్నారు.

పద్మ అవార్డులపై పక్కదోవ : పొన్నం



మన తెలంగాణ/హైదరాబాద్: పద్మ అవార్డులలో రాష్ట్ర ప్రభుత్వం కేం ద్రానికి ఇచ్చిన జాబితాలో తెలంగాణ ప్రముఖుల పేర్లు లేవని, కేంద్రానికి ఒక రకమైన జాబితా పంపించి, మీడియాకు ఒక రకమైన జాబితా ఇచ్చి మోసం చేశారని టిపిసిసి ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. శనివారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడా రు. తెలంగాణకు చెందిన ఎందరో ప్రముఖులు ఉండగా, ప్రభుత్వం పద్మ అవార్డులు కావాలని కోరలేదని ఈ విషయాన్ని ఆర్‌టిఐ యాక్టు ద్వారా సమాచారం సేకరించామని ఆయన వివరించారు. ఇందులో ప్రభుత్వం బైట పి.వి నర్సింహారావు, ప్రొ.జయశంకర్, అందెశ్రీ, చుక్కా రామయ్య,ల పేర్లు సిఫారసు చేసినట్టు ప్రచారం చేసుకున్నారని ఆయన దుయ్యబట్టారు. ఎపి ప్రభుత్వం పంపించిన జాబితాలో ఉన్న ఆనంద్ శంకర్ జయంతి, కాదంబి శ్రీకాంత్‌ల పేర్లు తెలంగాణ ప్రభుత్వం కూడా పంపడం విడ్డూరంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో టిపిసిసి ఉపాధ్యక్షుడు డా. మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ధనిక రాష్ట్రమైన తెలంగాణ నేడు 2లక్షల కోట్ల అప్పులు ఊబిలో కూరుకు పోయి అప్పుల రాష్ట్రంగా మారిపోయిందన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసిందని, వీటన్నింటిని జనంలోకి తీసుకొని పోయేందుకు కాంగ్రెస్ చైతన్య యాత్ర చేపట్టిందని తెలిపారు.

రిజర్వేషన్లలో నాలుగేళ్లుగా అన్యాయం

- **గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించిన గిరిజన జెఎసి**



మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్రం విభేదిస్తున్న మైనార్టీ రిజర్వేషన్ల బిల్లుతో ఎస్‌టిల రిజర్వేషన్ల పెంపు బిల్లును పంపించాల్సిన అవసరం లేదని మాజీ ఎంపి రవీంద్రనాయక్ అన్నారు. ఎస్‌టిల రిజర్వేషన్ పెంపు జిఒను వెంటనే జారీ చేయాలని కోరారు. గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ నేతలతో కలిసి శనివారం రాజ్‌భవన్‌లో గవర్నరల్ ఇఎస్‌ఎల్ నరసింహన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మైనార్టీ రిజర్వేషన్ల పెంపు బిల్లుతో కలిపి గిరిజన రిజర్వేషన్ బిల్లును కేంద్రానికి పంపించడంతో గిరిజనులు గత నాలుగేళ్లుగా అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఆడ పిల్లల అమ్మకాలు, హత్యలు జరిగే అమానవీయ ఘటనలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ జన్మించే ప్రతి అడపిల్ల పేరుతో రూ. 5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పౌష్టికాహార లోపం, వైద్య సదుపాయం, తాగునీరు దొరకక మలేరియా, డయేరియా, జాండిస్, స్వైన్‌ఫ్లూ వంటి భయంకరమైన వ్యాధులు వస్తున్నాయని వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో గిరిజన జెఎసి నాయకులు సూర్యానాయక్, శంకర్‌నాయక్, గణేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.



కమనీయం.. రమణీయం

- వైభవోపేతంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు



మన తెలంగాణ/యాదాద్రి: యాదగిరీషుడి కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ముక్కోటి దేవతలు, లక్షలాది భక్తులు తిలకిస్తుండగా మాంగల్య బలం తంతు సాక్షిగా లోక కల్యాణార్థం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవం చాటింది. యాదాద్రి లక్ష్మీ నరసిం హస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం కొండ కింద నిర్వహించిన కల్యాణోత్సవం అంగ రంగ వైభపేతంగా జరిగింది. ముందుగా స్వామి అమ్మ వార్లను పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి గజ వాహనంపై ఊరేగించారు. తీరొక్క పుష్పాలతో అలంకరించబడిన కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్లను కొలువుదీర్చి ఆగమశాస్త్ర ప్రకారం వేద పండితులు, రుత్వికులు, అర్చక స్వాములు కల్యాణ మంత్రాలు ఉచ్చరిస్తూ ముక్కోటి దేవతల సాక్షిగా శ్రీవారి కల్యా ణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో అర్చక స్వాములు, పండితులు నిర్వహించిన రక్షబంధన్, జీలకర్ర బెల్లం, యజ్ఞోపవేదం, మాంగళ్య ధారణ పూజలు నిర్వహిస్తూ విశిష్టతను వర్ణించారు. యజ్ఞాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు లక్ష్మీ నరసింహచార్యులు, నరసింహచార్యులు, వెంకటాచార్యులు, వేద పండితులు, శాస్రోక్తంగా నిర్వహించిన ఈ మహోత్సవంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, హోం మంత్రి నాయిని నర్సింహరెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతారెడ్డి, కలెక్టర్ అనీతారామచంద్రన్, ఆలయ ధర్మకర్త నర్సింహమూర్తి, ఇఒ గీత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు

లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి దంపతులు ఈ వేడుకలో పాల్గొన్నారు. మంత్రుల దంపతులకు ఆలయ ఇఒ గీత స్వాగతం పలుకగా, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం పట్టు వస్త్రాలు తలంబ్రాలను మంత్రి అందజేశారు. అనంతరం బాలాలయంలోని లక్ష్మీ నరసింహుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

టిడిడి ఆధ్వర్యంలోనూ..

యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం పక్షాన స్వామిఅమ్మవార్లకు కల్యాణ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు.



మూసీ నది సుందరీకరణ

- అధికారులతో మంత్రి కెటిఆర్ సమీక్ష
- వారంలో ప్రాథమిక నివేదిక అందించాలని ఆదేశం



మన తెలంగాణ/హైదరాబాద్: త్వరలోనే మూసీ నదీ సుందరీకరణకు అంతర్జాతీయ డిజైన్ పోటీలను నిర్వహిస్తున్నామని మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. మూసి నీటి శుద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపైన జల మండలి, పిసిబి, టిఎస్‌ఐఐసి అధికారులతో ఒక సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి)ని ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి వారం రోజుల్లో ప్రాథమిక నివేదికను అందజేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో శనివారం మూసీ అభివృద్ధి, సుందరీకరణ కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. స్థానికంగా ఉన్న నగర పౌరుల నుంచి మొదలు అందరూ ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం అయ్యేలా ప్రపంచస్థాయి సంస్థల సూచనలు, తీసుకునేందుకు ఈ డిజైన్ పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ సమావేశంలో సాగునీటి, రెవెన్యూ శాఖతో పాటు జిహెచ్ఎంసి, జలమండలి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూసి చుట్టూ ఏర్పాటు చేయనున్న ఎక్స్‌ప్రెస్, ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణంతో పాటు పలు అంశాలపై చర్చించారు. మూసి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫిజిబిలిటీ రిపోర్ట్ తయారైందని, సాగునీటి శాఖ చేపట్టే హైడ్రాలిక్ సర్వే కూడా త్వరలోనే పూర్తవుతుందని అధికారులు మంత్రికి చెప్పారు. ఇప్పటికే మూసి అభివృద్ధికి అవసరమైన పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేసినట్టు వారు వివరించారు.



2020 నాటికి గండిపేటకు వందేళ్లు

2020 నాటికి గండిపేట చెరువును నిర్మించి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో చెరువు అభివృద్ధికి హెచ్ఎండిఎ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని అధికారులు మంత్రి కెటిఆర్‌కు చెప్పారు. ఇప్పటికే సాగునీటి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు కార్యక్రమాలకు తోడుగా హెచ్ఎండిఎ, పర్యాటక శాఖ సంయుక్తంగా గండిపేట చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. మంత్రి మాట్లాడుతూ మూసీ సుందరీకరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వంతెనల నిర్మాణం, ఎస్‌టిపిల నిర్మాణం వంటి అంశాలను అత్యంత సుందరంగా ఉండాలని అధికారులకు సూచించారు. మూసీ సుందరీకరణ కోసం నదిలో నిరంతరం మంచినీరు ప్రవహించేలా చేసేందుకు ఉన్న అవకాశాలపైన జలమండలి, సాగునీటి శాఖాధికారులతో చర్చించారు. ముందుగా మూసీపైన వికేంద్రీకృత పద్ధతిన ఎస్‌టిపిల నిర్మాణం చేసే అంశాలపై మంత్రి కెటిఆర్ అధికారులతో చర్చించారు.



కాంగ్రెస్ బస్సు రెడీ

మన తెలంగాణ/హైదరాబాద్: ఈనెల 26న ప్రారంభం కానున్న కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్రకు బస్సు రెడీ అయింది. వోల్వో బస్సుకు నాలుగువైపుల మూడు రంగుల స్టిక్కర్‌లను అతికించారు. వాటిపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, పిసిసి అధ్యక్షుడు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ప్రముఖంగా కనిపిస్తున్నాయి. సోనియాగాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కుంటియా, సతీశ్ జర్కోహోళీ, తెలంగాణకు చెందిన ఎఐసిసి కార్యదర్శులు వి.హనుమంతరావు, మధుయాష్కి గౌడ్, డా. జి.చిన్నారెడ్డి, ప్రతిపక్ష నాయకులు షబ్బీర్ అలీ, కుందూరు జానారెడ్డి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క ఫొటోలు ఉన్నాయి. బస్సును తయారు చేయించిన మాజీ మంత్రి దానం నాగేందర్, మాజీ ఎంఎల్‌ఎ మహేశ్వర్‌రెడ్డి ఫొటోలు కింద ఉన్నాయి. బస్సుయాత్ర నిర్వహణ కోసం పలు కమిటీలను వేశారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన 18 మంది సీనియర్ నాయకులతో ప్రజా చైతన్య యాత్ర సలహా కమిటీ, మండలి ప్రతిపక్ష నేత మహ్మద్ అలీ షబ్బీర్ చైర్మన్‌గా, మాజీ మంత్రి దానం నాగేందర్ కో–చైర్మన్‌గా, మాజీ ఎంఎల్‌ఎ మహేశ్వర్‌రెడ్డి కన్వీనర్‌గా ఆర్గనైజింగ్ కమిటీ, టిపిసిసి కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి చైర్మన్‌గా ఫైనాన్స్ కమిటీ, డా. మల్లు రవి చైర్మన్‌గా మీడియా కమిటీలను నియమించారు.

రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్

- 10002 మెగావాట్లుగా నమోదు
- తొలిసారి ఐదంకెలకు చేరిన వినియోగం





మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైంది. శనివారం ఉదయం 7.44 గంటల సమయంలో ఏకంగా 10002 మెగావాట్ల మేర డిమాండ్ నమోదయ్యింది. ఈ నెల 23వ తేదీన అత్యధికంగా 9,996 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కాగా 208 మెగావాట్లు పెరిగి రికార్డు సృష్టించింది. రానున్న వేసవిలో ఇది సుమారు 10,600 మెగావాట్లకు చేరుకోవచ్చునని అంచనా వేస్తున్నట్లు ఎస్‌పిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి వ్యాఖ్యానించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాను జనవరి 1వ తేదీ నుంచి అమలుచేస్తూ 50 రోజులైన సందర్భంగా అనుభవాలను మీడియాకు వివరించారు. భవిష్యత్తులో 11,500 మెగావాట్ల వరకు విద్యుత్ డిమాండ్ వచ్చినా తట్టుకునే విధంగా సాంకేతికంగా సిద్ధంగా ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ సరఫరా దరిమిలా రాష్ట్రంలో ప్రతి రోజు 5 నుండి 6 గంటలు విద్యుత్ వినియోగం భారీగా ఉంటోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రణాళికా బద్ధంగా ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో విద్యుత్ కోతలను నివారించామని, ఇప్పుడు వ్యవసాయ రంగంతో పాటు 24 గంటల విద్యుత్ సరఫరా చేయగలిగే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు గడచిన రెండేళ్లలో రూ.11వేల కోట్లు ఖర్చు చేశామని, తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ 2016–17లో రూ.4,584 కోట్ల సబ్సిడీ మంజూరుతో పాటు రూ. 2,262 కోట్ల మేర ఈక్విటీ రూపంలో పెట్టుబడి పెట్టిందని, 2017–18లో రూ.4,777 కోట్లు సబ్సిడీతో పాటు రూ. 2,498 కోట్ల మేర ఈ క్విటి పెట్టుబడులు పెట్టిందని, కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'ఉదయ్' స్కీంలో చేరడం వల్ల సెప్టెంబర్ 2015 వరకు ఉన్న రుణాల్లో 75 శాతం రుణాలను తెలంగాణ ప్రభుత్వమే టేకోవర్ చేసుకుందని వివరించారు. గ్రామీణ విద్యుత్ కార్పొరేషన్ నుంచి సుమారు రూ. 2400 కోట్లమేర రుణం తీసుకున్నామని, వాయిదాలు సక్రమంగా చెల్లించిన కారణంగా రుణంపై వడ్డీని 13 శాతం నుంచి 9.65 శాతానికి తగ్గిస్తూ ఆర్‌ఇసి నిర్ణయం తీసుకుందని, దీని వల్ల డిస్కలంకు వడ్డీ భారం తగ్గుతుందన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తిలో దేశంలో నే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని, సుమారు 3200 మెగావాట్ల మేర ఉత్పత్తి చేస్తున్నదని, భవిష్యత్తు లో ఇది మరింత పెరుగుతుందని, సోలార్ పార్కుల రూపంలో కాకుండా ఎక్కడికక్కడ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి చేస్తూ నూతన ఒరవడిని సృష్టించిందని రఘుమారెడ్డి వివరించారు. 2,700 మెగా వాట్ల మేర కొరత ఉండేద ని, ప్రణాళికాబద్దంగా ఆరు నెలల వ్యవధిలోనే అధిగ మించామని తెలిపారు. భవిష్యత్తులో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రా జెక్టులు రాబోతున్నందున విద్యుత్ వినియోగం పెరుగు తుందని, దీనికి తోడు కొత్తగా ఏటా లక్షకు పైగా విద్యు త్ పంపుసెట్లకు కనెక్షన్‌లు ఇస్తున్నామని, ఈ అవసరా లకు అనుగుణంగా రాన్నున నాలుగేళ్లలో కొత్త సబ్‌స్టేష న్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపిందిస్తున్నట్లు తెలిపా రు. శనివారం ఆయన గోపాలరావు (సిఎండి టిఎస్‌ఎన్ పిడిసిఎల్), టి.శ్రీనివాస్ (డైరెక్టర్ ఆపరేషన్స్), కమా లుద్దీన్ (డైరెక్టర్ అడ్మిన్) తదితరులు రఘుమారెడ్డి పాటు జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు.



"సాహసం అనేది లేకుండా మనిషి ఇంక ఏ ఇతర సద్గుణాలనీ ఆచరణ లోకి తెచ్చుకోలేదు.
– ఇందిరా గాంధీ"

ఎన్‌డిఎ ఆధిక్యంలోకి రాజ్యసభ

సంపాదకీయం

రాజ్యసభలో మెజారిటీలేక తమ ఏకపక్ష పోకడకు అవరోధాలు ఎదుర్కొంటున్న ఎన్‌డిఎ కొద్ది మాసాల్లో ఆ ఇబ్బందిని అధిగమించనుంది. 59 సీట్లకు మార్చి 23న జరిగే ద్వైవార్షిక ఎన్నికలు బిజెపి, దాని మిత్రపక్షాల ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. 2014 తదుపరి ఉత్తరప్రదేశ్ సహా పలు అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారం పొందటం, బీహార్‌లో మహాకూటమిని చీల్చి నితీష్ కుమార్ జెడి(యు)తో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయటం వంటిది పరిణామాలు ఇందుకు దోహదం అవుతున్నాయి.

245 మంది సభ్యులు గల రాజ్యసభలో ప్రస్తుత బలాబలాలు: బిజెపి 58, కాంగ్రెస్ 54, సమాజ్ వాది పార్టీ 18, ఎఐఎడిఎంకె 13 తృణమూల్ 12, ఇతరులు 84, ఖాళీలు 6. ఏప్రిల్ –మే మాసాల్లో 16 రాష్ట్రాల నుంచి 58 మంది సభ్యులు రిటైర్ కానున్నారు. ఒకటి ఉప ఎన్నిక.ఖాళీ అయ్యే స్థానాలు రాష్ట్రాలవారీ – ఉత్తర ప్రదేశ్ 10, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిసా, రాజస్థాన్ మూడేసి, బీహార్, మహారాష్ట్ర 6 చొప్పున, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌లలో ఐదేసి, గుజరాత్, కర్నాటకల్లో నాలుగేసి, జార్ఖండ్‌లో 2, చత్తీస్‌గఢ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఒక్కొక్కటి.

రాజ్యసభ రాష్ట్రాల మండలి అయినందున శాసన సభల్లో ఆయా పార్టీల బలాబలాలు రాజ్యసభ ప్రాతినిధ్యంలో ప్రతిబింబిస్తాయి. ఆ ప్రకారం ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీలో 312 స్థానాలున్న బిజెపికి 8 సీట్లు సునాయాసంగా లభిస్తాయి. ఎక్కువ మంది సభ్యులు రిటైరవుతున్న సమాజ్‌వాది పార్టీకి ఒక్క సీటే దక్కుతుంది. మరో సీటును, రాజకీయ, పోలింగ్ వ్యూహాలు నిర్ణయిస్తాయి. కాంగ్రెస్‌కు మొత్తం మీద 7 మాత్రమే (గుజరాత్ 2, మహారాష్ట్ర 1, కర్నాటక 3, మధ్యప్రదేశ్ 1) గెలుచుకునే అవకాశముంది. తెలంగాణలో మూడు సీట్లు టిఆర్‌ఎస్ గెలుచుకుంటుంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కర్నాటక మినహా కాంగ్రెస్ ప్రాతినిధ్యం అతి తక్కువ కాబట్టి దాని సంఖ్య గణనీయంగా తగ్గదు. కాని ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్ కారణంగా బిజెపి బలం పెరుగుతుంది. ప్రస్తుతం సభలో యుపిఎ బలం రమారమీ 122 కాగా ఎన్‌డిఎ బలం 93. మార్చి ఎన్నికలతో ఎన్‌డిఎ ఆధిక్యంలోకి వస్తుంద. ఆ పరిస్థితి సందర్భాన్ని బట్టి మరి కొందరిని కూడగట్టే అవకాశం బిజెపికి లభిస్తుంది.

లోక్‌సభలో బిజెపికి ఏకపక్ష ఆధిక్యంతోపాటు ఎన్‌డిఎ బలం గణనీయంగా ఉన్నందున ఏ బిల్లు ఆమోదించాలన్నా దాని పని నల్లేరు మీద నడకలా ఉంది. అదే రాజ్యసభకు వచ్చే సరికి యుపిఎ మెజారిటీ కారణంగా పలు బిల్లులను విధిలేని పరిస్థితుల్లో ప్రతిపక్షం డిమాండ్ మేరకు సెలెక్ట్ కమిటీకి పంపాల్సి వస్తోంది. అది సభా నిబంధనలకు అనుగుణమే అయినా సహించలేని బిజెపి కొన్ని బిల్లులను ద్రవ్య బిల్లుల పేరుతో లోక్‌సభ ఆమోదంతోనే సరిపెడుతూ పార్లమెంటరీ పని తీరును ధిక్కరిస్తున్నది. రైతులకు అనుకూలంగా 2013 లో పార్లమెంటు ఆమోదించిన భూ సేకరణ బిల్లుకు తూట్లు పొడుస్తూ బిజెపి అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే జారీ చేసిన ఆర్డినెన్స్‌కు లోక్‌సభ ఆమోద ముద్ర వేసినా రాజ్యసభ తిరస్కరించింది. రెండు –మూడు సార్లు అదే ఆర్డినెన్స్ జారీ చేసి చివరకు వెనక్కి తీసుకుంది. ఇది రాజ్యసభలో ప్రతిపక్ష మెజారిటీ వల్ల కలిగిన తొలి మేలు. బీమా బిల్లు, వస్తు– సేవల బిల్లు, ఇటీవల ట్రిపుల్ తలాఖ్ బిల్లు ప్రతిఘటనకు గురైనాయి. ఇకపై అటువంటి ఇబ్బందికర పరిస్థితి రాదని బిజెపి భావిస్తోంది. బలాబలాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పక్షం – ప్రతిపక్షం చర్చల ద్వారా పరస్పర సహకారంతో సాధ్యమైన మేరకు ఏకీభావం కొరకు కృషి చేయటం ప్రజాస్వామ్యానికి వన్నె తెస్తుంది. కాని బిజెపి ఏకపక్ష ధోరణి సమస్యలు తెచ్చి పెడుతున్నది.

రాజ్యసభలో ఆధిక్యం లభిస్తుందని బిజెపి నాయకత్వం సంతోషించవచ్చు. కాని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఓడినా ఓడకపోయినా, ఏక పార్టీ మెజారిటీ లభించబోదనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. అందువల్ల ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని గౌరవించటం, సమస్యలపై దాన్ని విశ్వాసంలోకి తీసుకోవటం ఏ ప్రభుత్వానికైనా గౌరవం తెస్తుంది. పాలక పార్టీలు దాన్ని ఆచరించటం అభిలషణీయం.

కొన ఊపిరిలో సెక్యులరిజం


చూపు

రాజకీయాలు గొంతు నొక్కుతుంటే సెక్యులరిజం (మత ప్రసక్తి లేని లౌకిక రాజ్యం) సూత్రం దేశంలో ఊపిరాడక గిలగిలలాడుతోంది. సెక్యులరిజం వ్యవస్థపై అధికారంలోని భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేరుగా విరుచుకుపడుతోంది. 'పౌరులపై ఆడిన పెద్ద అబద్ధం' అని సెక్యులరిజాన్ని ఆ పార్టీ ఇటీవల కొంత కాలంగా విమర్శిస్తోంది. కాంగ్రెస్ సుతిమెత్తని హిందూత్వ వైఖరిని అవలంబిస్తే, బిజెపి కఠిన హిందూత్వను చలాయిస్తోంది. మొత్తానికి రెండు పార్టీలూ తమ మత దృష్టితో సెక్యులరిజానికి శక్తి వంచన లేకుండా హాని కలిగించాయి. బాబ్రీ మసీదు కేసును సుప్రీం కోర్టు విచారించిన ఐదు రోజులకు 'రామరాజ్య రథయాత్ర' అయోధ్య నుంచి రామేశ్వరానికి మొదలయింది. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ప్రజల మద్దతు కూడగట్టే లక్ష్యంతో, ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుతో ఆ యాత్ర మొదలయింది.

హజ్ యాత్రకు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినా, హిందూ ప్రార్థనా స్థలాలకు సబ్సిడీలు మాత్రం కొనసాగుతున్నాయి. 'మైనారిటీలను బుజ్జగించడం నిలిపివేస్తేనే వారి నిజమైన అభివృద్ధి సాధ్యం' అని సాకు చూపుతూ హజ్ యాత్రకు సబ్సిడీలను నిలిపివేశారు. ఇందుకు సమర్థనగా రాజ్యాంగంలోని 27వ అధికరణను చూపుతున్నారు. పన్నుల సొమ్మును మతాలకు మళ్లించడం సెక్యులరిజానికి విరుద్ధమని ఆ అధికరణ పేర్కొంది. దివాళీ రోజున ఆగ్రాలో భగవాన్ రాముడు – సీతా దేవి ఆహ్వానానికి రూ. 165 కోట్లు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఖర్చు పెట్టడానికి ఈ అధికరణ అడ్డు రాలేదు!

2002 అల్లర్లలో గుజరాత్‌లో కూల్చివేసిన ప్రార్థనా స్థలాలు (చాలా వరకు ముస్లింలవి) తిరిగి నిర్మించడం కూడదని, ప్రభుత్వం – మతం వేర్వేరు కనుక వాటి పునర్నిర్మాణం వద్దని సుప్రీంకోర్టులో గుజరాత్ ప్రభుత్వం వాదించింది. అయితే ఆ కేసులో తీర్పు వెలువడిన నెల రోజులకు ప్రధాని మోడీ మాట మార్చారు. 2013 వరదలలో దెబ్బతిన్న కేదార్‌నాథ్ ఆలయాన్ని పునర్నిర్మించాలన్న తన విజ్ఞప్తిని యుపిఎ ప్రభుత్వం పట్టించుకోలేదని మోడీ విమర్శించారు. సరయూ నది ఒడ్డున వంద మీటర్ల ఎత్తు రాముడి విగ్రహాన్ని నిర్మిస్తానని యోగి ఆదిత్యనాథ్ కూడా ప్రతిజ్ఞ చేశారు. దీనిని బట్టి బిజెపి వాదనలోని వక్రీకరణ స్పష్టమవుతోంది. మైనారిటీ వర్గం ప్రార్థనా స్థలాల పునర్నిర్మాణం సెక్యులరిజం 'లక్ష్మణ రేఖ' కు విరుద్ధం. కానీ దివాళీ ఉత్సవాలకు హిందూ దేవుళ్లపై రూ. 165 కోట్లు ఖర్చు చేయడం మాత్రం విరుద్ధం కాదు.

ఇటీవల కొంత కాలంగా సెక్యులరిజంపై నేరుగా, బాహాటంగా బిజెపి నాయకులు విరుచుకుపడడం ఎక్కువయింది. 'పౌరులపై విసిరిన అతిపెద్ద అబద్ధం సెక్యులరిజం' అని ఆదిత్య నాథ్ వ్యాఖ్యానించారు. 'రాజ్యాంగం నుంచి సెక్యులరిజం పదాన్ని తొలగిస్తాం' అని కేంద్ర మంత్రి అనంత హెగ్డే ఇటీవల ప్రకటించారు. రాజకీయ చర్చల్లో సెక్యులరిజం పట్ల నిబద్ధత అనేదే ప్రస్తావనకు రావడం లేదు. ఎవరి నిర్వచనాలు ఎలా ఉన్నా సెక్యులరిజం అన్నది 'సహింపు' సూత్రమే తప్ప 'ఉత్సవ' సూత్రం కాదు. భిన్న మతాలను దృష్టిలో పెట్టుకొని ఆచరించేది. భిన్నత్వాన్ని కాపాడడానికి అనుసరించే 'వ్యూహం' అది. చివరకు దానిని 'కృత్రిమ అవయవం'గా దిగజార్చారు. భారత దేశపు రాజ్యాంగ స్ఫూర్తికి సెక్యులరిజం ఆధారం. దాని గుర్తింపు కూడా సెక్యులరిజంతో ముడిపడి ఉంది.



రాజ్యాంగ మూల సూత్రం కూడా అదే. సమూహాల మధ్య సమానత్వాన్ని ఆచరించి చూపేదే 'సెక్యులరిజం'. ఆ మూల సూత్రంపై ఎన్నో దాడులు సాగుతున్నా సుప్రీంకోర్టు భరింపరాని మౌనాన్ని ప్రదర్శిస్తోంది. మెజారిటీ వాదుల క్రూరత్వం నుండి రక్షించే ఏకైక వ్యవస్థ సుప్రీంకోర్టు. ప్రభుత్వ వ్యవహారాల్లో మత ప్రమేయం అత్యంత తక్కువగా ఉండడం భారత దేశంలో ముందు నుంచి వస్తున్న మంచి ఆనవాయితీ. జోక్యం చేసుకోవాల్సి వచ్చిన సందర్భాల్లో సూత్ర బద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. మన రాజ్యాంగం నిర్దేశిస్తున్న సూత్రాలను మరిచి సెక్యులరిజంపై ఇటీవల వ్యాఖ్యలు తరచూ వినవస్తున్నాయి. సాంస్కృతిక భిన్నత్వం మధ్య ఏకత్వం పాటించడమే సెర్యులరిజం మూల సూత్రం.

మెజారిటీ వాదానికి కళ్లెం వేయడమే సెక్యులరిజాన్ని రక్షించే మార్గం. ప్రస్తుతం న్యాయ వ్యవస్థ సెక్యులరిజంపై జరుగుతున్న దాడుల పట్ల 'దారిన పోయే దానయ్య' తరహాలో వ్యవహరిస్తోంది. ఎన్నికల తరుణంలో మతపరమైన హామీలు గుప్పించడం అవినీతి కిందకు వస్తుందని 1951 ప్రజా ప్రాతినిథ్య చట్టం నిర్దేశిస్తున్నదని, దానివల్ల అనర్హత సంప్రాప్తిస్తుందని ఏడుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు బెంచ్ ఒకటి 'అభిరామ్ సింగ్– కొమ్మాచెన్ కేసు'లో పేర్కొంది. ఈ తీర్పు వెలువడినప్పటికీ మత పరంగా ఓటర్లను రెచ్చగొట్టిన కేసులో ఒక్క రాజకీయ వేత్తకూడా ఇంతవరకు అరెస్టు కాలేదు. మైనారిటీలందరినీ పాకిస్థానీ మద్దతుదార్లుగా పేర్కొంటూ బాహాటంగా వ్యాఖ్యలు చేసినా ఒక్క నాయకుడు కూడా అరెస్టు కాలేదు. ఇటీవల ముగిసిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో స్వయంగా ప్రధాని మోడీ పాకిస్థాన్‌పై, ముస్లింలపై విషం కక్కారు.

బిజెపి ఎంపిలు కూడా తమ ప్రసంగాల్లో ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు బాహాటంగా చేశారు. అయినా వారిపై చర్యల ఊసు లేనే లేదు. మతసహనంపై నేరుగా దాడులు జరిగాయి. సుప్రీంకోర్టు బెంచ్ అభిరామ్ సింగ్ కేసులో ఇచ్చిన తీర్పును ఇటువంటి సందర్భాల్లో కఠినంగా అమలు పర్చాలి. 2016లో ఈ తీర్పు వెలువడింది. హిందూత్వను ఒక మతంగా కాకుండా ఒక జీవిత విధానంగా రమేష్ యశ్వంత్ – కాశీనాథ్ కుంటే మధ్య నడిచిన కేసులో పేర్కొనడం ద్వారా హిందూ మతం సెక్యులరిజానికి అనుగుణమైనదని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జెఎస్ వర్మ చెప్పారు. దీనితో హిందువులను సంబోధిస్తూ నేరుగా వ్యాఖ్యలు చేయడం సక్రమమే అని చాటినట్లు అయింది. 'దారిన పోయే దానయ్య' లా వ్యవహరించడం అంటే ఇదే.

సమాజంలోని కొన్ని వర్గాలపట్ల వివక్ష పాటించడం ఎటువంటి పరిస్థితులను సమర్థించదగ్గది కాదు. అలా చేస్తే మైనారిటీలపట్ల పద్ధతి ప్రకారం చూపే వివక్షలను సమర్థించడమే అవుతుంది. 2002లో గుజరాత్‌లో ధ్వంసమయిన ప్రార్థనాలయాల పునర్నిర్మాణాన్ని గట్టిగా వ్యతిరేకించిన ప్రభుత్వం కేదార్ నాథ్ ఆలయం పునర్నిర్మాణానికి పట్టుబట్టడం ఏమిటని అడగడం ద్వారా సెక్యులరిజాన్ని కాపాడే ప్రయత్నం కోర్టులు, సమాజం ప్రారంభించాలి. రాజకీయాల్లో రెండు నాల్కల ధోరణిని ప్రశ్నించాలి. కోర్టులు సెక్యులరిజం రక్షణకు దృఢంగా అడుగు వేయనిదే మౌలిక సూత్రమైన సమానత్వానికి ప్రమాదం తప్పదు. సెక్యులరిజం అన్నది శిలువ మోయడం వంటి కాదు. అది ఒక నగను ధరించడం వంటిది. సుప్రీం కోర్టు ఆ నగ పరిరక్షణకు పూనుకోవాలి. ఇది న్యాయ నిపుణుల డిమాండ్.

*** సత్యప్రసూన్, అశ్వినీ తల్లూర్**

సైన్యాధ్యక్షా, రాజకీయాలేల?



వాహెద్
7093788843

భారతసైన్యం రాజకీయాలకు దూరంగా ఉంటుందనీ, రాజకీయేతరమైనదని మనమందరం గట్టిగా నమ్ముతున్నాం. రాజకీయ చర్చల్లోకి, రాజకీయాల్లోకి సైన్యాన్ని లాగడం జాతీయవాద మౌలికసూత్రాలకు విరుద్ధంగా భావిస్తాం. కాని, పదవిలో ఉన్న ఆర్మీ జనరల్, సైన్యాధ్యక్షుడే రాజకీయాలు మాట్లాడితే మనమేం చేయాలి?

భారత సైనికదళాల అధిపతి జనరల్ బిపిన్ రావత్ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో తలదూర్చడమే. ఈశాన్య రాష్ట్రాల పరిస్థితులపై జరిగిన సెమినార్‌లో మాట్లాడుతూ జనరల్ రావత్ అస్సామ్‌లో ఎఐయుడిఎఫ్ అనే పార్టీ బిజెపి కన్నా చాలా వేగంగా పైకెదిగిందని అన్నారు. జనసంఘ్ పార్లమెంటులో ఇద్దరు సభ్యుల స్థాయి నుంచి బిజెపి నేడు ఎదిగిన వేగం కన్నా అస్సామ్ లో ఎఐయుడిఎఫ్ పార్టీ వేగంగా ఎదుగుతుందని ఆయన బల్లగుద్ది చెప్పారు. ఇలాంటి పరిస్థితులను మనం జాగ్రత్తగా గమనించాలని కూడా అన్నారు.

జనరల్ బిపిన్ రావత్ ఇంతవరకు ఆర్మీకి ఉన్న అత్యున్నత స్థానాన్ని, రాజకీయేతర సంస్థగా లభిస్తున్న గౌరవాన్ని మంటగలుపుతూ మాట్లాడారంటే తప్పు లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని సంతోషపెట్టేలా ఆయన మాటలున్నాయనిపించింది విన్నవాళ్ళకు. అంతేకాదు, పదవిలో ఉన్న ఆర్మీ చీఫ్ స్వయంగా ''మనం'', ''వాళ్ళు'' లాంటి విభజన పదాలు ఉపయోగించడం కూడా గమనించదగింది.

ఆర్మీ చీఫ్ ఈ మాటలు ఎందుకు చెప్పారు? ఎప్పుడు చెప్పారన్న ప్రశ్నలు ఆలోచించవలసినవి. పాకిస్తాన్, చైనాల నుంచి భారతదేశానికి ఎదురవుతున్న భద్రతాపరమైన సమస్యల గురించి ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్ నుంచి చొరబాటులనేవి పథకం ప్రకారం జరుగుతున్నాయని, పాకిస్తాన్ ప్రాక్సీ యుద్ధంలో ఇవి భాగాలని అన్నారు. చైనా అందుకు సహకారం అందిస్తుందని కూడా చెప్పారు. ఈ మాటల్లో అభ్యంతరకరమైనది ఏమీ లేదు. పాకిస్థాన్, చైనాల కుట్రలను కుతంత్రాలను తిప్పికొట్టవలసిన అవసరం ఉంది. ఆ పనే దేశంలోని భద్రతాదళాలు చేస్తున్నాయి. కాని అంతటితో జనరల్ రావత్ ఆగలేదు. అస్సామ్‌లో ముస్లిముల జనాభా పెరగడానికి అక్కడి రాజకీయపార్టీ ఎఐయుడిఎఫ్ రాజకీయంగా ఎదగడానికి లంకెపెట్టి మాట్లాడారు. అంతేకాదు, బిజెపి ఎదుగుదలకన్నా ఈ ఎదుగుదల చాలా వేగంగా ఉందని కూడా అన్నారు.

ఆయన మాటలకు అర్థము, అంతరార్థమేమిటి? ఈశాన్య రాష్ట్రాల్లో ముఖ్యంగా అస్సామ్‌లో ఒక పథకం ప్రకారం జరుగుతున్నాయని ఆయన చెప్పిన చొరబాటులకు, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంటుకు సంబంధం ఉందని ఆయన మాటల అంతరార్థం. ఇంకా గట్టిగా చెప్పాలంటే ఇలా వచ్చేసిన ముస్లిములు, చొరబాటుదారులు వేసిన ఓట్లవల్లనే ఎఐయుడిఎఫ్ గెలుస్తుందన్న అభిప్రాయం కలిగించేలా ఆయన మాట్లాడారు. కాని భారతసైన్యం వంటి ప్రతిష్ఠాత్మకమైన సేనకు నాయకత్వం వహిస్తున్న ఆర్మీ చీఫ్ కనీస సమాచారం కూడా లేకుండా మాట్లాడడం విచిత్రం. ఎఐయుడిఎఫ్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్ 2016 ఎన్నికల్లో ఓడిపోయారు. ఎఐయుడిఎఫ్ 2016లో గెలిచిన స్థానాలు కూడా చాలా తక్కువ. ఎఐయుడిఎఫ్ అక్టోబర్ 2005లో ఏర్పాటైంది.

పార్లమెంటులో ముగ్గురు సభ్యులు, అసెంబ్లీలో 13 మంది సభ్యులు ఈ పార్టీ నుంచి గెలిచారు. కాంగ్రెసు వ్యతిరేక రాజకీయాలతోనే ఎఐయుడిఎఫ్ అస్సామ్‌లో ఎదిగిందన్నది అందరికీ తెలుసు. బిజెపితో ఈ పార్టీకి సైద్ధాంతిక విభేదాలున్నాయే తప్ప రాజకీయంగా బిజెపి ఈ పార్టీకి ప్రధాన ప్రత్యర్థి కాదు. 2016 ఎన్నికల్లో కాంగ్రెసు అస్సామ్‌లో అధికారం కోల్పోయింది. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో 18 స్థానాలు గెలుచుకున్న ఎఐయుడిఎఫ్ ఈసారి మాత్రం కేవలం 13 స్థానాలే గెలుచుకుంది. ఇది ఎదుగుదల కాదు కదా. ఈ సమాచారం ఆర్మీ చీఫ్ వద్ద లేదా? ఎఐయుడిఎఫ్ పై కాంగ్రెసు నిలబెట్టిన అభ్యర్థులే కాదు బిజెపి నిలబెట్టిన అభ్యర్థులు కూడా గెలిచారు. అత్తరు వ్యాపారి బద్రుద్దీన్ అజ్మల్ స్థాపించిన ఎఐయుడిఎఫ్ అధినేత. ఆయన పోటీ చేసింది బెంగాలీ మాట్లాడే ముస్లిములు అధికంగా ఉన్న ధుబ్రీ నియోజకవర్గం నుంచి. కాని ఆయన 14 వేల ఓట్లతో ఓడిపోయాడు.

2005లో ఏర్పడిన ఎఐయుడిఎఫ్ 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఒక స్థానం గెలిచింది. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో 18 స్థానాలు గెలిచింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 3 స్థానాలు గెలవగలిగింది. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో 13 స్థానాలు గెలిచింది. ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఈ ఎదుగుదలను బిజెపి ఎదుగుదల కన్నా శరవేగంగా ఉందని అన్నారు. కాని నిజానికి 18 నుంచి 15 స్థానాలకు దిగజారింది. బిజెపి విషయానికి వస్తే 1984లో బిజెపి కేవలం 2 స్థానాలు మాత్రమే గెలవడానికి కారణం ఇందిరాగాంధీ హత్య తర్వాతి సానుభూతి గాలులు. 1989లో 89 స్థానాలు గెలుచుకుంది.

ఆర్మీ చీఫ్ గారు చెబుతున్నట్లు బిజెపి కన్నా ఎఐయుడిఎఫ్ చాలా వేగంగా ఎదుగుతుంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇంత చెత్తగా ఫలితాలు ఎందుకు వచ్చాయి. ఎఐయుడిఎఫ్ ఐదు స్థానాలు ఎందుకు తక్కువ పొందింది? ఎలా బిజెపి అధికారంలోకి రాగలిగింది? కాంగ్రెసు ఎఐయుడిఎఫ్ రెండు పోటీపడ్డాయి కాబట్టే బిజెపి గెలిచిందన్నది అందరికీ తెలుసు. ఇందులో నిర్ఘాంతపరిచే వేగంతో ఎఐయుడిఎఫ్ ఎదిగిపోతున్న సూచనలేవీ కనిపించడం లేదు. అస్సామ్‌లో ముస్లిముల జనాభా మొదటి నుంచి ఎక్కువే. 34 శాతం ముస్లిములున్నారు. కాబట్టి ఎఐయుడిఎఫ్ కనీసం 30 స్థానాలు గెలుస్తానని ఆశించింది. నిజం చెప్పాలంటే ఇప్పుడు ఎఐయుడిఎఫ్ పతనావస్థలో ఉన్న పార్టీగా అందరికీ కనిపిస్తున్న పార్టీ. భారతదేశంలోని రాజకీయ పార్టీల గురించి ఈ కనీస సమాచారం కూడాలేని ఆర్మీ చీఫ్ వద్ద చొరబాటుల గురించి సమాచారం ఉందా?

బంగ్లాదేశీ అక్రమ వలసల గురించిన సమస్య చాలా కాలంగా చాలా మంది ప్రస్తావిస్తున్నదే. కాని ఒక రాజకీయ పార్టీని లక్ష్యంగా చేసుకుని ఒక ఆర్మీ చీఫ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశంలో కొత్త రాజకీయాలకు నిదర్శనం కావచ్చు. ఎఐయుడిఎఫ్ ఎన్నికల కమిషన్ గుర్తించిన రాజకీయ పార్టీ. రాజకీయ పార్టీలకు దేశంలో పైకెదిగే రాజ్యాంగబద్ధమైన హక్కు ఉంది. ఎఐయుడిఎఫ్‌కి ఉంది, బిజెపికి ఉంది.

మరో ముఖ్యమైన విషయం ఏమంటే ఇప్పుడు బిజెపికి అనుంగు మిత్రుడిగా మారిన బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రెండేళ్ళ క్రితం బిజెపికి వ్యతిరేకంగా మహాకూటమి పెడుతున్నప్పుడు అస్సామ్ రాజకీయపార్టీలను కూడా అందులో పిలిచాడు. అలా పిలిచిన పార్టీలో అస్సామ్ గణసంగ్రామ్ పరిషద్, ఎఐయుడిఎఫ్ కూడా ఉన్నాయి. అస్సామ్ గణసంగ్రామ్ పరిషద్ వైఖరి వల్ల ఈ పార్టీలు కూటమిలో చేరలేదు. కాని అప్పుడు కూడా ఎఐయుడిఎఫ్ విషయంలో బంగ్లాదేశీ అక్రమ వలసదారులు ఓట్లేస్తే గెలుస్తున్న పార్టీ అని ఒక్కరు కూడా చెప్పలేదు. మరి ఆర్మీచీఫ్ కు ఈ సమాచారం ఎక్కడి నుంచి వచ్చింది. నితీష్ కుమార్ ప్రమాణస్వీకారానికి బద్రుద్దీన్ అజ్మల్‌ని కూడా ఆహ్వానించారప్పుడు. ఈ వాస్తవాలేవీ ఆర్మీ చీఫ్ కు తెలియవా? ఎఐయుడిఎఫ్ ఎదుగుదల కాదు ఇప్పుడు తిరోగమనంలో ఉందన్నది ఆయనకు తెలియదా? ఆ మాత్రం కనీస సమాచారమే ఆయనవద్ద లేనప్పుడు చొరబాటుదారులకు సంబంధించిన సమాచారం ఆయన వద్ద ఉంటుందా?

డిసెంబరు 2016లో బిపిన్ రావత్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇద్దరు సీనియర్ అధికారులను పక్కన పెట్టి ఆర్మీ చీఫ్‌గా నియమించింది. అప్పుడే ఆయన నియామకంపై విమర్శలు వచ్చాయి. టెర్రరిస్టు వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించడానిక ఆయనే సమర్థుడని ప్రభుత్వం చెప్పుకుంది. కాని ఇప్పుడు ఆయన బిజెపి వ్యతిరేక పార్టీలను లక్ష్యంగా చేసుకోవడంలో సమర్థునిగా కనిపిస్తున్నారు. ముస్లిముల బుజ్జగింపు రాజకీయాలంటూ ఇంతకాలం బిజెపి చెప్పిన మాటలే మరోవిధంగా ఆయన చెబుతున్నారు.

దేశంలో సైన్యం రాజకీయాలకు దూరంగా, రాజకీయేతర స్వభావంతో ఉండడం ఎంతో అవసరం. ఆర్మీ చీఫ్ వంటి బాధ్యతాయుత స్థానంలో ఉన్నవారు రాజకీయ వ్యాఖ్యలు చేస్తే సైన్యంలో కూడా రాజకీయాలు ప్రవేశిస్తాయి. భారత సైన్యం రాజకీయాలకు అతీతమైందని ఏళ్ళ తరబడి కఠినశ్రమతో సంపాదించుకున్న పేరు ప్రతిష్ఠలను ఒక్క మాటతో కుప్పకూల్చడం చాలా శోచనీయం. ఇలాంటి పరిస్థితి మరోసారి రాకూడదనే అందరూ కోరుకోవాలి.

పర్యవేక్షణ కరవైన అంగన్ వాడీలు



రావుల రాజేశం,
లెక్చరర్,
9848811424

అంగన్ వాడీ కేంద్రాలు గాడి తప్పాయి. అరకొర వసతులతో అద్దె భవనాలతో అవస్థలు పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అవినీతి సాగుతున్నదని క్షేత్రస్థాయిలో ప్రచారం ఉంది. సిబ్బంది కొరత, పని భారం వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పరిపాలన గాడి తప్పింది. అంగన్ వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చామని పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నా అవి కేవలం ఆహార పంపిణి కేంద్రాలుగా మారాయి. నిర్వాహకులు 40 రకాల రికార్డుల పూరించటంలోనే బిజీగా ఉంటున్నారు.

కనీసం అక్షర పరిజ్ఞానం కూడా ఈ కేంద్రాలు కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నో రకాల ఆక్టివిటీస్ నిర్వహించాల్సి ఉన్నా ఆహారం పెట్టి, 2 లేదా 3 గంటల పాటు పిల్లలను కేంద్రంలోనే ఉంచుకుంటున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణతో పాటు చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నిర్మూలించడం వంటి కార్యక్రమాలు చేయవల్సి ఉన్నా అవి సాగటం లేదు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రీ స్కూలు విధానంలో నడుపాలని, మహిళ,శిశు సంక్షేమ శాఖ జారీ చేసిన ఆదేశాలు అమలు కావటం లేదు.

తెలంగాణలో 149 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉండగా, గ్రామాల్లో 99, అర్బన్‌లో 25, ట్రైబుల్ 25 ఉన్నాయి. 31 వేల అంగన్ వాడీలు, 3,989 మినీ అంగన్ వాడీలు ఉండగా, 22 లక్షల 28 వేల మంది లబ్దిదారులు ఉండగా వీరిలో గర్భిణీలు, బాలింతలు 5 లక్షల మంది ఉన్నారు. 7 నెలల నుండి 3 సంవత్సరాలలోపు చిన్నారులు 10 లక్షల 43 వేల మంది, 3–6 సంవత్సరాలలోపు పసి పిల్లలు ఆరున్నర లక్షల మంది ఉన్నారు.

తెలంగాణలో 149 నేటికి ప్రాజెక్టుల్లో 5,479 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1360 టీచర్, 1010 మినీ అంగన్ వాడీ, 3109 హెల్పర్ పోస్టులు ఎన్నో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నా అవి భర్తీ కావటం లేదు. సూపర్ వైజర్, ప్రాజెక్టు ఆఫీసర్ పోస్టులు ఎన్నో ఏళ్ల నుంచి ఖాళీగా ఉండటం సరైన పర్యవేక్షణ సాగటం లేదు. ఒక్క సూపర్ వైజర్ ఒక్కో మండలం బాధ్యతలు మాత్రమే తీసుకోవాల్సి ఉండగా, 3 నుంచి 4 మండలాలకు ఇన్‌చార్జ్‌లుగా పని చేస్తున్నారు. అధిక పని భారం వల్ల సూపర్ వైజర్లు ఉన్న పనిని చేయలేకపోతున్నారు. ప్రాజెక్టు పరిధిలోని 'క్లస్టర్' ను సందర్శించి, వాటి పనితీరును బేరీజు వేయవల్సిన పర్యవేక్షకులు విధులను నిర్వహించటంలో 'టెన్షన్' పడుతున్నారు.

అరకొర వసతుల మధ్య కేంద్రాలు అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి. 80 శాతం అంగన్ వాడీలు అద్దె భవనాల్లో ఉన్నాయి. బోగస్ హాజరీ వేసి విద్యార్థుల సరకులను మాయం చేస్తున్నారని సెంటర్ల నిర్వాహకుల మీద ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని సెంటర్లలో టీచర్లు, విద్యార్థుల సరకులను దారి మళ్లిస్తుంటే ఆయాలు పట్టుకొని అడ్డుకొంటున్నారు. కొన్ని సెంటర్లలో అంగన్ వాడీ టీచర్ల మీద సూపర్ వైజర్లు బ్లాక్ మెయిల్ చేసి మామూళ్లు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండల సర్వసభ్య సమావేశాల్లో సమగ్ర శిశు అభివృద్ధి అంశం మీద చర్చ జరిగితే మీ సెంటర్‌ను మీరు బాగు చేసుకోండి. మీ టీచర్ తప్పు చేస్తే మాకు ఓరల్‌గా వద్దు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయండి అంటారు. కొన్ని సెంటర్ల గుడ్లు, ఇతర న్యూట్రిషన్ ఫుడ్‌ను దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్తులు, ఆయాలు ఫిర్యాదులు చేస్తున్నా వారిని పట్టించుకోవడం లేదు. షిఫ్ట్ షిఫ్ట్ చందంగా కొన్ని జిల్లాలో సెంటర్లు పని చేస్తున్నాయి. వారంలో క్లస్టర్ మీటింగ్‌లు, ప్రాజెక్టు మీటింగ్‌లు, సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాలకు అంటూ టీచర్లకు ఎన్నో పనులు అప్పగించడం వల్ల కేంద్రాల నిర్వహణ గాడి తప్పుతోంది.

అంగన్ వాడీ కేంద్రాల్లో మంచి నీరు, మరుగు దొడ్లు, గదుల వంటి కనీస సౌకర్యాలు కూడా ఉండటం లేదు. సరకులు నిల్వ చేయడానికి గదులు కూడా దొరకని పరిస్థితి కొన్ని సెంటర్లలో టీచర్ల రావటం లేదని, సరకులు పక్కదారి పట్టిస్తున్నారని గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఫిర్యాదు చేస్తున్నా వాటి మీద చర్యలు తీసుకోవటం లేదు. కొందరు ఎంఎల్‌ఎలు అనర్హులైన వారికి అక్రమంగా టీచర్ పోస్టులు కేటాయించారనే ఆరోపణ ఉంది. కొన్ని చోట్ల గ్రామ లీడర్లు ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులే టీచర్ ఉద్యోగాలు పొందారు. సెంటర్లు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయనే ఆరోపణలు వచ్చాయి.

శాశ్వత భవనాలు లేకపోవటం, ఉన్నా ప్రహరీ గోడ, మరుగు దొడ్లు లేకపోవటం గమనార్హం. సూపర్ వైజర్, ప్రాజెక్టు అధికారి, వంటి పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. ప్రభుత్వ హాస్టల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో సన బియ్యం అందిస్తున్నారు. అదేం పాపమో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు సర్కారు దొడ్డు బియ్యం అందించటం పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గుడ్ల విషయంలో కూడా అనేక ఆరోపణలు ఉన్నాయి. చిన్న సైజు గుడ్లను పిల్లలకు పెట్టి పౌల్ట్రీ వారికి కాసుల పంట పండిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కేంద్రాలు పిల్లలకు అందుబాటులో ఉండటం లేదు. పిల్లలుక దగ్గరలో పర్మినెంట్ భవనాలు నిర్మించాల్సి ఉంది. ఊరికి చివరన, పేరెంట్స్ తీసుకు వెళ్లటానికి ఇబ్బంది అయ్యే చోట 'అద్దె' కేంద్రాలు నడుపుతున్నారు. సెంటర్లలో ఎల్‌కెజి, యుకెజి ఇంగ్లీషు మీడియంలో బోధిస్తే, సర్కారు ప్రాథమిక పాఠశాలలు నిండే అవకాశం ఉంది. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అంగన్ వాడీ టీచర్లు. టీచర్ ట్రైనింగ్ శిక్షణ ఇచ్చి 'ఆంగ్ల' మీడియంలో బోధించే అవకాశం కల్పిస్తే, ప్రైవేటు కాన్వెంట్‌లకు వెళ్లే వారికి కళ్లెం పడుతుంది. మండలానికో సూపర్ వైజర్ బాధ్యతలు ఎంఇడి వంటి వారికి సీనియర్ హెచ్‌ఎం గా చేస్తే సెంటర్ల పని తీరు మెరుగుపడుతుంది. టీచర్లు, ఆయాల జీతాలు పెంచటం హర్షణీయం. కాని పెరిగిన జీతాల నిష్పత్తిలో వారితో సర్వీసు తీసుకోవటం లేదని ప్రజా ప్రతినిధులు అంటున్నారు.



నాలుగు ఆత్మహత్య రైతు కుటుంబాలతో సంగారెడ్డికి చెందిన నీలిమ, అవినాష్ నూతన దంపతులు. ఇన్‌సెట్‌లో సహాయం అందజేస్తున్న దృశ్యం.

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
మనపేజీ
మనందరిపేజీ
www.manatelangana.news
హైదరాబాద్ | ఆదివారం | 25 ఫిబ్రవరి | 2018

ఎదిగిన పిల్లలు ఎదపై కుంపట్లే

ఆత్మహత్య రైతు కుటుంబాల తల్లుల వేదన

గత డిసెంబర్ 23వ తేదీనాడు జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా భువనగిరి జిల్లాలోని రైతు ఆత్మహత్య కుటుంబాల సమావేశం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ముగిసింది. బాధిత కుటుంబాల సభ్యులందరు వారివారి గ్రామాలకు వెళ్లిపోతున్నారు. చివరగా ఇద్దరు అక్కలు మా దగ్గరికి వచ్చారు. అందులో ఒక అక్క బోరున ఏడ్చేసింది. నాకు చాలా ఆశ్చర్యం అనిపిందించి. నాకు ఆ అక్క గత 6 సంవత్సరాలుగా తెలుసు కానీ ఏ రోజు ఆమె కంటిలో నీళ్లు చూసిన గుర్తు లేదు. ''ఎందుకు రా ఏడుస్తున్నావు. అప్పుల వాళ్లు ఏమన్నా అన్నారా, ఆరోగ్య సమస్యలా, ఆర్థిక సమస్యలా ఏమిటి నీ సమస్య'' అని నేను, మిత్రుడు ఇస్త్రారి మరో

సగటున 30 సంవత్సరాల వయసులో భర్తను కోల్పోయి అప్పల వారి బాధలు ఎదుర్కొని ఆ తల్లులు వీళ్లను పెద్ద చేయటానికి ఎన్ని కష్ట, నష్టాలను ఓర్చుకున్నారో ఈ పిల్లలకు తెలియాల్సిన అవసరం ఉంది. మీకు ఏమి చేస్తే బాగుంటుందని అడిగినప్పడు ఈ కుటుంబాల మహిళలు అందరూ ఒక్క కంఠంతో చెప్పిన మాట ''మాకు కావలసిందంతా పిల్లల భవిష్యత్ '' అనే. నిజం చెప్పాలంటే ఈ సమాజంలో పిల్లల భవిష్యత్‌పై ఆశతో అత్యంత ధైర్యంగా బతుకుతున్న వారు ఎవరైనా ఉన్నారంటే మొదట చెప్పాల్సింది ఈ తల్లుల పేర్లే.

సారి అడిగాము. అన్నా ఈ సమస్యలు ఎప్పుడూ ఉన్నవే కానీ, పిల్లలు ఎదిగొచ్చిన తర్వాత మా కష్టాలు కొంతైనా తీరుతాయి అనుకుంటే ఆ పిల్లలే ఇప్పుడు ఎదురు తిరిగి మాట్లాడుతున్నరు. కొన్ని సార్లు కఠినంగా మాట్లాడుతున్నరు. ఏమి పాపం చేశామో మీ కడుపున పుట్టాము అని మరింత బాధ పెడుతున్నరు. ఇతరుల పిల్లలతో పోల్చుకుని తమకు ఆ అవకాశాలు లేవని మా మీద బాధపడుతున్నరు'' అన్నారు. అప్పుడు ఆ సమయానికి ''మీరేమీ బాధపడకండి మేమొచ్చి మీ పిల్లలతో మాట్లాడుతాము'' అని చెప్పాము. ఈ పిల్లలకు వాళ్ల అమ్మలు పడుతుండే కష్టాలు పూర్తిగా అర్థం కావటం లేదనిపిస్తుంది. సగటున 30 సంవత్సరాల వయసులో భర్తను కోల్పోయి అప్పుల వారి బాధలు ఎదుర్కొని ఆ తల్లులు వీళ్లను పెద్ద చేయటానికి ఎన్ని కష్ట, నష్టాలను ఓర్చుకున్నారో ఈ పిల్లలకు తెలియాల్సిన అవసరం ఉంది. మీకు ఏమి చేస్తే బాగుంటుందని అడిగినప్పుడు ఈ కుటుంబాల మహిళలు అందరూ ఒక్క కంఠంతో చెప్పిన మాట ''మాకు కావలసిందంతా పిల్లల భవిష్యత్ '' అనే. నిజం చెప్పాలంటే ఈ సమాజంలో పిల్లల భవిష్యత్‌పై ఆశతో అత్యంత ధైర్యంగా బతుకుతున్న వారు ఎవరైనా ఉన్నారంటే మొదట చెప్పాల్సింది ఈ తల్లుల పేర్లే. ఈ సందర్భంగా ఒక సంఘటన గుర్తు చేయాలనిపిస్తుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ హెచ్‌ఆర్‌ఎఫ్ బాధ్యులు పరిమళతో కలిసి వనపర్తి పక్కనే ఉన్న గ్రామంలో ఒక రైతు ఆత్మహత్య కుటుంబం వద్దకు వెళ్లాము. సహజంగా దగ్గరికి వెళ్లి మాట్లాడిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న రైతు ఫొటో (ఫ్రేమ్ చేయించి ఇంట్లో పెట్టుకునే ఫొటో, అందులో ఆత్మహత్య చేసుకున్న తేదీ కూడా ఉంటుంది)ను అడుగుతూ ఉంటాము. ఆ విధంగానే ఫొటో అడిగాము. ఆ అక్క ఫొటో బీరువాలో దాచానని చెప్పింది. సాధారణంగా ఎవరూ అలా బీరువాలో దాచరు. ఏ గోడకో తగిలిస్తారు. అందుకే నేను అడిగాను ఫొటో బీరువాలో ఎందుకు దాచారని, అప్పుడు ఆ అక్క చెప్పింది. ''ఈ మధ్య అప్పుల వాళ్ల సమస్యలు, పిల్లలను సాదడం మరీ కష్టమైందన్నా, కొన్నిసార్లు రాత్రి నిద్రపట్టక ఆయన ఫొటో వైపు చూస్తూ నేనూ అలా చేసుకుంటే బాగుంటుందేమో అనిపిస్తుంది. ఒకవేళ అలా చేస్తే పిల్లల పరిస్థితి ఏమైపోతుందో అని కనీసం ఆ ఆలోచన రాకుండా ఉండటానికి ఆయన ఫొటో కనిపించకుండా బీరువాలో పెట్టాను'' అని చెప్పి అప్పుడు ఫొటో తీసుకువచ్చి చూపించింది. ''పిల్లల భవిష్యత్తేకదన్నా మాకున్న ఏకైక ఆశ'' అని చెప్పింది. తల్లులు పిల్లల కోసం ఇలా కష్టాలను దిగమింగుకుని ముందుకు వెళ్తుంటే పిల్లలు కూడా పరిస్థితులను అర్థం చేసుకోవాలి. కాని ఈ విషయంలో మనం పిల్లలను కూడా అపార్థం చేసుకోవలసిన అవసరం లేదు. పరిస్థితులు, సామాజిక మాధ్యమాల ప్రభావం వారిమీద పడుతున్నది. పోటీతత్వంలో అన్ని అవకాశాలున్న మిగిలిన యువతతో వారు సెల్ ఫోన్లు, సినిమాలు తదితర విషయాలలో పోటీపడవలసి వస్తున్నది.

మెంటర్స్ గ్రూప్

సమాజంలో యువతలో కూడా చాలా మార్పు వస్తున్నది. రైతు ఆత్మహత్యల గురించి పట్టణాలలో నివసిస్తున్న యువత, విద్యార్థికులు ఆలోచిస్తున్నారు. ఆ ఆలోచనలో నుంచి వచ్చినదే ఈ మెంటర్స్ గ్రూప్. హైదరాబాద్‌లో నివసిస్తున్న యువకులు ఈ రైతు ఆత్మహత్య కుటుంబాలలోని యువకుల చదువు, వారి జీవనోపాధుల గురించి ఆలోచించటానికి ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశమవుతారు. ఆ కుటుంబంలోని పిల్లలను, యువకులను కలుసుకుంటారు. ప్రస్తుతానికి వారు భువనగిరి జిల్లాలోని రైతు ఆత్మహత్య కుటుంబాలను కలిసి వారికి కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వారి చదువు పూర్తయిన తర్వాత లభించే అవకాశాల గురించి సూచనలు, సలహాలు ఇస్తారు. అంతేకాకుండా వారి తల్లిదండ్రులు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, కుటుంబ పెద్దను కోల్పోయిన తర్వాత మిగిలిన వాళ్లు పడుతున్న కష్టా

మనది పూర్తిగా వ్యవసాయ ఆధారిత దేశం కాబట్టి చిన్నప్పటి నుండి వ్యవసాయంలో ఉన్న లాభ, నష్టాలు ప్రకృతి వైఫల్యాలు, మార్కెట్టు ధరలు, మన ఆహార పంటలు తదితర విషయాలు పాఠ్యాంశాలుగా ఉంటే వ్యవసాయంలో తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు వారికి అర్థమవుతాయి.

లను సున్నితంగా వివరిస్తారు. ఈ మెంటర్స్‌లో కొంత మంది కొందరు పిల్లల బాధ్యత తీసుకొని వారి చదువు, కుటుంబ పరిస్థితుల గురించి రెగ్యులర్‌గా తెలుసుకుని వారి కుటుంబ సభ్యులలో ఒకరుగా కలిసిపోతారు.

ఐదు సంవత్సరాలు వెనక్కు వెళదాం. న్యూయార్క్ టైమ్స్ దిన పత్రిక వారు రైతు ఆత్మహత్యలపై కాస్త భిన్నంగా అధ్యయనం చేద్దామనుకున్నారు. సాధారణంగా మీడియా వారు ఎవరైనా రైతు ఆత్మహత్య జరిగిన తర్వాత దానికి దారితీసిన పరిస్థితులు, అప్పటి కుటుంబ నేపథ్యం, ఆ కుటుంబంలోని పిల్లల చదువు, ఉపాధి మొదలగు విషయాలపై దృష్టి పెడతారు. కానీ వీరు మాత్రం ఆత్మహత్యకు ప్రయత్నించి బయటపడ్డ వాళ్లను కలిసి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై అధ్యయనం చేద్దామన్నారు. అప్పటికే 6 సంవత్సరాలుగా రైతు ఆత్మహత్యలపై పనిచేస్తున్న మేము కూడా ఇలా ఆత్మహత్యకు ప్రయత్నించి చివరి క్షణాలలో ప్రాణాలతో బయటపడ్డ వారిని కలుసుకోవాలనుకొన్నప్పుడు కొంత ఆశ్చర్యానికి లోనయ్యాము.



సమాజంలో యువతలో కూడా చాలా మార్పు వస్తున్నది. రైతు ఆత్మహత్యల గురించి పట్టణాలలో నివసిస్తున్న యువత, విద్యార్థికులు ఆలోచిస్తున్నారు. ఆ ఆలోచనలో నుంచి వచ్చినదే ఈ మెంటర్స్ గ్రూప్. హైదరాబాద్‌లో నివసిస్తున్న యువకులు ఈ రైతు ఆత్మహత్య కుటుంబాలలోని యువకుల చదువు, వారి జీవనోపాధుల గురించి ఆలోచించటానికి ప్రతి 15 రోజులకొకసారి సమావేశమవుతారు. ఆ కుటుంబాలలోని పిల్లలను, యువకులను కలుసుకుంటారు. ప్రస్తుతానికి వారు భువనగిరి జిల్లాలోని రైతు ఆత్మహత్య కుటుంబాలను కలిసి వారికి కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

ఎటువంటి వాస్తవాలు బయటికి వస్తాయో అన్న ఆసక్తి కూడా ఏర్పడింది. ఇక రైతు ఆత్మహత్య కుటుంబాల సమాచారం మా దగ్గర ఉండేది కాని ఆత్మహత్యకు ప్రయత్నించి బయటపడ్డవారి సమాచారం ఉండేది కాదు. అప్పుడు మేము హుస్నాబాద్ హాస్పిటల్‌కు వెళ్లి 108 వారి సహకారంతో డాక్టర్లకు విషయం వివరించి కొంతమంది ఆత్మహత్యకు ప్రయత్నించి బతికి బయటపడ్డవారి సమాచారం తీసుకున్నాము. వారి దగ్గరకు వెళ్లి ఎందుకు ఆత్మహత్య ప్రయత్నం వరకు వెళ్లవలసి వచ్చిందని అడిగినప్పుడు, అప్పులు, పంట నష్టం, బోరు విఫలం, పంటకు ధర లేకపోవడం లాంటి ఎప్పటి నుండో తెలిసిన కారణాలే చెప్పారు. కాని వారు చెప్పిన మరో కారణం మమ్మల్ని మరింత ఆశ్చర్యానికి గురి చేసింది. మేము ఇన్ని బాధలు, అప్పులు, అవమానాలతో సతమతమవుతుంటే చేతికొచ్చిన పిల్లలు (యువత) అవేవీ పట్టనట్టు సెల్‌ఫోన్లు, సినిమాలు, క్రికెట్టు అంటూ వారి లోకంలో వారు ఉంటున్నారు. వారు మా కష్టాలు తీరుస్తారని కాదు కాని, మా కష్టనష్టాలను బాధలను వారు విని ఉంటే మాకు కొంతైనా ఉపశమనం ఉంటుంది కదా అని ఆత్మహత్యకు ప్రయత్నించి బయటపడ్డ ఒక రైతు చెప్పిన మాట ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ అధ్యయనానికి ముందు, తర్వాత కూడా మేము ప్రస్తుత వ్యవసాయం – రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న పరిస్థితుల గురించి చాలా కళాశాలల్లో సమావేశాలు నిర్వహించాము. అప్పుడు కూడా కొంత మంది యువత ఆదివారాలు, సెలవు రోజులలో వ్యవసాయ పనుల్లో కుటుంబానికి సహకరిస్తామన్నారు. కాని విత్తనాల ధరలు, మార్కెట్ రేట్లు మొదలగు విషయాలు మా నాన్నకే తెలుసు అనే సమాధానంవచ్చేది.

వ్యవసాయం చదువులో భాగం కావాలి

మనది పూర్తిగా వ్యవసాయ ఆధారిత దేశం కాబట్టి చిన్నప్పటి నుండి వ్యవసాయంలో ఉన్న లాభ, నష్టాలు ప్రకృతి వైఫల్యాలు, మార్కెట్టు ధరలు, మన ఆహార పంటలు తదితర విషయాలు పాఠ్యాంశాలుగా ఉంటే వ్యవసాయంలో తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు వారికి అర్థమవుతాయి.

కొంతమంది రైతు ఆత్మహత్య కుటుంబాలలోని యువకులు ఎన్నో కష్టాలు ఎదుర్కొని తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబ బాధ్యతలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఈ కాలంలో యువతలో వస్తున్న మార్పుకు ఒక ఉదాహరణ నాకు గుర్తుకు వస్తుంది. సంగారెడ్డి పట్టణంలో గత నవంబర్ 11 నాడు జరిగిన ఒక పెళ్లికి హాజరయ్యాను. సాధారణంగా యువకులు చాలా హంగామాగా పెళ్ళిళ్లు చేసుకోవాలని అనుకుంటూ ఉంటారు. ఒక పెళ్లికి మించి ఇంకొక పెళ్లికి ఖర్చు పెట్టించాలనుకొంటారు. అలా లెక్కలేసుకుంటూపోతే

నీలిమ, అవినాష్ పెళ్లికి ఒక ప్రత్యేకత ఉంది. వారిద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు, అర్థం చేసుకున్నారు. పెద్దలను ఒప్పించారు. అంతేకాదు దేశానికి అన్నం పెట్టే రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకోవలసి వస్తుందో అధ్యయనం చేశారు. వారి పెళ్లి సందర్భంగా మామూలుగా అయ్యే ఖర్చును తగ్గించుకుని కొన్ని రైతు ఆత్మహత్య కుటుంబాలకు చేయూతనిద్దామని అనుకున్నారు. వారి పెళ్లిలో అది అమలు చేసి చూపించారు.

చేతికొచ్చిన పిల్లలు (యువత) సెల్‌ఫోన్లు, సినిమాలు, క్రికెట్టు అంటూ వారి లోకంలో వారు ఉంటున్నారు. వారు మా కష్టాలు తీరుస్తారని కాదు కాని, మా కష్టనష్టాలను బాధలను వారు విని ఉంటే మాకు కొంతైనా ఉపశమనం ఉంటుంది కదా అని ఆత్మహత్యకు ప్రయత్నించి బయటపడ్డ ఒక రైతు చెప్పిన మాట ఆశ్చర్యానికి గురి చేసింది.

దేశంలో ప్రతి సంవత్సరం పెళ్లిళ్లకు చేస్తున్న ఖర్చు 2 లక్షల కోట్లు అని అంచనా. ఆ రోజు సంగారెడ్డిలో జరిగిన నీలిమ, అవినాష్ పెళ్లికి మాత్రం ఒక ప్రత్యేకత ఉంది. వారిద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు, అర్థం చేసుకున్నారు. పెద్దలను ఒప్పించారు. అంతేకాదు దేశానికి అన్నం పెట్టే రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకోవలసి వస్తుందో అధ్యయనం చేశారు. వారి పెళ్లి సందర్భంగా మామూలుగా అయ్యే ఖర్చును తగ్గించుకుని కొన్ని రైతు ఆత్మహత్య కుటుంబాలకు చేయూతనిద్దామని అనుకున్నారు. వారి పెళ్లిలో అది అమలు చేసి చూపించారు. వ్యవసాయ సంక్షోభంలో అమరులైన ఆ కుటుంబాలను వేదిక మీదికి పిలిచి సన్మానించి, చేయూతనందించారు. ఈ సందర్భంగా మీడియాను ప్రత్యేకంగా అభినందించాలి. మొత్తం సంగారెడ్డి మీడియా అంతా పెళ్లి దగ్గర ఉందా అనిపించింది. ఏది ఏమైనా దేశంలో యువతలో మార్పు వస్తున్నది. రైతుల గురించి ఆలోచించే వారి సంఖ్య పెరుగుతున్నది. ఇదో మంచి పరిణామం. నీలిమ, అవినాష్ లాంటి దంపతులు ఈ దేశ రైతాంగానికి ఎంతో అవసరం. ప్రభుత్వ విషయానికి వస్తే ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలోని పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని జి.వో. 194లో ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారులు ఎక్కడా ఈ పిల్లల చదువు బాధ్యత తీసుకోలేదు. పిల్లలను సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు పంపటానికి తల్లులు ఇష్టపడటం లేదని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. ఇది కొంత నిజమే కావచ్చు. ఎందుకంటే అప్పుడే భర్తను కోల్పోయిన మహిళ ఆ షాక్ నుండి తేరుకోకముందే పిల్లలను కొద్దిగా దూరంగా పంపటానికి ఇష్టపడకపోవచ్చు. ఇక అధికారులకు మరుసటి సంవత్సరం ఈ పిల్లలు కాని, ఈ కుటుంబాలు కాని గుర్తుకు రారు.

ఐతే కేవలం సాంఘిక సంక్షేమ వసతి గృహాలలోనే కాకుండా ఇంటి దగ్గరి నుండి ఈ పిల్లలు చదువుకునే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలి. దేశంలోనే రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరిగిన రాష్ట్రం మహారాష్ట్ర. ఆ రాష్ట్రంలోని మరట్వాడ ప్రాంతంలోని బీడ్ జిల్లాలో ప్రభుత్వం, శాంతి నివాస్ సంస్థ ఆత్మహత్య చేసుకొన్న రైతు కటుంబాల పిల్లలు ధైర్యం కోల్పోకుండా ఉండటానికి, వారు జీవితంలో నిలదొక్కునే విధంగా చేయడానికి సహకరిస్తున్నట్టు తెలిపారు. మన రాష్ట్రంలో ప్రభుత్వం, సామాజిక సంస్థలు, ఇప్పటికే స్థిరపడిన యువత ఈ పిల్లల బాధ్యత తీసుకుంటారని ఆశిద్దాం.



బి.కొండల్‌రెడ్డి
(రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి)
9948897743

ఈ కస్టమర్ కొనేరకమేనా?

స్టార్టప్ కేంద్రాలకు నిలయంగా ఉండాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టి హబ్ సత్ఫలితాలను ఇస్తోంది. సృజనాత్మకతకు పెద్ద పీట వేసేందుకు , నూతన ఆలోచనలను పంచుకునేందుకు వేదికవుతోంది. సృజనాత్మక ఆలోచనలు ఉన్నా వాటిని ఆచరణలో పెట్టే దారి దొరకని వారికి.. డబ్బు ఇతర ఆర్థిక స్తోమత లేని వారికి ఒక వేదిక కల్పించడంలో టి హబ్ బాసటగా నిలుస్తోంది. కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో టి హబ్ కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించుకుంటోంది. టి– హబ్‌ను 2015 లో ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటి వరకు మొత్తం 346 స్టార్టప్‌లు ఆవిష్కృతమైనాయి. కాకుండా దేశీయంగా మరో 190 అలుమినీ స్టార్టప్స్ , 156 కరెంట్ కేటలిస్ట్ స్టార్టప్‌లతో కలిసి పని చేస్తోంది.

రూ.50కోట్ల రుణాలు ఆన్‌లైన్‌లోనే... : విద్యార్థులకు విద్యా రుణాలు, గృహిణులకు వ్యక్తిగత రుణాలు, వాణిజ్య రుణాలు అవసరమైన వారి కోసం మధ్య వర్తిగా ఉంటూ రుణాలు ఇప్పించే స్టార్టప్ కంపెనీ టి హబ్‌లో ఏర్పాటైంది. లోహరియా టెక్నాలజీస్ ప్రై లిమిటెడ్ అనే సంస్థ ఆయా విభాగాల్లో రుణాలను ఇప్పించనుంది. రుణాలు ఇచ్చేది బ్యాంకులు కాదు సుమా! ప్రైవేటు వ్యక్తులే. వడ్డీ కూడా బయట ప్రైవేటు సంస్థలు విధించే స్థాయిలో ఉండదు. రుణాలు ఒకటి రెండు రోజుల వ్యవధిలోనే లబ్దిదారులకు అందుతుండడం గమనార్హం. రుణాలు అవసరమైన వారు ఎనీటైమ్ లోన్ ఇన్ వెబ్ పోర్టల్ ద్వారా సంప్రదిస్తారు. వీరు రుణాలు ఇచ్చేందుకు సంసిద్ధత కనబర్చిన వ్యక్తుల నుండి ఆన్‌లైన్ ద్వారా ఇప్పిస్తారు. ఎవరు కూడా ఆయా వ్యక్తులను కలువాల్సిన పని లేదు. రుణం అవసరమైన వారు, రుణాలు ఇచ్చే వ్యక్తులు కూడా అంతా ఆన్‌లైన్ లోనే లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. వీరికి రుణాలిప్పించేందుకు టి–హబ్ మధ్య వర్తిత్వంగా ఉండడం గమనార్హం. 2016 నుండి ఇప్పటి వరకు రూ.50 కోట్లను రుణాలుగా ఇప్పించినట్లు ఆ సంస్థ టెక్నికల్ హెడ్ శశిధర్ రావు తెలిపారు.

కొనేవారేనా? టైం పాస్‌కు వచ్చారా చెప్పనున్న స్టార్టప్ : దుకాణాలు, హోటళ్లు, షాపింగ్ మాళ్ల యజ

టి–హబ్‌లో కొత్తపుంతల స్టార్టప్‌లు



మానులకు ఉపకరించే ఒక స్టార్టప్ టి హబ్‌లో పని చేస్తోంది. ఆన్ బోర్డ్ కస్టమర్ డాట్ కామ్ అనే ఈ స్టార్టప్ షాపులు, షాపింగ్ మాళ్లు, హోటళ్లకు తరుచుగా వచ్చే కస్టమర్ల గుణగణాలను ఇట్టే చెప్పేస్తుంది. ఆ కస్టమర్ ఇంతకీ కొనేరకమేనా? ఊరికే చూసి టైం పాస్ చేసి వెళ్తుంటారా? అన్న విషయాన్ని కూడా పసిగట్టేస్తుంది. తమ తమ షాపులకు వచ్చే రిపీట్ కస్టమర్లను గుర్తించి వారికి మరింతగా ప్రోత్సహించేందుకు షాపింగ్ మాళ్లు, యజమానుల వారు ఇటీవల గిఫ్ట్‌లు, ఇతర నజరానాలతో బుట్టలో వేసుకుంటున్నారు. ఈ కోవలోనే ఆన్‌బోర్డ్ కస్టమర్ స్టార్టప్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఆన్ బోర్డ్ కస్టమర్ స్టార్టప్ ద్వారా వినియోగదారుల సమయం వృథా కాకుండా నివారించవచ్చని, పనీ పాటా లేకుండా వచ్చే కస్టమర్ల తాకిడికి చెక్ పెట్టవచ్చని ఈ యాప్‌ను రూపొందించిన విజయ సాగి, అవినాష్ గొల్లపూడి తెలిపారు. ఇద్దరు మిత్రులను కలుపుకుని 18 నెలలు శ్రమించి ఈ ఆన్‌బోర్డు కస్టమర్ యాప్‌ను రూపొందించినట్లు వారు వెల్లడించారు.

బుక్ మై షో తరహా ఆన్‌లైన్ టికెటింగ్ సేవలు : బాహుబలి, కాటమ రాయుడు, గౌతమిపుత్ర శాతకర్ణి లాంటి చిత్రాలను విడుదలైన రోజే తొలి షోలోనే చూడాలనుకునే వారికోసం బుక్‌మై షో యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇలాంటి మరెన్నో యాప్‌లను టి హబ్‌లోనూ రూపొందిస్తున్నారు. యువతకున్న క్రేజీని ఈ యాప్‌లు తీరుస్తాయన్న తృప్తి తమకు నిలుస్తోందని టి హబ్ ఉద్యోగి ఎన్. గోవింద్ రాజన్ అన్నారు.

మై బస్ టికెట్స్ యాప్ : దసరా, సంక్రాంతిలాంటి పుండుగలు వస్తే రైలు ప్రయాణాల కంటే కూడా బస్సులో వెళ్లాలను కునే వారి కోసం మై బస్ టికెట్ యాప్‌ను టి హబ్ వేదికగా అందుబాటులోకి తెచ్చారు. ఒక్క ఫోన్ కాల్ ద్వారా బస్ టిక్కెట్లను సులభంగా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని మై బస్ టికెట్ యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఏజెన్సీల బెడద లేకుండా నేరుగా వినియోగదారులు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునేందుకు కూడా వీలు కల్పించారు. క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా నగదు రహిత లావాదేవీలకు మై బస్ టిక్కెట్ యాప్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మైబస్ టిక్కెట్ యాప్ ఉద్యోగి బి. సుధీర్ రెడ్డి తెలిపారు.

చిట్టీలు ఆన్‌లైన్‌లో : టి హబ్‌లో చిట్స్ మాంగ్స్ అనే రిజిస్ట్రర్డ్ చిట్స్ కంపెనీ వినియోగదారులకు ఆన్‌లైన్‌లో చిట్టీలను వేసేందుకు తన సహకారం అందిస్తోంది. చిట్టీలను ఆన్‌లైన్‌లో వేయడం కొత్తగానే ఉందనుకుంటున్నారా? నిజమే మరి. చిట్స్ మాంగ్స్ సిఇఓ పవన్ ఆదిపురం మన తెలంగాణతో మాట్లాడుతూ ఏడాది కిందటే ఆన్‌లైన్ చిట్స్ విధానాన్ని తమ సంస్థ కనుగొందన్నారు. టి హబ్‌కు ఈ విషయాన్ని తెలియజేయగా ప్రభుత్వం తమకు ఇక్కడ స్థలం ఇతరు సౌకర్యాలు కల్పించిందన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా సుమారు 22 జిల్లాలకు చెందిన 250 మంది కస్టమర్లు చిట్టీలను వేయడం, తీసుకోవడం లాంటి కార్యకలాపాలు చేశారన్నారు. వీరిలో 55 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులు కాగా, 45 శాతం మంది ప్రైవేట్ వ్యాపారులు, యువత ఉన్నారన్నారు.



కె.నరేష్ గౌడ్
మన తెలంగాణ ప్రతినిధి
9603462268

నాగాలాండ్‌లో తొలిసారి ఐదుగురు మహిళలు పోటీ!

కోహిమా : నాగాలాండ్ అసెంబ్లీకి ఈనెల 27న జరుగుతున్న ఎన్నికల్లో ఈసారి ఐదుగురు మహిళలు పోటీ చేస్తున్నారు. అసెంబ్లీలోని మొత్తం 60 సీట్లకుగాను 2.56 శాతం సీట్లకే మహిళలు పోటీ పడుతున్నారు. నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల చరిత్రలోనే ఎక్కువ సంఖ్యలో మహిళలు పోటీ చేయడం కూడా ఇదే మొదటిసారి అంటే ఆశ్చర్యం కలగకమానదు. నేషనల్ పీపుల్స్ పార్టీ నుంచి ఇద్దరు, కొత్తగా ఏర్పాటైన నేషనలిస్ట్ ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ పార్టీ నుంచి ఒకరు, భారతీయ జనతా పార్టీ నుంచి ఒకరు పోటీ చేస్తుండగా, మరొకరు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గత 15 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని నిరాటంకంగా పాలిస్తున్న నాగా పీపుల్స్ ఫ్రంట్ నుంచి ఒక్క మహిళ కూడా పోటీ చేయక పోవడం కూడా ఆశ్చర్యకరమే. 1963లో నాగాలాండ్ ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు 19 మంది మహిళలు పోటీ చేయగా, ఇంతవరకు ఒక్కరు కూడా విజయం సాధించలేదు. ఇంతవరకు నాగాలాండ్ నుంచి పార్లమెంట్‌కు ఎన్నికల్లో పోటీచేసి ఒకే ఒక మహిళ విజయం సాధించారు. 1977లో యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ తరపున లోక్‌సభకు పోటీ చేసి రానో ఎం సాయిజ్ విజయం సాధించారు.



తెలంగాణ శాస్త్ర, సాంకేతిక మండలి సభ్య కార్యదర్శిగా రవికుమార్

మన తెలంగాణ / హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి సభ్య కార్యదర్శిగా పి.రవికుమార్‌ను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఆటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతికశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటి)లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రవికుమార్‌ను సభ్య కార్యదర్శిగా నియమించారు. ఇంఛార్జీగా ఉన్న కొనసాగుతున్న జికృష్ణవేణిని అక్కడ నుంచి రిలీవ్ చేశారు.

కోణార్క్‌లో బాంబులు

(మొదటిపేజీ తరువాయి)

ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్–11 బోగిలో ప్రయాణికులు గుర్తు తెలియని వ్యక్తులకు చెందిన రెండు నీలి రంగు బ్యాగులను గమనించి టిసికి ఫిర్యాదు చేశారు. టిసి పోలీసులకు సమాచారం అందివ్వగా రైలును మధిర స్టేషన్‌లో నిలిపి పేసి ఎస్–11 బోగిని క్షుణ్ణంగా పరిశీలించారు. బోగిలో అరకేజి బరువు గల రెండు సంచులను గమనించిన పోలీసులు ఖమ్మం డాగ్ స్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన మధిర చేరుకున్న డాగ్ స్క్వాడ్ తనిఖీ నిర్వహించి బాంబులు ఉన్నట్లు అనుమానించి పై అధికారులకు సమాచారం అందించారు. అధికారుల ఆదేశాల మేరకు అంబార్‌పేట చెరువు వద్ద నిర్జన ప్రదేశానికి బ్యాగులను తరలించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక పోలీసు అధికారుల బృందం రానుందని వారు వచ్చిన అనంతరం పూర్తిస్థాయిలో తనిఖీ నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు. విషయం పట్టణంలో ప్రచారం కావడంతో బాంబుల సంచులను చూసేందుకు చెరువు వద్దకు జనం తరలి వచ్చారు. ఆర్‌పిఎస్ ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, జనార్ధన్, జిఆర్‌పి ఎస్ఐ రవికుమార్, స్థానిక సిఎస్ఐ తిరుపతి రెడ్డి తనిఖీలో పాల్గొన్నారు.

మునిపల్లె రాజు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

కుమారులు ఉన్నారు. 12 ఏళ్ల వయస్సు నుంచే ఆయన కథలు రాయటం ప్రారంభించారు. అస్థిత్వవాదానికి ఆవలి తీరాన, దివో స్వప్నాలతో ముఖాముఖి, పుష్పాలు–ప్రేమికులు–పశువులు, లసిపోయినవాడి అరణ్యకాలు, ఈతరం కోసం కథా స్రవంతి వంటి వందకు పైగా పుస్తకాలు రచించారు. అస్తిత్వవాదానికి ఆవలి తీరాన అనే రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఆయన తన కథల్లో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు ప్రతిబింబించాయి. ఆయన మరణ వార్త తెలుసుకున్న స్నేహితులు, అభిమానులు, పలువురు ప్రముఖులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆయన నివాసంలో భౌతికాయానికి ఘన నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రైతు సమితుల ప్రాంతీయ సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులకు దిశానిర్దేశం చేయనున్నారు. రైతులకు ఏ విధంగా సహకరించాలో వివరించడంతో పాటు, సభ్యులు అడిగే ప్రశ్నలకు సిఎం సమాధానం కూడా ఇవ్వనున్నారు. పంట విత్తుకునే దగ్గర నుంచి, పంట కోత అనంతరం ఉత్పత్తిని అమ్ముకునే వరకు సమితుల బాధ్యతపై ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వుల ద్వారా స్పష్టం చేసినా వీటిని ఈ సదస్సు సందర్భంగా సిఎం సమితి సభ్యులతో పంచుకోనున్నారు. ఏప్రిల్ 20 నుంచి పెట్టుబడి పథకం కింద పంపిణీ చేయనున్న ఎకరాకు రూ.4 వేలు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏ విధంగా ప్రతీ రైతుకు చేర్చాలనే దానిపై కూడా సిఎం వివరించనున్నారు. ఇందుకు సంబంధించి కర పత్రాలను కూడా పంపిణీ చేయనున్నారు. రైతులకు నోట్‌బుక్స్ కూడా ఇవ్వనున్నట్లు తెలిసింది. మొత్తంగా 8 వేల మంది రైతులు (సభ్యులు) ఈ సదస్సుకు హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. ఒక్కో మండల సమితికి ఒక్కో అధికారి చొప్పున నియమించారు. జిల్లాల నుంచి బస్సులలో తరలిరానున్న రైతులకు భోజన వసతి కూడా కల్పించనున్నారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల్, వనపర్తి, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, జనగాం, సంగారెడ్డి, మెదక్ జిల్లాల మండల, జిల్లా రైతు సమన్వయ సమితుల సభ్యులు హాజరుకానున్నరు. అలాగే సంబంధిత జిల్లాల ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మన రాష్ట్ర చరిత్రలో ఇంత మొత్తం మంది రైతులతో సదస్సు నిర్వహించడం ఇదే మొదటి సారి అని పలువురు పేర్కొంటున్నారు. ఇదే సదస్సులో ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డిని ఛైర్మన్‌గా ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది.

ప్రశాంతంగా టిఆర్‌టి

(మొదటిపేజీ తరువాయి)

కంప్యూటర్ ఆధారిత పరీక్షల(సిబిఆర్‌టి)ను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన లాంగ్వేజ్ పండిట్(తెలుగు) పరీక్షలకు మొత్తం 19,790 మంది రిజిష్టర్ చేసుకోగా, 19,333 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. ఉదయం పరీక్షలకు 92 శాతం హాజరు నమోదైందని టిఎస్‌పిఎస్‌సి వెల్లడించింది. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఎస్ఎ(తెలుగు) పరీక్షలకు 16,827 మంది రిజిష్టర్ చేసుకోగా, 15,473 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని, ఈ పరీక్షలకు 85.43 శాతం హాజరు నమోదైందని తెలిపింది. టిఎస్‌పిఎస్‌సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ సెంటర్ ద్వారా తాము పరీక్షల నిర్వహణను పర్యవేక్షించినట్లు కమిషన్ కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ పేర్కొన్నారు. అలాగే టిఎస్‌పిఎస్‌సి నియమించిన జోనల్ కో ఆర్డినేటర్లు, స్పెషల్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారని తెలిపారు. టిఆర్‌టి పరీక్షల్లో ఆదివారం జరుగనున్న పరీక్షలు ఒఎంఆర్(ఆఫ్‌లైన్) విధానంలో జరుగనున్నాయి. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు సెకండరీ గ్రేడ్ టీచర్–ఎస్‌జిటి(తెలుగు మీడియం), మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌జిటి(ఇంగ్లీష్ మీడియం) పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం జరుగనున్న పరీక్షలకు 57,464 మంది హాజరుకానుండగా, హెచ్ఎండిఎ పరిధిలో 86 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు టిఎస్‌పిఎస్‌సి తెలిపింది.

28 నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 1,294 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1,294 ఛీఫ్ సూపరింటెండెంట్లను, 25,395 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని అన్నారు. ఉదయం 8.45 గంటల నుంచి 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందని, ఉదయం 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాలు తెరిచి ఉంటాయని, 8.30 గంటల నుంచి లోపలికి అనుమతిస్తామని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష ముగిసే ఎవరూ బయటకు వెళ్లేందుకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను విద్యార్థులతోపాటు ఛీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు కూడా అనుమతించమని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు మొత్తం 9,63,546 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఎ.అశోక్ తెలిపారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్లు 04024601010 /24732369లలో సంప్రదించాలని అన్నారు. www.admi.tsbie. cgg. gov.in, www.tsbie.cgg.gov.in వెబ్‌సైట్ల నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

‘జనధన్ లూటీ యోజన’

● భారత్‌ను దోచేస్తున్న మోడీ ● ప్రధానిపై విమర్శనాస్త్రాలు సంధించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: దేశంలో వరుసగా జరుగుతున్న ఆర్థిక కుంభకోణాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి వ్యంగాస్త్రాలు సంధించారు. తాజాగా ద్వారకా దాస్ సేఠ్ ఇంటర్నేషనల్ ప్రమోటర్ రూ. 389.85 కోట్ల మేరకు ఓరియంట్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌కు మోసం చేసి పారిపోయాడు. అతడు కూడా నీరవ్ మోడీ పద్ధతిలోనే నకిలీ లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎంఒయు) ద్వారా బ్యాంకును మోసగించి, విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ మాదిరిగానే దేశం వదిలి పారిపోయాడు. ఈ తాజా మోసాన్ని రాహుల్ తూర్పారబడుతూ ‘మోడీ నేతృత్వంలో మరో జనధన్ లూటీ యోజన’ అని సంబోధించారు. పైగా దానికి హ్యాష్‌ట్యాగ్‌గా ‘భారత్‌ను దోచేస్తున్న మోడీ’ అని పోస్ట్ ట్వీట్ చేశారు. బ్యాంకు ఫిర్యాదు చేసిన ఆరు నెలలకు సిబిఐ కంపెనీ డైరెక్టర్లయిన సభ్య సేఠ్, రీటా సేఠ్, కృష్ణ కుమార్ సింగ్, రవి సింగ్‌లపై కేసు నమోదు చేసింది. లంచం, అవినీతి రహిత పాలన అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వానికి ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. కాగా గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో శుక్రవారం మోడీ ప్రసంగిస్తూ ప్రజా ధనాన్ని లూటీ చేసే వారిని, ఆర్థిక అవతవకలకు పాల్పడేవారిని సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



అధికారంలోకి వస్తే ‘మహిళా బిల్లు’

రానున్న ఎన్నికల రెండో దశ ప్రచారంలో భాగంగా ఉత్తర కర్నాటకలో పర్యటిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తాము అధికారంలోకి వస్తే పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ మహిళలకు టికెట్లు ఇవ్వాలని ఆయన కర్నాటకలోని పిసిసి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సిఎం సిద్ధరామయ్యకు సూచించారు. పంచాయతీరాజ్‌లో మహిళల రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కృషి చేసిందని, ఇప్పుడు అధికారంలోకి వస్తే అసెంబ్లీ, పార్లమెంటులో కూడా మహిళలకు రిజర్వేషన్ ఇచ్చే బిల్లును ఆమోదిస్తుందని అన్నారు. టికోట(కర్నాటక)లో ‘స్త్రీ శక్తి సమావేశం’ పేరిట జరిగిన మహిళా ర్యాలీలో ప్రసంగించిన ఆయన ఈ విషయం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్క మహాదేవి, 12 వ శతాబ్ది కవయిత్రి, సామాజిక సంస్కర్త కిట్టూర్‌కు చెందిన రాణి చెన్నమ్మను గుర్తుచేశారు.

కౌలుదారు తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చేలా గెజిట్ పేర్కొనింది. పాత చట్టంలో ఉన్న ‘కౌలుదారు, తనఖాదారు’ అనే పదాలను పూర్తిగా తొలగిస్తూ ఈ ఆర్డినెన్స్‌లో పేర్కొనింది. ‘సాదా బైనామా’ లాంటి డాక్యుమెంట్లు లేకపోయినా గ్రామాధికారులు క్షేత్రస్థాయి పర్యటన జరిపి గ్రామసభలో చర్చించి ఆమోదం పొందిన తర్వాత ఐదు ఎకరాల వరకు లబ్ధిదారులకు ఆ భూమిని క్రమబద్ధీకరించే అధికారాన్ని తహసీల్దార్‌కు కట్టబెడుతూ ఈ ఆర్డినెన్స్‌లో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ‘తెలంగాణ రైట్స్ ఇన్ లాండ్ అండ్ పట్టాదారు పాస్‌బుక్స్ (అమెండ్‌మెంట్) చట్టం 2018’ పేరుతో పిలిచే కొత్త చట్టం కోసం ఆర్డినెన్సులో ఇంకా పలు సవరణలను ప్రభుత్వం ప్రస్తావించింది. గతేడాది ఇదే అంశానికి సంబంధించి ఒక ఆర్డినెన్సును ప్రభుత్వం రూపొందించినా శాసనసభలో ఆమోదం పొందకపోవడంతో దాన్నిరద్దు చేస్తూ ఇప్పుడు కొత్తగా మళ్ళీ ఆర్డినెన్సును తీసుకొచ్చింది. అనుభవదారునిగా, కొనసాగింపుగా, వారసత్వంగా, ఆస్తుల విభజనలో భాగంగా, ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాగా, కోర్టు ఉత్తర్వుల ద్వారా... ఇలా వివిధ రకాలుగా భూమి సంక్రమించినట్లయితే వారు నెల రోజులలోగా ఆ భూమి యాజమాన్య హక్కుల కోసం తహసీల్దారుకు దరఖాస్తు చేసుకోవాలని, దాని ఆధారంగా గ్రామ రెవిన్యూ అధికారి పరిశీలన జరిపి ఒక రోజులోపే తహసీల్దారుకు సమాచారం ఇవ్వాలని, సదరు దరఖాస్తుదారునికి కూడా దీనికి సంబంధించిన వివరాలను తెలియజేయాలని ఆర్డినెన్సులో ప్రభుత్వం పేర్కొనింది. ఒకవేళ సదరు దరఖాస్తుదారు మైనర్ అయినట్లయితే సంరక్షకులకు ఆ భూమిపై హక్కులు దఖలుపరిచేలా కూడా సవరణ ప్రతిపాదించింది. భూములకు సంబంధించిన వివరాలన్నీ పాస్‌బుక్‌లో నమోదై ఉంటాయి కాబట్టి వాటిలో ఏవైనా సవరణలు లేదా మార్పులు చేర్పులు చేయాల్సి వస్తే లేదా అక్షర దోషాలను సవరించాల్సి వస్తే తహసీల్దారుకు పూర్తి అధికారాలు ఉండేలా కూడా సవరణ ప్రతిపాదించింది. పాత చట్టంలోని సెక్షన్ ‘5 ఏ’ ప్రకారం దరఖాస్తుదారులు గతేడాది డిసెంబరు 31వరకు సమర్పించిన ఫిర్యాదులను తహసీల్దారు పరిశీలించి సాదా బైనామా డాక్యుమెంట్ లేకపోయినా ఆ భూములను తాసీల్దారు క్రమబద్ధీకరించే వీలు ఉంటుంది. ‘పట్టాదారు పాస్‌బుక్’ అనే పదాల స్థానంలో ‘ఎలక్ట్రానికల్లీ మెయింటెయిన్డ్ పట్టాదారు పాస్‌బుక్’ అనే పదాలను చేర్చాలని పేర్కొనింది. గతంలో పాస్‌బుక్‌ను తనఖా పెట్టుకోవచ్చనే అంశాన్ని పూర్తిగా ఎత్తివేసింది. అదే విధంగా కౌలుదారులు, తనఖాపెట్టుకున్నవారు అనే పదాల స్థానంలో పట్టాదారు అని ఉండేలా ప్రతిపాదించింది.

పాత చట్టంలోని ఆరవ సెక్షన్‌లో ఏమున్నప్పటికీ కూడా కొత్త చట్టంలో చేస్తున్న సవరణ ప్రకారం ఆర్ఓఆర్‌లోని 1బి ప్రకారం క్రెడిట్ ఏజెన్సీలు రుణం మంజూరు చేయవచ్చునని, పట్టాదారు పాస్‌బుక్ కోసం పట్టుబట్టాల్సిన అవసరం లేదని ప్రతిపాదించింది. జాగీరు భూములు, పైగా భూములు, సంస్థానం భూములు, మక్త భూములు, గ్రామ అగ్రహారాలు, ఉమ్లీ, ముకాసా భూములు తదితరాలపై ఉన్న హక్కులను ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తులకు బదలాయించే అవకాశమే లేదని, గతంలో కోర్టు తీర్పులు లేదా ఇతర ఉత్తర్వులు ఉన్నా అవి చెల్లుబాటు కావని పదవ ప్రతిపాదనలో ప్రభుత్వం ఈ ఆర్డినెన్సు ద్వారా స్పష్టం చేసింది. జాగీరు భూములను ప్రభుత్వ భూములుగానే రెవిన్యూ రికార్డుల్లో పేర్కొనాలని స్పష్టం చేసింది. తెలంగా ప్రభుత్వం 2017లో జారీ చేసిన ఆర్డినెన్సును రద్దు చేస్తున్నట్లు తాజా ఆర్డినెన్సులో స్పష్టం చేసింది.

ఇంటర్ అర్హతతో ఇంటిగ్రేటెడ్ బి.ఇడి

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయ విద్యలో ఇంటిగ్రేటెడ్ బి.ఇడి కోర్సు అందుబాటులోకి రానుంది. ఇంటర్ అర్హతతో నాలుగేళ్ల బిఎస్‌సి.బిఇడి, బిఎ.బిఇడి కోర్సుల్లో ప్రవేశాలు కల్పించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. నూతన ఉపాధ్యాయ కోర్సుపై నేషనల్ కౌన్సెల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సిటిఇ) ఇప్పటికే వివిధ రాష్ట్రాల అభిప్రాయం కోరగా, యూనివర్సిటీలు సైతం తమ అభిప్రాయాన్ని తెలపాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ వర్సిటీలకు లేఖలు రాసింది. 2019–20 విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దేశంలోని నాలుగు రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఇ)లలో ఇప్పటికే డిగ్రీ, బి.ఇడి కోర్సుల సిలబస్‌లను సమీకృతం చేసి ఈ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులు రాష్ట్రాల వర్సిటీలలో అమలు చేసేందుకు ఎన్‌సిఇటి కసరత్తు చేస్తోంది. ఇంజనీరింగ్, మెడిసిన్ తరహాలో ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే విద్యార్థులు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశం పొందే వీలు కలుగుతుంది. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమెస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులు చదివినవారు బిఎస్‌సి.బిఇడి కోర్సు, హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులు చదివినవారు బిఎ.బిఇడి కోర్సులకు అర్హత లభిస్తుంది. ఇంటిగ్రేటెడ్ కోర్సు ద్వారా నాలుగేళ్లలోనే రెండు డిగ్రీలు పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం న్యాయవిద్యలో ఇంటర్ అర్హతతో బిఎ.ఎల్ఎల్‌బి, బి.కాం.ఎల్ఎల్‌బి, బిబిఎల్ఎల్‌బి వంటి ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఉండగా, త్వరలో ఉపాధ్యాయ విద్యలో ఈ తరహా కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

ఒప్పందం రద్దు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోవాలన్న నిర్ణయానికి దారితీసింది. ఒప్పందం సమయంలో మౌనంగా ఉన్న ప్రింటింగ్ ప్రెస్ మధ్యలో మాట మార్చి రూ. 250 ఇవ్వాలని పట్టుబట్టడాన్ని ముఖ్యమంత్రి సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకుని మళ్ళీ టెండర్లను ఆహ్వానించి ముద్రణ ప్రారంభమయ్యేందుకు అవసరమైన చర్యలను వెంటనే మొదలు పెట్టాలని అధికారులను సిఎం ఆదేశించినట్లు సమాచారం. సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ తీరువల్లనే పాస్‌బుక్‌ల పంపిణీ ప్రక్రియను వాయిదా వేయాల్సి వస్తోందని సిఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అధికారుల ద్వారా తెలిసింది. పాస్‌బుక్‌ల ముద్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జనవరిలోనే కసరత్తు ప్రారంభించి రెండవ వారంలో ఇరవై ప్రైవేటు ముద్రణా సంస్థలతో తొలి సమావేశం ఏర్పాటుచేసి భద్రతా ప్రమాణాల గురించి వివరించింది. ఆ తర్వాత సచివాలయంలో ప్రీ బిడ్డింగ్ సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. జనవరి చివరి వారంలో టెండర్ల దాఖలు గడువు ముగిసిపోయినా ఒక్క ముద్రణా సంస్థ కూడా ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు చర్చలను ప్రారంభించి ఈ నెల 14వ తేదీన ఒక్కో పుస్తకాన్ని రూ. 200 చొప్పున ముద్రించేలా అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వారం రోజులైనా ముద్రణ ప్రారంభం కాకపోవడంతో తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసి ప్రెస్ అధికారుల నుంచి వివరణ కోరారు. మార్చి 11వ తేదీకల్లా ఇవ్వకపోతే జరీమానా విధించే నిబంధనను ఎత్తివేయాలని, గడువును పొడిగించాలని, రైతుల వివరాలను పాస్‌బుక్‌లో ముద్రించే సాఫ్ట్‌వేర్ ఇబ్బందులను తొలగించాలని ప్రెస్ అధికారులు లేఖ రాశారు. ఇలా వారం రోజుల పాటు రెండు సంస్థల మధ్య ఏకాభిప్రాయం సాధ్యంకాకపోవడంతో రెండు రోజుల క్రితం ప్రధాన కార్యదర్శి సమీక్షించి, శనివారం ఉదయం సిఎం దృష్టికి తీసుకెళ్ళడంతో ఒప్పందం నిర్ణయం జరిగింది.

టెండర్లను ఆహ్వానించిన టిఎస్‌టిఎస్

సెక్యూరిటీ ప్రింటింగ్‌ప్రెస్‌తో ఒప్పందం రద్దుచేసుకునే సమయంలోనే మళ్ళీ టెండర్లను ఆహ్వానించే కసరత్తు పూర్తిచేసిన తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ శుక్రవారం సాయంత్రానికే టెండర్లకు ఆహ్వానం పలికింది. టెండర్‌కు సంబంధించి మెయిల్ ద్వారా వివరణలను కూడా అందించింది. పాత టెండరు డాక్యుమెంట్‌కు కొన్ని సవరణలను ఈ నెల 26వ తేదీకల్లా పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేసి వచ్చే నెల 2వ తేదీకల్లా టెండర్లను సమర్పించాలని గడువును నిర్ణయించింది. ప్రతి ఐదు లక్షల పాస్‌బుక్‌లను ముద్రించినవెంటనే డబ్బుల్ని చెల్లించనున్నట్లు పేర్కొనింది. గతంలోని 18 భద్రతా ప్రమాణాల్లో ఒకదాన్ని టిఎస్‌టిఎస్ ఎత్తివేసింది. తక్కువ ధరకు ముందుకొచ్చి అర్హత సాధించిన ప్రింటింగ్ ప్రెస్‌కు మొత్తం 72 లక్షల పాస్‌బుక్‌లలోని 60 శాతాన్ని ముద్రించే ఆర్డర్‌ను ఇచ్చేలా, ఆ తర్వాతి స్థానంలో అర్హత పొందిన సంస్థలకు 20%, 10% చొప్పున ఇచ్చేలా స్పష్టత ఇచ్చింది.

ఫార్మాలో మనమే ఫస్ట్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని కేంద్ర మంత్రికి సూచించారు. ఫార్మా పరిశ్రమ అభివృద్ధికి , ఎక్స్‌పోర్ట్స్‌కు కేంద్రం సహకారం అందించాలని కోరారు. స్టార్టప్‌లకు కూడా ఆర్థిక సాయం చేయాలని కోరారు. స్థానిక ఫార్మా తయారీదారులపై అధిక భారం వేస్తున్నారని, దీనిపై కేంద్రానికి తెలంగాణ ఒక రిపోర్టును కూడా అందజేయాలని అనుకుంటోందని తెలిపారు. ఆర్ అండ్ డి కేంద్రాలను బలోపేతం చేసేందుకు కేంద్రం ఆలోచన చేస్తోందని సురేష్ ప్రభు బదులిచ్చారు. కొంత ఫండ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తోందని, ఫార్మా ఇండస్ట్రి కోసం కాక పోయినా ప్రజల కోసం చేస్తామన్నారు.

మనమే నెంబర్ వన్ : కేంద్ర మంత్రి సురేష్ ప్రభు

ఫార్మా రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో సమీప భవిష్యత్తులో ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుందని కేంద్ర మంత్రి సురేష్ ప్రభు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలతో కలిసి ఫార్మా రంగం అభివృద్ధి కోసం కేంద్రం తగిన చేయూతనిస్తోందన్నారు. ఈ రంగంలో మందుల ఉత్పత్తి పెద్ద ఎత్తున జరిగితే కంపెనీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ పెరిగి ధరలు తగ్గేందుకు అవకాశం ఏర్పడుతుందని, ఇప్పటికే కంపెనీల మధ్య పోటీ కారణంగా పలు మందుల ధరలు తగ్గాయని మంత్రి వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం మనం తయారు చేసిన మెడిసిన్లను పెద్ద ఎత్తున వినియోగించడం నిజంగా గర్వకారణమని వ్యాఖ్యానించారు. గత ఇరవై ఏళ్లలో భారతదేశంలో పరిశ్రమలు ఎంతో అభివృద్ధి సాధించాయని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని దేశంలోని ఫార్మా పరిశ్రమలు, రాష్ట్రంలోని ఫార్మా రంగ పరిశ్రమలు మరింతగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో వ్యాధులు అదే స్థాయిలో చుట్టుముడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్కువ కాలం జీవించాలని కోరుకుంటున్నారని, జీవించినంత కాలం కూడా సంతోషంగా ఆనందగానే ఉండాలని భావిస్తున్నారన్నారు. వయస్సు మీదపడుతున్నా ఇంకా యువకులుగానే కనిపించాలని కోరుకునేవారు కూడా ఉన్నారన్నారు. ఆహార ధాన్యాల సాగులో ఇటీవలి కాలంలో రసాయన మందుల వినియోగం పెరుగుతుండడంతో వ్యాధులు సంక్రమిస్తున్నాయని, వృద్ధాప్య దశలో వైద్యుల అవసరాలు, ఔషధాల వాడకం కూడా పెరుగుతోందన్నారు. ఫార్మా రంగంలో బల్క్ డ్రగ్ మేనిఫ్యాక్టరింగ్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తోందన్నారు. వైద్యరంగంతో పాటు మౌళిక సదుపాయాల కల్పనలోనూ కేంద్ర ప్రభుత్వం క్రియాశీలకంగా పని చేస్తోందన్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత దేశం ఫార్మారంగంలో అభివృద్ధి చెందుతుండడంతో అభివృద్ధి చెందిన దేశాలు సైతం మనం తయారు చేసిన మెడిసిన్, టాబ్లెట్లు, ఇతర ఔషధాలను వినియోగించేందుకు ఆసక్తిని చూపుతున్నాయన్నారు. తెలంగాణలోనూ పెరుగాంచిన కంపెనీలు ఔషధ రంగంలో ఉన్నాయని, చిన్నచిన్న ఔషధ కంపెనీలు సైతం టీకాలు, పోలియో చుక్కల మందులను తయారు చేసి అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేస్తున్నాయని గుర్తుచేశారు. అమెరికా లాంటి దేశాలు సైతం ఫార్మా ఇండస్ట్రీపై దృష్టిని పెడుతున్నాయన్నారు.

రెవెన్యూకు నజరానా

(మొదటిపేజీ తరువాయి)

అభివర్ణించారు. భూ యాజమాన్యంలో, క్రయ విక్యాల్లో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు నమోదు చేయడంలో ఇంతకాలం నిర్లక్ష్యం జరిగిందని, రికార్డులు గందరగోళంగా తయారయ్యాయని, ఇప్పుడు ప్రక్షాళన ప్రక్రియతో గాడిలో పడ్డాయని వ్యాఖ్యానించారు. సొంత భూములున్న రైతులతో పాటు అసైన్డ్‌దారులు విషయంలో సైతం రెవిన్యూ ఉద్యోగులు స్పష్టత సాధించారని, రాష్ట్రంలోని 22.5 లక్షల ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలో పేదలకు పంచగా, అందులో ఇరవై లక్షల ఎకరాల విషయంలో స్పష్టత వచ్చిందని, మిగిలిన రెండున్నర లక్షల ఎకరాల విషయంలో స్పష్టత కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు కేసుల్లో, అటవీ రెవిన్యూ శాఖల మధ్య వివాదంలో ఉన్న భూములు మినహా అన్ని భూముల విషయ,లో పూర్తి స్పష్టత ఏర్పడిందని, ఇంతటి కృషి చేయడం సాధారణ విషయం కాదని, దేశంలో ఏ రాష్ట్ర రెవిన్యూ ఉద్యోగులు సాధించని కృషిని ఇక్కడ సాధించారని, అందుకే నెల మూల వేతనాన్ని ప్రోత్సాహకంగా ఇస్తున్నట్లు సిఎం పేర్కొన్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటుతో భారీ ప్రయోజనం :

తెలంగాణలో పంట పెట్టుబడి పథకం అమలు చేయడం కోసం ఏ భూమికి ఎవరు యజమానో కచ్చితంగా తేల్చాల్సిన ఆవశ్యకతలో భాగంగానే భూ రికార్డుల ప్రక్షాళన జరిగిందని పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఎలాంటి ఉపయోగం ఉంటుందో భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం నిరూపించిందని, చిన్న జిల్లాలుండడం వల్ల ఈ కార్యక్రమం విజయవంతమైందని, కొత్త కలెక్టర్ల ప్రతిభకు, పనితీరుకు ఇది గీటురాయిగా నిలిచిందని, విధి నిర్వహణలో గొప్పగా వ్యవహరించారని సిఎం అభినందించారు. తెలంగాణలో హెచ్చు శాతం మంది అధికారులు, ఉద్యోగులు నిజాయితీగా, చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, గతంతో పోలిస్తే ప్రభుత్వ ఉద్యోగుల పనితీరులో చాలా మార్పు వచ్చిందని, కష్టపడి పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల దగ్గరకు చేర్చడంలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని వ్యాఖ్యానించారు.

వైద్యారోగ్య శాఖ సిబ్బంది సైతం కష్టపడి పనిచేస్తున్నందువల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడిందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. నీటిపారుల ప్రాజెక్టుల నిర్మాణంలో, రోడ్ల నిర్మాణంలో సైతం ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నందువల్లనే మంచి ఫలితాలు వస్తున్నాయని ఉదహరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలు పారదర్శకంగా ఉన్నాయని, అవినీతికి ఆస్కారం లేకుండాపోయిందని, ఇలాంటి సందర్భంలో ఉద్యోగులకు మెరుగైన వేతనాలు ఇవ్వాలన్నదే ప్రభుత్వ అభిమతమని వ్యాఖ్యానించారు. ఈ కారణంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే ఉద్యోగులకు 42% ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరిగిందని, ఇంక్రిమెంట్ కూడా ఇచ్చామని, భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడి కొనసాగుతుందన్నారు.

ఆర్‌బిఐ ఏం చేస్తోంది?

(మొదటిపేజీ తరువాయి)

సమాధానాలిచ్చారు. బ్యాంకింగ్ రంగంలో 2014 నుండి తీవ్రమైన వ్యవస్థాగత లోపాలు ఉన్నాయని, ఈ నాలుగేళ్ళలో అవి మరింత తీవ్రమయ్యాయని చెప్పారు. ఎగవేతదారులు పెరిగినంత మాత్రాన మనది ఎగవేతదారుల దేశంగా భావించవద్దని, రుణాలు తీసుకున్నవారిలో 10 శాతం లోపే ఎగవేతదారులని, మిగతా 90 శాతం రుణాలు తిరిగి చెల్లిస్తున్నారని వివరించారు. ‘‘నువ్వు ఎంత పెద్ద మనిషి అని చెలామణైతే ఎగవేతదారునిగా మారేందుకు అంత ఎక్కువ అవకాశాలు ఉన్నాయి’’ అని ఆయన వ్యంగ్యంగా అన్నారు. గ్రామీణులు, మధ్య తరగతి ప్రజల్లో రుణాలను తిరిగి చెల్లించకపోవడమంటే కళంకంగా భావిస్తారని ఆయన పేర్కొన్నారు.

నాలుగేళ్ళు ఏమి చేశారు? :


గడిచిన నాలుగేళ్ళలో వాస్తవ వ్యవసాయ ఉత్పత్తి, వ్యవసాయ ఆదాయంలో పెరుగుదల లేదని చిదంబరం తెలిపారు. రైతులు ఆదాయం తగ్గి పేదలుగా మారుతున్నారనేది కఠోర వాస్తవమన్నారు. పేదలు, వ్యవసాయం, యువతను ఆదుకోవడంలో, సంక్షేమ పథకాలను ప్రోత్సహించడంలో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ విఫలమైందని విమర్శించారు. నాలుగేళ్ళలో నిరుద్యోగం, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం అనే నాలుగు సవాళ్ళను పరిష్కరించడంలో విఫలమైనట్లు కేంద్ర ఆర్థిక సర్వే ప్రకటించిందని, ఇంతటి కీలక అంశాలను పట్టించుకోకుండా నాలుగేళ్ళుగా కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. 2004–14 సంవత్సరాల మధ్య భారతదేశం జిడిపి డాలర్లలో మూడింతలు, రూపాయలలో నాలుగింతలు పెరిగిందని, గడిచిన నాలుగేళ్ళలతో జిడిపి రెండింతలైందని ప్రధాని అంటున్నారని, కాని బడ్జెట్ రూపకల్పనలో పేదల వైపు మొగ్గు మాత్రం కనిపించలేదన్నారు. నోట్లు రద్దుపై కొండను తొవ్వి ఎలుకను పట్టారని తాను చెప్పిన విషయమే నిజమైందన్నారు.

రాజకీయేతర ఉద్యమాలే ఎన్నికల్లో కీలకం :

భవిష్యత్తు ఎన్నికలను రాజకీయేతర ఉద్యమాలు, సంస్థలు నిర్దేశిస్తాయని చిదంబరం అన్నారు. గుజరాత్ ఎన్నికల్లో రాజకీయాలతో సంబంధం లేని శక్తులను ఒక్కతాటిపైకి తీసురావడం ద్వారా బిజెపిని కట్టడి చేయగలిగామన్నారు. అల్పేశ్ ఠాకూర్, జిగ్నేష్ మెవానీ, హార్ధిక్ పటేల్‌లను కులతత్వవాదులుగా కొట్టిపారేయొద్దని, నిరుద్యోగమనే బలమైన అంశం లేకుంటే వారి ఉద్యమాలు నిలిచేవి కాదని చెప్పారు. నిరుద్యోగ సమస్య బద్ధలయ్యే అగ్నిపర్వతంలా ఉన్నదన్నారు. నాలుగేళ్ళలో ఏ రంగంలో, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలివ్వమంటే పకోడాలను అమ్ముకోవాలంటూ యువతను అవమానపరుస్తున్నారని మండిపడ్డారు. గుజరాత్ ఎన్నికల్లో తాము కేవలం 12 పోలింగ్ బూత్‌ల వల్లే ఓడిపోయామని చిదంబరం చెప్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆ బూత్‌లలో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లే అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చి ఉంటే బిజెపి ఓడిపోయేదన్నారు.

విమర్శ ప్రభుత్వాలకే మంచిది :

ప్రజాస్వామ్యంలో విమర్శలు ప్రభుత్వాలకే మంచి చేస్తాయని చిదంబరం అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం విమర్శల పట్ల అసహనంతో ఉన్నదన్నారు. చివరకు ఎం.ఎస్.స్వామినాథన్, అశోక్ గులాటి వంటి స్వతంత్ర వ్యక్తుల అభిప్రాయాలను కూడా వినకపోతే ప్రభుత్వానికి మంచి చెప్పేవారే కరువవుతారని అన్నారు. అసహనికి సమాధానం మౌనం కాదని, మనం మౌనంగా ఉన్నామంటే అసహనంలో భాగస్వాములమైనట్లేనని చిదంబరం అన్నారు.



నూతన ఆర్థిక విధానాలను ప్రజలపై రుద్దుతున్నారు


మన తెలంగాణ / హైదరాబాద్/ముషీరాబాద్ : నూతన ఆర్థిక విధానాలు తీసుకువచ్చి ఒక పెద్ద భూతాన్ని ఈ దేశం మీదకి వదులుతున్నారని, దానిని ఎవరూ ఊహించలేదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో శనివారం జన విజ్ఞాన వేదిక తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో స్పిరిట్ ఆఫ్ ఎన్‌క్వైరిఅప్‌హోల్డ్ క్వశ్చనింగ్ (తెలుసుకోవలన్న జిజ్ఞాసప్రశ్నించే తత్వం) అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నేడు అత్యంత ఉన్నతమైన పరిజ్ఞానాన్ని గూగుల్, ఫేస్‌బుక్‌లాంటి సంస్థలు తీసుకువస్తున్నాయన్నారు. గుత్తాధిపత్య సంస్థల ఆకాంక్షలు ఎక్కడ మొదలై ఎక్కడ ఆగుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ జాతీయ ఆదాయంలో 79 శాతం ఆదాయం ఒక్క శాతం మంది వద్దనే ఉందని, దీని వల్ల తీవ్రమైన ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. భారత రాజ్యాంగంలోని 39వ ఆర్టికల్ ఉత్పత్తి శక్తులు ఎవరి చేతుల్లో కేంద్రీకరించరాదని చెబుతుందని, అయితే దీనికి భిన్నంగా నేటి పరిణామాలు కనిపిస్తున్నాయన్నారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ రన్నింగ్

• కాంగ్రెసోల్లది కుర్చీల కొట్లాట • పాలమూరుతో 20 లక్షల ఎకరాలకు సాగునీరు: మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మన తెలంగాణ/ వనపర్తి ప్రతినిధి: పాలమూరు జిల్లాలో 15 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన కల్వకుర్తి,భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసి పెండింగ్ ప్రాజెక్టులుగా పేరు తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని రాష్ట్ర భారీ నీటి పారుదల మంత్రి హరీష్‌రావు అన్నారు. శనివారం వనపర్తి జిల్లా పరిధిలోని వీపనగండ్ల, పాన్‌గల్ మండలాల్లో రూ. 12 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు వ్యవసాయ గోదాంలను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ పనులను పరిశీలించిన ఆయన పనుల వేగం పట్ల కాంట్రాక్టర్ మేఘారెడ్డిని అభినందించారు. అంతకు ముందు పాన్‌గల్‌లో ఏర్పాటు చేసిన సభలో మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ టిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల పాలనలో పాలమూర్ జిల్లాలోని 4 పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరందించిన ఘనత టిఆర్‌ఎస్‌కే దక్కిందని, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పరుగులెత్తించి నీళ్లిచ్చే పనిలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెసోల్లది కుర్చీకోసం కొట్లాడటమే తప్ప ఏనాడు రైతుల పక్షాన పని చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు లేదన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లోకి రేవంత్‌రెడ్డి వస్తే డికె అరుణ అడ్డుకోవడం, నాగం వస్తానంటే దామోదర్‌రెడ్డి అడ్డుకోవడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. రైతులను ఆదుకునేందుకు సిఎం కెసిఆర్ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ,మండల ,జిల్లా, రాష్ట్ర స్థాయిలో రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నారని రాబోయే రోజుల్లో రైతు సమన్వయ సమితుల ఆధ్వర్యంలో రైతులకు మద్దతు ధర కల్పించేందుకు సమన్వయ సమితులే ధన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసు కుంటున్నట్లు ఆయన తెలిపారు.

పాలమూర్ జిల్లాలో వివిధ ప్రాజెక్టుల ద్వారా కాల్వల క్రింద 20 లక్షల మాగాణికి సాగునీరందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి ఇప్పటికే 23 టిఎంసిల నీటిని రాబట్టుకోగలిగామని, తెలంగాణ రాష్ట్రం సాధించుకోలేకపోతే ఇంత పెద్ద మొత్తంలో సాగునీటిని తెచ్చుకునేవారమా అని ఆయన ప్రశ్నించారు. కొల్లాపూర్ నియోజక వర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరందిస్తుంటే కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని వారు కొల్లాపూర్ నియోజకవర్గంలో పుట్టడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంఎల్‌ఎ శ్రీనివాస్ గౌడ్ , అచ్చంపేట ఎంఎల్‌ఎ గువ్వల బాల్‌రా జు, జడ్పిచైర్మన్ భాస్కర్, తదితరులు ఉన్నారు.





విశ్వకర్మల అభివృద్ధికి కృషి
స్పీకర్ మధుసూదనా చారి

మనతెలంగాణ / బీబీనగర్ : తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనా చారి అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలోని చిన్నరావుల పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మల సంక్షేమ సంఘం సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ విశ్వకర్మల సంక్షేమానికి ప్రభుత్వ కృషి చేస్తున్నదని తెలిపారు. ఒకప్పుడు ఆంధ్ర ప్రాంతం సస్యశామలంగా ఉంటే తెలంగాణ ప్రాంతం కల్లోళిత ప్రాంతంగా ఉండేదని నూతన ప్రాజెక్టుల నిర్మాణంతో జిల్లాల్లో కృష్ణ, గోదావరి నీళ్లు పారించిన ఘనత సిఎం కెసిఆర్‌దే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బాబు శంకర్, మండల అధ్యక్షులు వల్సోజు మల్లేష్, సర్పంచ్ బెజ్జం రేణుకశ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ బొక్క జైపాల్‌రెడ్డి ఉన్నారు.

ముద్ర పథకం రైతులకు వరం

మన తెలంగాణ/ సిద్దిపేట అర్బన్: ప్రధాన మంత్రి ముద్ర పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు కోరారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముద్ర పథకం కింద స్వంతంగా వ్యాపారం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. బ్యాంకుల నుంచి ఎలాంటి షూరిటీ లేకుండా పది లక్షల వరకూ రుణం పొందే అవకాశం వుందని తెలిపారు. ప్రధాన మంత్రి ముద్ర పథకంపై మరింత విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ విషయంపై తెలంగాణ రైతు రక్షణ సమితి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి నేతలు మారెడ్డి రాంలింగారెడ్డి, రవికుమార్, ఎవి రవీందర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాసరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి ముద్ర పథకంపై రూపొందించిన ప్రత్యేక కరపత్రాలను విడుదల చేశారు.

ఎఇ పరీక్ష ఏప్రిల్ 1కి వాయిదా

మనతెలంగాణ/ హైదరాబాద్ : గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్)లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు మార్చి 18న జరగాల్సిన సిబిఆర్‌టి పరీక్షలను ఉగాది పండుగ సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రగ్స్ కంట్రోల్ జేడీగా కైలాసం

మన తెలంగాణ / హైదరాబాద్ : డ్రగ్స్ కంట్రోల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్‌గా టి.కైలాసంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. డ్రగ్స్ కంట్రోల్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. డ్రగ్స్ కంట్రోల్ ఇంఛార్జీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.శాంతికుమారి ఉత్తర్వులను జారీ చేశారు.

నిప్పంటుకొని వృద్ధురాలు సజీవదహనం

శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురంలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుడిసెకు నిప్పంట్టుకుని మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. మంటల్లో చిక్కుకుని వృద్ధురాలు సజీవదహనమయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎన్‌టిఎస్‌ఇ పరీక్ష రద్దుకు డిమాండ్



మనతెలంగాణ/ హైదరాబాద్ : గత సంవత్సరం నవంబర్‌లో నిర్వహించిన ఎన్‌టిఎస్‌ఇ మొదటి దశ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం హిమాయత్‌నగర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను చేశారు. ఈ పరీక్షలో అవకతవకలు జరిగాయని, ఇందులో కార్పొరేట్ విద్యాసంస్థలు భాగస్వామయ్యాయని ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు ఎమ్. వేణు, ఆర్. శివరామకృష్ణలు ఆరోపించారు.

ఆదివాసీల ఎడ్ల బండ్ల ర్యాలీ
లంబాడీలను ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలంటూ డిమాండ్



మన తెలంగాణ/ ఆదిలాబాద్/ మంచిర్యాల : ప్రభుత్వ వైఫల్యం వల్ల తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసులు అభద్రతా భావానికి గురవుతున్నారని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపించారు. లంబాడీలను ఎస్టీ జాబి తా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం గుడిహత్నూర్, కాసిపేట, దస్తురా బాద్, జన్నారం, దండేపల్లి, లింగాపూర్, సిర్పూర్(యు), ఇంద్రవెల్లి, ఉట్నూర్, సిరికొండ, నార్నూర్ మండల కేంద్రాల్లో ఆదివాసీ తుడుం దెబ్బ అధ్వర్యంలో ఎడ్లబండి ర్యాలీ చేపట్టారు. మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి ఎడ్ల బండ్లతో మండల కేంద్రానికి చేరుకుని అక్కడి నుండి మండల కేంద్రంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అ నంతరం ఆయా మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంబాడీలను ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు గత మూడు నెలలుగా శాంతియుతంగా ఉద్యమం చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా వ్య వహరిస్తోందని వారు ఈ సందర్భంగా ఆరోపించారు.

నిపానిలో యువరైతు ఆత్మహత్య

మన తెలంగాణ/ భీంపూర్: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపానికి చెందిన గోస్కుల ప్రవీ ణ్(23) ఒక వ్యవసాయ బావిలో శవమై ఉన్న విషయం శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గోస్కుల మల్లేష్, గంగమ్మల మొదటి కుమారుడు పెళ్లై వేరుగా ఉంటుండగా, రెండవ కుమారుడు ప్రవీణ్ 32/6 సర్వేనెంబరులోని 4 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. తండ్రి మల్లేశ్ పక్షవాతంతో బాధ పడుతున్నాడు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా పత్తి సాగు చేయగా గులాబి పురుగుతో నష్టపోయాడు. దీంతో కప్పర్ల బ్యాంకులో తీసుకున్న లక్షన్నర రూపాయలు, ప్రైవేటుగా ఉన్న రెండు లక్షల అప్పులు తీరక మనస్థాపం చెందిన అతను శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిగా శనివారం బావిలో శవమై తేలాడు. సమచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శవాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోథ్ మండలంలో మరొకరు..



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సాకెర గ్రామానికి చెందిన జాదవ్‌మోహన్(49) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన భార్య రాథోడ్ సుభద్రబాయి తెలిపారు. వివరాలు.. వెళ్తె తన భర్త మోహన్ గత పది సంవత్సరాల కింద కండక్టర్ ఉద్యోగం చేసేవాడని అతన్ని ఉద్యోగం నుంచి తొలగించడంతో తమకున్న 9 ఎకరాల పొలాన్ని పంట పండించుకుంటూ జీవిస్తున్నామని, సాగు కోసం దాదాపు 6లక్షల రుపాయల అప్పులు చేశామని కానీ పంటలు చేతికి రాకుండా నష్టపోయామని, దీంతో మనస్థాపం చెందిన తన భర్త ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తెలిపింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్సై గంగారెడ్డి తెలిపారు.

అపోలోకు సూటిక్ ఫార్మా క్షతగాత్రులు




మన తెలంగాణ/ షాపూర్‌నగర్: జీడిమెట్ల పరిశ్రమలో అగ్ని ప్రమాద ఘటనలో గాయాల పాలైన ఏడుగురు కార్మికులను మెరుగైన వైద్యం కోసం కంచన్‌బాగ్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగురిలో ముగ్గురికి 90 శాతంపైగా శరీరం కాలిపోవడంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కాగా ఆ కార్మికులను శ్రీనివాస్, కుమారస్వామి, సింహాచలం, సంజీత్, హర్వెన్, నరహరి, శ్యామ్‌లను జిల్లా కలెక్టర్ యోగితారాణా ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం కోసం పేట్ బషీరాబాగ్‌లోని హర్షా ఆస్ప త్రి నుంచి కంచన్‌బాగ్‌లోని అపోలో ఆస్పత్రికి శు క్రవారం రాత్రి తరలించారు. వీరిలో శ్రీనివాస్, కుమారస్వామి, సింహాచలం శరీరాలు 90 శాతం పైగా కాలడంతో వారి పరిస్థితి విషమంగా ఉంది.

ప్రేమ విఫలం.. యువతి ఆత్మహత్య

మనతెలంగాణ/ జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన దండేం శోభ(18) అనే యువతి పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ తహిసోద్దీన్ తెలిపారు. దండేం శోభ అనే యువతి ఒక యువకునితో ప్రేమలో పడిందని, ప్రేమించిన ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకుందని ఎస్‌ఐ తెలిపారు. శుక్రవారం రాత్రి పురుగుల మందు సేవించిన శోభను హుటాహుటిన శనివారం ఉదయం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందిందని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్షట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. కాగా శోభ కుటుంబాన్ని శనివారం మధ్యాహ్నం ఆదిలాబాల్ మాజీ ఎంపి రాథోడ్ రమేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

కాళేశ్వరంతో బహుళ ప్రయోజనాలు

మన తెలంగాణ/ మంథని (పెద్దపల్లి జిల్లా): కాళేశ్వరం బహుళార్థ సాధక ప్రాజెక్టని తాగు, సాగు, పరిశ్రమ అవసరాలకు నీటిని అందించడంతోపాటు ప్రాజెక్టుల నీటితో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు ఎప్పుడూ పుష్కలంగా నీటితో చేపల పెంపకం ద్వారా గంగ పుత్రులకు ఏడాది పొడవునా చేపలు లభిస్తాయని డిప్యూటీ సిఎం మహమూద్ అలీ, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌లు అన్నారు. శనివారం 28 మంది ఎంఎల్‌సిల బృందంతో కలిసి వారు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిల్ల బ్యారేజీ, అన్నారం పుంపు హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూన్ వరకు కాళేశ్వరం మొదటి విడత పనులు పూర్తి చేసి, రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి ఫలితం అందిస్తామన్నారు. సుప్రీం కోర్టు ప్రాజెక్టు నిర్మాణాన్ని సమర్థిస్తూ తీర్పు ఇవ్వడం సంతోషకరమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నమూనా మ్యాప్‌ను వారు పరిశీలించగా, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ నల్ల వెంకటేశ్వర్లు ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర వివరాలను మహ్మద్‌అలీ, స్వామిగౌడ్‌లకు వివరించారు. కాగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన పుష్పగుచ్ఛాలను అందించి వారికి ఘన స్వాగతం పలికారు.



విద్యార్థి శక్తిగా ప్రజల్లోకి..

• ప్రజా గాయకుడు గద్దర్



మన తెలంగాణ/ హైదరాబాద్/ ఉస్మానియా యూనివర్సిటీ: విదార్థులంతా ఒక్కటై ...విద్యార్థిశక్తిగా మారి ప్రజల్లోకి వెళ్ళాలని ప్రజా గాయకుడు గద్దర్ పిలుపునిచ్చారు. టిఎస్ జేఏసి, విద్యార్థి జేఏసి ఆధ్వర్యంలో ''తెలంగాణ మేధావులు, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులతో భవిష్యత్ ప్రత్యామ్నాయ రాజకీయాల''పై ఉస్మానియా యూనివర్సిటీ పిజిఆర్‌ఆర్‌సిడిఇ హాలులో శనివారం మేధోమథన సమావేశం విద్యార్థి జేఏసి చైర్మన్ మాందాల భాస్కర్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమకారులు, మేధావులు ప్రజల వద్దకు వెళ్ళాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులు ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 10 వేల గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు విద్యార్థి ఉద్యమ కార్యాచరణను చెప్పాలని కోరారు. ఆల్ తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కేసిఆర్, కేటిఆర్, హరీష్‌రావు, కవితపై పోటీ చేస్తామని నలుగురు విద్యార్థులను ఓయూ నుంచే అభ్యర్థులుగా ప్రకటించండి.. దానికి నా మద్దతు పూర్తిగా ఉంటుందని గద్దర్ ప్రకటించారు. ఓ.యూ ఫోరమ్ ఫర్ తెలంగాణ కన్వీనర్ ప్రొఫెసర్ గద్దం లక్ష్మ ణ్ మాట్లాడుతూ వెయ్యిమంది అమరులు ఉంటే కేవలం 400 మంది కుటుంబాలకే పరిహారం ఇచ్చారని, మిగతా 600 మంది కుటుంబాలకు పరిహారం ఎందుకు ఇవ్వడంలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

పారిశుద్ధ్యం విషయంలో రాజీ వద్దు

• మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి



మన తెలంగాణ/ పెద్దమందడి: వనపర్తి జిల్లా పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మాత్యులు డా. సి.లక్ష్మారెడ్డి తనిఖీ చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఒపి, ఐపి, హాజరు పట్టికలు పరిశీలించి, వివిధ వార్డులు ,విభాగాలను పరిశీలించారు. హాస్పిటల్‌లో పలు సమస్యలు గుర్తించి ఆయా సమస్యలను వైద్యశాల అభివృద్ధి నిధులతో పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. శానిటేషన్, గోడలకు కలరింగ్ వంటి వాటిని క్రమం తప్పకుండా నిర్వహించాలని హాస్పిటల్‌లో ఒపి, ఐపిని మరింతగా పెంచాలని పేషంట్లకు సేవా ధృకృథంతో వైద్య సేవలు అందించాలని అన్నారు. కెసిఆర్ కిట్ల పథకం పని తీరును అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు ఆపరేషన్లు లేని ప్రసూతి లు జరిగేట్లు చూడాలని వైద్యులు, సిబ్బంది ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. మంత్రితో పాటు దేవరకద్ర ఎంఎల్‌ఎ ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పిటిసివేణుగోపాల కృష్ణ, ఎంపిపి దయాకర్, ఎంపిటిసి ,ప్రజాప్రతినిధులు పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్యను చంపిన భర్త

మన తెలంగాణ / ముషీరాబాద్ : మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి తన భార్యను అతి దారుణంగా కత్తితో పొడిచి హత్య చేసి పరారైన ఘటన హైదరాబాద్ చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి... వికారాబాద్ జిల్లా మంతన్నగౌడ్ గ్రామం బషీరాబాద్ మండలానికి చెందిన మొగలయ్య అలియాస్ మోహన్, భార్య బోనమ్మ అలియాస్ భవాని (45)తో నగరానికి వలస వచ్చి అశోక్‌నగర్ వీధి నెంబర్ 1లో నివసిస్తున్నారు. తమ ముగ్గురు పిల్లలతో కలిసి అశోక్‌నగర్ లక్ష్మినర్సింహా ఎన్‌క్లేవ్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా మొగయల్య బోనమ్మల మధ్య తరచూ ఘర్షణ జరుగుతుండేది. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం 12:15 గంటల సమయంలో మద్యం సేవించేందుకు డబ్బు ఇవ్వమని భార్యతో ఇంటి గది తలుపులు పెట్టుకుని ఘర్షణ పడ్డారు. దీన్ని గమనిస్తున్న కూతురు శ్రీలత . రోజు మాదిరిగానే ఘర్షణ పడుతున్నారని అనుకుని మిన్నకుండి పోయింది. డబ్బు ఇచ్చేందుకు బోనమ్మ ససేమిరా అనడంతో మొగలయ్య భార్యను దారుణంగా కత్తితో పొడిచి లోపటి నుంచి పరుగెత్తుకుంటూ పారిపోయాడు. అదే సమయంలో తల్లి బోనమ్మ లోపలి నుంచి వచ్చి గడప వద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో విషయాన్ని శ్రీలత స్థానికులకు తెలియచేసింది. 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి చూసే సరికి అప్పటికే బోనమ్మ మృతి చెందినట్లు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ భీంరెడ్డి, ఎస్.ఐ.బాల్‌రాజ్‌లు ఘటనా స్థలానికి చేరుకున్న హత్యకు వాడిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. మృతిరాలి ఛాతి, భుజంపై కత్తితో పొడిచి ఆమెను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.



పెట్రోల్ దాడి వరుడు యాకయ్య మృతి



• గ్రామస్థుల ఆందోళన.. నిందితులపై చర్యలకు డిమాండ్

మన తెలంగాణ/ రఘునాథపల్లి: అయిదు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన పెట్రో ల్ దాడి బాధితుడు గోంగళ్ల యాకయ్య(26) శనివారం సికింద్రాబాద్ ఎంజిఎంలో తుది శ్వాస విడిచాడు. యాకయ్య ఆసుపత్రిలో మృ తి చెందిన సమాచారం తెలిసిన కంచనపల్లి గ్రామస్తులు ఆగ్రహంతో మండల కేంద్రానికి చేరుకొని ఎన్‌హెచ్‌పై గంటన్నర పాటు బైఠాయించి రాస్తారోక నిర్వహించారు. దీంతో రోడ్డుపై వాహనాలు కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎసిపి వెంకటేశ్వర బాబు, సిఐ తిరుపతి, ఎస్‌ఐ రంజిత్‌రావు సంఘటన స్థలానకి చేరుకోని గ్రామస్థులకు నచ్చజెప్పడంతో వారు రాస్తారోకోను విరమించుకున్నారు.

తమిళ్ రీమేక్‌లో షాలిని

కన్నడలో సూపర్ హిట్ అయిన 'కిరాక్ పార్టీ' తెలుగు రీమేక్‌లో నటించాడు యంగ్ హీరో నిఖిల్. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం తర్వాత నిఖిల్ మళ్లీ రీమేక్ సినిమాయే చేయబోతున్నాడు. తమిళంలో హిట్ అయిన 'కణితన్' రీమేక్‌లో అతను నటించనున్నాడు. ఈ రీమేక్‌లో హీరోయిన్‌గా ఎవరిని తీసుకోవాలనే దానిపై సినిమా టీమ్ చాలా రోజులుగా ఆలోచిస్తోంది. అఖిల్ 'హలో' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మలయాళ కుట్టి కళ్యాణి ప్రియదర్శన్‌ను హీరోయిన్‌గా తీసుకుంటున్నారనే మాట వినిపించింది. ఆమె పేరును అధికారికంగా ప్రకటించడమే ఇక మిగిలింది అనుకుంటున్న తరుణంలో అనూహ్యంగా కొత్త భామ తెరపైకి వచ్చింది. 'అర్జున్‌రెడ్డి' సినిమాతో యూత్‌ను మురిపించిన షాలినీపాండేను ఈ అవకాశం వరించిందనేది తాజా సమాచారం. ఈ సినిమా దర్శకుడు టి.ఎన్.సంతోష్ ఇప్పటికే షాలినిని కలిసి సబ్జెక్ట్ వినిపించాడు. ఆమె స్పందించిన తీరుపట్ల దర్శకుడు హ్యాపీగా ఉన్నాడని... కాబట్టి ఆమెనే తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. 'అర్జున్‌రెడ్డి' చిత్రంతో ఒక్కసారిగా లైమ్‌లైట్‌లోకి వచ్చిన షాలినీ పాండే తర్వాత తమిళంలో నటిస్తోంది. తెలుగులో సూపర్ హిట్ అయిన '100% లవ్' తమిళ వర్షన్‌లో ఆమె హీరోయిన్‌గా చేస్తోంది.





వరుణ్‌తేజ్

ప్రయోగాల బాటలో...

మెగా ఫ్యామిలీ నుండి వచ్చి తొలి సినిమా నుండి డిఫరెంట్ స్టోరీలను ఎంచుకుంటూ విలక్షణ హీరోగా పేరుతెచ్చుకున్నాడు వరుణ్‌తేజ్. ఇప్పుడు అతను లవ్‌స్టోరీలతో వరుస హిట్స్ అందుకుంటున్నాడు. వరుసగా ఫిదా, తొలిప్రేమ సినిమాలతో బ్లాక్‌బస్టర్స్ అందుకున్నాడు ఈ యంగ్ హీరో. ఈ తరుణంలో వరుణ్ తదుపరి చిత్రం కోసం మళ్లీ ప్రయోగాల బాట పడుతున్నాడా? అంటే అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. 'తొలిప్రేమ'తో ఘన విజయాన్ని అందుకున్న అతను తర్వాత యంగ్ డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నాడు. రానాతో 'ఘాజీ' అనే ప్రయోగాత్మక చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడే ఈ సంకల్ప్‌రెడ్డి. ఇప్పుడు వరుణ్‌తేజ్ కోసం ఓ అదిరిపోయే స్క్రిప్ట్‌ను సిద్ధం చేశాడట. ఈ సినిమాలో వరుణ్ ఆస్ట్రోనాట్‌గా నటించనున్నాడు. జలాంతర్గామి నేపథ్యంలో 'ఘాజీ' చిత్రాన్ని తెరకెక్కించి విమర్శకుల ప్రశంసలను దక్కించుకున్నాడు సంకల్ప్‌రెడ్డి. ఇప్పుడు వరుణ్‌తో స్పేస్ నేపథ్యంలో చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాడు.

అంటే ఇది కూడా ఖచ్చితంగా ప్రయోగాత్మక చిత్రమే. దీంతో వరుణ్ లవర్ బాయ్ నుండి మళ్లీ ప్రయోగాల బాట పట్టనున్నాడు. ఏది ఏమైనా ఈ యంగ్ హీరో ఒకే ట్రాక్‌లో సినిమాలు చేయకుండా తన ట్రాక్‌ను మార్చుకుంటూ డిఫరెంట్ కథలను ఎంచుకుంటున్నాడు. ఈరకంగా వరుణ్‌తేజ్ మెగా ఫ్యామిలీలో పూర్తి కమర్షియల్ హీరో అనే ఇమేజ్ కాకుండా విలక్షణ నటుడు అనిపించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. మెగా అభిమానులకు ఇది సంతోషించదగ్గ విషయమే.



మహతి, మణిశర్మ, సి.అశ్వనీదత్, నాని, టి.శ్రీరామ్ ఆదిత్య

మల్టీస్టారర్ పాటల రికార్డింగ్ ప్రారంభం

వైజయంతి మూవీస్ పతాకంపై నాగార్జున, నాని హీరోలుగా టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న భారీ మల్టీస్టారర్ పాటల రికార్డింగ్ నాని పుట్టిన రోజు సందర్భంగా మహతి రికార్డింగ్ స్టూడియోలో ప్రారంభమైంది. గతంలో వైజయంతి మూవీస్ బ్యానర్‌లో ఆఖరి పోరాటం, ఆజాద్, రావోయి చందమామ వంటి ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలు చేసిన నాగార్జున మరోసారి ఈ బ్యానర్‌లో ఈ మల్టీస్టారర్ చేస్తున్నారు. ఇక నాని మొదటిసారి ఈ బ్యానర్‌లో నటిస్తున్నారు. గతంలో ఎన్నో మల్టీస్టారర్ సినిమాలు చేసిన సి.అశ్వనీదత్ ఇప్పుడు ఈ మల్టీస్టారర్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా సి.అశ్వనీదత్ మాట్లాడుతూ ''నాగార్జున, నాని వెరైటీ కాంబినేషన్‌లో ఒక ఆసక్తికరమైన సబ్జెక్ట్‌తో వినోదాత్మకంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మా బ్యానర్‌లో వచ్చిన ఎన్నో మల్టీస్టారర్స్‌ను ఆదరించిన ప్రేక్షకుల్ని ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందన్న నమ్మకం ఉంది. మా బ్యానర్‌లో ఎన్నో మ్యూజికల్ హిట్స్ ఇచ్చిన మణిశర్మ సంగీత సారధ్యంలో పాటల రికార్డింగ్‌ను ప్రారంభించాం. మార్చిలో షూటింగ్‌ను మొదలుపెడతాం. మిగతా నటీనటుల ఎంపిక జరుగుతోంది'' అని అన్నారు. దర్శకుడు టి.శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ ''నాగార్జున, నాని కాంబినేషన్‌లో సినిమాను డైరెక్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అందులోనూ వైజయంతి మూవీస్ వంటి పెద్ద బ్యానర్‌లో సినిమా చేయడం మరింత ఆనందంగా ఉంది. ఇది దర్శకుడిగా నాకు ఓ ప్రతిష్టాత్మక చిత్రమవుతుంది''అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః శ్యామ్‌దత్, ఎడిటింగ్ః ప్రవీణ్‌పూడి, మాటలుః వెంకట్ డి.పట్టి, శ్రీరామ్.ఆర్.

'నింగే మనకు నేడు పాగ'

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్స్, టీజర్‌కు మంచి స్పందన రావడంతో చిత్ర బృందం చాలా ఆనందంగా ఉంది. ఇప్పుడు చిత్రంలోని 'గ ఘ మేఘ...నింగే మనకు నేడు పాగ' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేశారు. నితిన్, మేఘా ఆకాష్‌ల ప్రేమ ప్రయాణం ఈ పాటలో కనిపిస్తుంది. తమన్ స్వరపరిచిన ఈ మెలోడి ఎంతో వినసొంపుగా ఉంది. ఎంతో సరదాగా, చలాకీగా సాగిపోయే హీరోహీరోయిన్ల ప్రయాణంలాగే కె.కె. సాహిత్యాన్ని అందించిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది. యుఎస్‌లోని కీవెస్ట్, ఆమిష్ విలేజ్ లాంటి అందమైన ప్రదేశాలలో ఈ పాటను చిత్రీకరించారు. ఈ చిత్రానికి ఎస్.నటరాజన్ సుబ్రమణ్యన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్టు చిత్ర నిర్మాత ఎన్.సుదాకర్‌రెడ్డి తెలిపారు. హీరోగా నితిన్ చేస్తున్న ఈ 25వ సినిమాలో డా.కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావురమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రాశ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మిసాయి, రాజశ్రీనాయర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కూర్పుః ఎస్.ఆర్.శేఖర్, నృత్యాలుః శేఖర్.వి.జె, పోరాటాలుః స్టంట్ సిల్వ, రవివర్మ.



నితిన్, మేఘా ఆకాష్



అనుష్క

మళ్ళీ ఎప్పుడు?

సౌతిండియాలోనే స్టార్ హీరోయిన్‌గా ప్రేక్షకుల్లో మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న బ్యూటీ అనుష్క. ఇటీవల ఈ భామ 'భాగమతి' చిత్రంతో ఓ పెద్ద హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమా తర్వాత ఆమె ఏ చిత్రంలో నటిస్తుందనేది ఇప్పటివరకు సస్పెన్స్‌గానే ఉంది. అయితే 'మహానటి'లో అనుష్క కేమియో రోల్‌లో నటిస్తుందనే టాక్ వినిపించినా ఈ వార్త తప్పు అని తెలిసింది.

ప్రస్తుతం ఈ స్టార్ హీరోయిన్ తన నెక్స్ట్ మూవీగా ఏ సినిమాను చేస్తే బాగుంటుందనే ఆలోచనలో ఉంది. ఇక 'భాగమతి' విడుదలకు ముందు తాను దర్శకుడు గౌతమ్‌మీనన్ మల్టీస్టారర్ మూవీకి సైన్ చేశానని అనుష్క చెప్పింది. కానీ దర్శకుడి ట్రాక్ రికార్డు ప్రకారం ఏ చిత్రం ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందనేది ఎవరికీ తెలియదు. 'భాగమతి' తర్వాత లేడీ ఓరియెంటెడ్ సినిమా చేయాలా లేదా రెగ్యులర్ కమర్షియల్ సినిమా చేస్తే బాగుంటుందా అనేది అనుష్క తేల్చుకోవాల్సి ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో తాను గ్లామర్ రోల్స్ చేయలేనని ఈమధ్య ఆమె చెప్పింది. దీంతో అనుష్క తన కొత్త చిత్రం చేయడానికి కొంత సమయం పట్టేటట్టు కనిపిస్తోంది.



విజయ్ దేవరకొండ, శివానీ సింగ్

గేమ్ నేపథ్యంలో నడిచే కథ

పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి చిత్రాలతో యూత్‌లో యంగ్ హీరో విజయ్‌దేవరకొండ సంపాదించుకున్న పాపులారిటీ అంతాఇంతా కాదు. ముఖ్యంగా అర్జున్‌రెడ్డి చిత్రంతో విజయ్ యువతలో మోస్ట్ క్రేజీయెస్ట్ హీరోగా మారాడు. ఇక ఈ యువ హీరో నటిస్తున్న తాజా చిత్రం 'ఏ మంత్రం వేశావే'. విజయ్ సరసన శివానీ సింగ్ నాయికగా నటిస్తోంది. గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి. అధినేత మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. మార్చి 9న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర సమర్పకుడు మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ''గేమ్ నేపథ్యంలో నడిచే విభిన్నమైన కథ ఇది. విజయ్ దేవరకొండ పాత్ర ఇందులో చాలా వైవిధ్యంగా ఉంటుంది. నేటి యువతరానికి ప్రతినిధిగా అతను కనిపించబోతున్నాడు. పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి తరహాలోనే ఈ చిత్రం కూడా ఆయన కెరీర్‌లో మరపురాని చిత్రంగా ఉండబోతుంది. విదేశాల్లో చిత్రీకరించిన సన్నివేశాలు హైలైట్‌గా ఉంటాయి. మార్చి 9న ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం''అని తెలిపారు. శివన్నారాయణ, రాజబాబు, నీలాక్షిసింగ్, ఆశిష్‌రాజ్, ప్రభావతి, దీపక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతంః అబ్బుత్ సమత్, సినిమాటోగ్రఫీః శివారెడ్డి.

థియేటర్ల బంద్‌కు టిఎఫ్‌సిసి మద్దతు

దక్షిణాదిన నాలుగు భాషల చిత్రాల నిర్మాతలు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ క్యూబ్, యుఎఫ్ఒ, పిఎక్స్‌డి సంస్థలకు మధ్య బెంగుళూర్‌లో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో నిర్మాతలు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి మార్చి 2 నుంచి థియేటర్లు బంద్ చేస్తూ ఆ మూడు డిజిటల్ సంస్థలకు సినిమా కంటెంట్ ఇవ్వకూడదని నిర్ణయించారు. థియేటర్ల బంద్‌కు తెలంగాణ ఫిలిం ఛాంబర్ కామర్స్ తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ''గత పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థపై మేము పోరాటం చేస్తున్నాం. గతంలో మేము డిజిటల్ రేట్లను తగ్గించాలంటూ నిరాహార దీక్ష కూడా చేయడం జరిగింది. కానీ అప్పట్లో పెద్దగా ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. కొంతమందికైతే డిజిటల్ రేట్లపై అంత అవగాహన కూడా ఉండేది కాదు. ఇక బెంగుళూర్‌లో నిర్మాతలతో జరిగిన చర్చల్లో ఆ మూడు డిజిటల్ సర్వీస్ సంస్థలవారు 9 శాతానికి మించి డిజిటల్ రేట్లను తగ్గించే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. అసలు డిజిటల్ ఛార్జీలు ఐదేళ్లకు మించి ఉండకూడదు. కానీ 13 ఏళ్లయినా కూడా అదే రేట్లు తీసుకుంటూ నిర్మాతలను ఇబ్బందిపెడుతున్నారు. మన సౌతిండియా ఫిలిం ఇండస్ట్రీలలో తప్ప హాలీవుడ్, బాలీవుడ్‌లలో ఈవిధంగా లేదు. గతంలో రూ.2500కే డిజిటల్ సర్వీసెస్‌ను మేము అందిస్తామని కొన్ని సంస్థలు ముందుకొచ్చినా వారిని రానివ్వకుండా చేశారు కొంతమంది. ఇప్పటికే అత్యధిక డిజిటల్ రేట్ల వల్ల రిలీజ్‌కాకుండా ఎన్నో చిత్రాలు ఆగిపోయాయి. క్యూబ్, యుఎఫ్ఒ, పిక్స్‌డి సంస్థలతో అగ్రిమెంట్‌ను రద్దుచేసుకుంటే తక్కువ రేట్లకే డిజిటల్ సర్వీసెస్‌ను అందిస్తామని కొన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయి. కాబట్టి మార్చి 2 నుంచి థియేటర్ల బంద్‌కు అందరూ సహకరించాలని కోరుతున్నాము''అని అన్నారు. టిఎఫ్‌సిసి కార్యదర్శి సాయి వెంకట్ మాట్లాడుతూ ''ఎంతో కాలంగా డిజిటల్ వ్యవస్థపై మేము ఉద్యమం చేస్తూ వచ్చాం. ఇప్పుడు సౌతిండియా ఫిలిం ఇండస్ట్రీ అంతా ఏకమై ఆ మూడు డిజిటల్ సంస్థలు దిగి వచ్చేలా మార్చి 2 నుంచి చేయబోతున్న థియేటర్ల బంద్‌కు మా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం. దీనిని ముందుండి నడిపిస్తున్న జెమిని కిరణ్, డి.సురేష్‌బాబుకు ధన్యవాదాలు చెబుతున్నాము''అని చెప్పారు.



ప్రతాని రామకృష్ణగౌడ్, సాయి వెంకట్



శ్రావణి, మారుతి

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్‌లపై విశ్వనాథ్ తన్నీరు, సురేష్.ఎస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'యమ్6'. మారుతి, శ్రావణి, ప్రియ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి జైరామ్ వర్మ దర్శకుడు. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ ''మారుతి ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నాడు. భవిష్యత్‌లో మంచి హీరోగా ఎదిగే లక్షణాలు అతనిలో ఉన్నాయి. మ్యూజిక్ కూడా బాగుంది''అని అన్నారు. దర్శకుడు జైరామ్ వర్మ మాట్లాడుతూ ''నాలో ప్రతిభను గుర్తించి ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశాన్ని కల్పించిన మా నిర్మాతకు రుణపడి ఉంటాను. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. కడుపుబ్బ నవ్వించే కామెడీ కూడా ఉంటుంది''అని చెప్పారు. నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ ''దర్శకుడు చెప్పిన కథ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చాను. చెప్పిన దానికంటే సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు దర్శకుడు''అని పేర్కొన్నారు. హీరో మారుతి మాట్లాడుతూ ''ఇది నా తొలి సినిమా. నేను నటన నేర్చుకోలేదు. దర్శకుడు చెప్పినట్లు నటించాను. విజయ్‌బాలాజీ సంగీతం ఆకట్టుకునే విధంగా ఉంటుంది''అని అన్నారు. సాయి వెంకట్, విజయ్‌బాలాజీతో పాటు చిత్ర బృందం పాల్గొంది.

కొంటెచూపుతో మురిపిస్తోంది

టాలీవుడ్‌లో వరుసగా గ్లామర్ రోల్స్ చేస్తూ యూత్‌ను అలరిస్తున్న బ్యూటీ అను ఇమాన్యుయల్. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా ఈ భామ వరుసగా పెద్ద సినిమాల ఆఫర్లను అందుకుంటోంది. ఇక అను ఇమాన్యుయల్‌కు ఫొటో సెషన్‌లో మంచి టేస్ట్ ఉంది. తాజాగా ఈ హాట్ బ్యూటీ చేయించుకున్న ఫొటోషూట్ సోషల్ మీడియాలో నెటజన్లను మైమరపిస్తోంది. కళ్లు జిగేల్‌మనిపించే బ్యాక్‌గ్రౌండ్ స్క్రీనింగ్‌ను ఎలివేట్ చేసేలా అమ్మడి కాస్ట్యూమ్స్ ఉన్నాయి. తన అందం, కొంటె చూపు గ్లామర్‌తో అను ఇమాన్యుయల్ మురిపిస్తోంది. వాలుచూపుతో ఈ భామ స్టైల్‌కు కుర్రకారు గుండె ఝల్లుమంటోంది. ఇటీవల పవన్‌తో కలిసి చేసిన 'అజ్ఞాతవాసి' నిరాశపరిచినప్పటికీ ఆమె చేతిలో ఇప్పుడు మంచి ప్రాజెక్టులే ఉన్నాయి. ప్రస్తుతం అల్లుఅర్జున్‌కు జోడీగా అను ఇమాన్యుయల్ 'నా పేరు సూర్యనా ఇల్లు ఇండియా' చిత్రంలో నటిస్తోంది. ప్రముఖ రచయిత వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటు నాగచైతన్యకు జంటగా 'శైలజారెడ్డి అల్లుడు' చిత్రంలో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది.



అను ఇమాన్యుయల్

ఆర్‌బిఐ గవర్నర్ రాజీనామా చేయాలి

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) కుంభకోణం అందరిపైనా ఒత్తిడిని పెంచుతోంది. అదే సమయంలో ప్రభుత్వరంగ బ్యాంకులపై ప్రజల్లో నమ్మకం పోయేలా చేసింది. పిఎన్‌బిలో డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ రూ.11,400 కోట్ల కుంభకోణం ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామా చేయాలని ఎఐబిఇఎ(అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంస్థ) ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటాచలం డిమాండ్ చేశారు. వేల కోట్ల రుణాలను ఎగవేసి విదేశాలకు పారిపోయిన నీరవ్ మోడీపై ఆర్‌బిఐ (భారతీయ రిజర్వు బ్యాంక్) ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉండడమేంటని అన్నారు. ఆర్‌బిఐ నిర్లక్ష్యం, వైఫల్యం ఇందులో కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ఉర్జిత్‌పటేల్ స్వతహాగా గవర్నర్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌బిఐకి చెందిన నామినీలు పిఎన్‌బిలో ఉన్నారని, అందుకే ఈ మోసం కేసుపై అధికారులు మిన్నకుండిపోయారని ఆయన ఆరోపించారు. నీరవ్ మోడీ ఘటన తర్వాతైనా బ్యాంకుల అకౌంట్ల వివరాలను ఆర్‌బిఐ పరిశీలించలేదని, ఇప్పటికైనా స్పందించకపోతే భారీగా నష్టపోతారని ఆయన హెచ్చరించారు. ఆర్‌బిఐ వేగంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

భారీ రుణ గ్రహీతల వివరాలు కోరిన ఐసిఎఐ

న్యూఢిల్లీ: భారీ మొత్తంలో రుణాలను ఎగవేసిన వారి వివరాలను అందజేయాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) ప్రభుత్వరంగ బ్యాంకులను కోరింది. పిఎస్‌యు బ్యాంకుల నుంచి రూ.2,000 కోట్లకు పైగా రుణాలు తీసుకున్న వారి జాబితా ఇవ్వాలని సూచించింది. చార్టర్డ్ అకౌంటెంట్స్ చట్టంలోని సెక్షన్ 21సి కింద తమ ముందు హాజరై పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించిన వివరాలివ్వాలని కోరినట్టు ఐసిఎఐ తెలిపింది. అలాగే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ, సిబిఐ, ఇడిలు తమ దర్యాప్తు వివరాలను ఐసిఎఐతో పంచుకోవాలని ఆదేశించాలంటూ కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖకు లేఖ రాసినట్టు పేర్కొంది. పిఎన్‌బి(పంజాబ్ నేషనల్ బ్యాంక్), గీతాంజలి జెమ్స్ ఆడిటర్లకు ఐసిఎఐ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పిఎన్‌బి డిప్యూటీ డైరెక్టర్‌కు సమన్లు పంపింది. అయితే రూ.2,000 కోట్లకు పైగా రుణాలు తీసుకున్న వారి జాబితాను ఐసిఎఐకి చెందిన ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డు పరిశీలించనుంది. అకౌంటింగ్, ఆడిటింగ్ ప్రమాణాల ఉల్లంఘనకు ఏమైనా అవకాశం ఉందా? సరిగ్గా నిబంధనలు పాటించాయా? అనేది తెలుసుకునేందుకు గాను ఈ వివరాలను ఇవ్వాలని కోరినట్టు ఐసిఎఐ పేర్కొంది.

ఐఫోన్లపై రూ.20 వేల వరకు డిస్కౌంట్



న్యూఢిల్లీ: యాపిల్ కంపెనీకి చెందిన ఐఫోన్‌లపై భారీగా రూ.20 వేల డిస్కౌంట్‌ను సంస్థ అందిస్తోంది. 256జిబి వేరియంట్ ఫోన్ ధర రూ.1.02 లక్షలు అంటే చాలా ఎక్కువ అని భావిస్తాం.. అయితే ఇప్పుడు ఐఫోన్ ఎక్స్‌ను రూ.20వేల డిస్కౌంట్‌తో పొందవచ్చని యాపిల్ పేర్కొంటోంది. యాపిల్ ఫోన్‌ను వినియోగించేవారు ఆఫ్‌లైన్ స్టోర్‌లలో ఎక్స్ఛేంజ్ కింద కొత్త ఫోన్‌పై రూ.20వేల వరకూ డిస్కౌంట్‌ను పొందవచ్చు. దీనితోపాటు ఆరు నెలల పాటు ఉచిత స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా యాపిల్ అందిస్తోంది. ఐసిఐసిఐ బ్యాంకు క్రెడిట్ కార్డును ఉపయోగించి నెలసరి వాయిదాలపై రూ.10వేల వరకూ అదనపు క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చు. కేవలం యాపిల్ ఐఫోన్ ఎక్స్ఛేంజ్ కింద మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. క్యాష్ బ్యాక్‌ను 90 పని దినాల్లో పొందవచ్చు. ఇది పరిమితకాల ఆఫర్, అయితే ముందస్తు ప్రకటన లేకుండా ఆఫర్‌ను ఎప్పుడైనా వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. కేవలం ఎంపిక చేసిన ఐఫోన్‌లపై మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఐఫోన్6ఎస్, ఐఫోన్6ఎస్ ప్లస్, ఐఫోన్ 7, ఐఫోన్ 7ప్లస్, ఐఫోన్ 8, ఐఫోన్ 8ప్లస్‌లతో పాటు, ఎంపిక చేసిన ఆండ్రాయిడ్ డివైజ్‌లపైనా వర్తిస్తుంది. ఫోన్‌కు ఎలాంటి డ్యామేజ్ ఉన్నా ఈ ఆఫర్ వర్తించదు. ఎంపిక చేయబడిన యాపిల్ ప్రీమియమ్ రీసెల్లర్ స్టోర్స్‌లోనే ఈ అవకాశం ఉందని కంపెనీ వెల్లడించింది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29210	31240.64	0.31%
ముంబై	29910	31989.30	0%
ఢిల్లీ	29750	31818.18	0%
కోల్‌కతా	30040	32128.34	0%
కేరళ	28300	30267.38	0%
బెంగళూరు	28600	30588.24	0.18%
హైదరాబాద్	29210	31240.64	0.24%
గల్ఫ్	1407.18	1505.00	–0.33%


వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	41600.00	41400.00	0.48
ముంబై	41600.00	41400.00	0.48
ఢిల్లీ	41600.00	41400.00	0.48
కోల్‌కతా	41600.00	41400.00	0.48
హైదరాబాద్	41600.00	41400.00	0.48

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	365
వరంగల్	357	చిత్తూరు	388
విజయవాడ	363	చెన్నై	395
గోదావరి	363	బెంగళూరు	385

నియంత్రణ సంస్థల వైఫల్యం



- ఏడేళ్లుగా మోసం జరుగుతున్నా గుర్తించలేదు
- పిఎన్‌బి మోసం ఆర్థిక వ్యవస్థకే 'మచ్చ'
- అవసరమైతే చట్టాలను మరింత కఠినతరం చేస్తాం
- కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: ఏడేళ్లుగా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో మోసం జరుగుతున్నా నియంత్రణ సంస్థలు గుర్తించడంలో విఫలమయ్యాయని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ విమర్శించారు. దేశీయ ఆర్థిక వ్యవస్థలో రాజకీయ నాయకులు, నియంత్రణ సంస్థలైనా ఉపేక్షించేది లేదని అన్నారు. డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ.. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.11,400 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌పై జైట్లీ ఈ వారంలో రెండోసారి స్పందించారు. మోసగాళ్ల వల్ల ఉద్యోగులు బాధలు పడాల్సి వస్తుందని, దీనికి అడ్డుకట్ట వేయాల్సి ఉందని అన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మెరుగుపర్చే ప్రయత్నంలో ఈ కుంభకోణం పెద్ద ఎదురుదెబ్బ అని, ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేసేందుకు ఇది అవకాశం కల్పిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. దేశ కంపెనీలకు ఇప్పుడు నైతిక విలువలతో కూడిన వ్యాపారం అవసరమని జైట్లీ అన్నారు.

నైతిక విలువలే ప్రధాన అంశంగా పనిచేసే వ్యాపార వాతావరణం బలపడాల్సి ఉందని, ఈ తరహా వాతావరణం కోసం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను కాదు.. ఈజ్ ఆఫ్ డూయింగ్ ఎథికల్ బిజినెస్' అనే నినాదాన్ని మొదలుపెట్టాలని సూచించారు. ఇటి గ్లోబల్ బిజినెస్ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ పిఎన్‌బి కుంభకోణం గురించి ప్రస్తావించారు. బ్యాంక్‌లో మోసం జరుగుతుంటే కనీసం ఒక్క ఉద్యోగి కూడా హెచ్చరించలేదని, ఆడిటర్లు మొక్కుబడిగా తమ విధులు నిర్వర్తించారని అన్నారు. బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్ దీనిపై దృష్టి సారించకపోవడం ఆందోళనకు గురి చేస్తోందని జైట్లీ అభిప్రాయపడ్డారు.

బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వాళ్లను ప్రభుత్వం ఎంత మాత్రం విడిచిపెట్టబోదని, వారిని పట్టుకొని కఠినంగా శిక్షిస్తుందని మరోసారి పునరుద్ఘాటించారు. వచ్చే ఏడాదిలో రాజకీయ నిధులకు సంబంధించిన అంశంపై ప్రత్యేక దృష్టిసారించనున్నామని ఆయన తెలిపారు. రుణాల మోసాలు జరగకుండా బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసే వారిని కఠినంగా శిక్షించేందుకు అవసరమైతే చట్టంలో కొన్ని మార్పులు చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ప్రైవేటీకరణ సాధ్యం కాదు



ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆది గోద్రేజ్ చేసిన వ్యాఖ్యలపై అరుణ్ జైట్లీ స్పందించారు. వివిధ రాజకీయ కారణాల రీత్యా పిఎస్‌యు బ్యాంకుల ప్రైవేటీకరణ సాధ్యపడదని అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం అనంతరం చాలామంది బ్యాంకుల ప్రైవేటీకరణ గురించి మాట్లాడుతున్నారని, అది పూర్తి రాజకీయ సంఘర్షణతో కూడిన వ్యవహారమని వ్యాఖ్యానించారు. దీని కోసం బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాలను సవరించాల్సి ఉంటుందని చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం ఉత్తమమని, ప్రైవేటు బ్యాంకుల్లో ఇలాంటి ఉదంతాలు లేవని పారిశ్రామికవేత్త ఆది గోద్రేజ్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ అంశానికి రాజకీయ ఏకాభిప్రాయం సాధ్యపడదని, ఇది చాలా కష్టతరమైన నిర్ణయమని జైట్లీ పేర్కొన్నారు. ఈ విషయంపై ఫిక్కీ అధ్యక్షుడు రాకేశ్ షా మాట్లాడుతూ రెండు, మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులు మినహా మిగతా వాటిని ఒక క్రమపద్ధతిలో ప్రైవేటీకరణ చేస్తే బాగుంటుందని ఇది వరకే కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీతో తెలిపానని అన్నారు. దీనికి అసోచామ్ పారిశ్రామిక వర్గాలు మద్దతు పలికాయి. కాగా గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడారు. ఆర్థిక అవకతవకలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, ప్రజల సొమ్మును దొంగిలించినవారిని చట్టం వదలబోదని అన్నారు

వేరే ఉద్యోగాలు చూసుకోండి

- 3500 మంది ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేను
- ఆస్తులు, బ్యాంక్ ఖాతాలను జప్తు చేశారు
- సిబ్బందికి గీతాంజలి అధినేత చోక్సీ లేఖ



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో రూ.11,400 కోట్ల కుంభకోణంలో నీరవ్ మోడీతో పాటు ఆయన మేనమామ, గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే చోక్సీ తన కంపెనీ ఉద్యోగులకు లేఖ రాశారు. సిబ్బందికి వేతనాలను చెల్లించలేనని, ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు. తమకు చెందిన పలు ఆస్తులు, బ్యాంక్ ఖాతాలను ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు సీజ్ చేశాయని, ఈ పరిస్థితుల్లో తన సంస్థలో పనిచేస్తున్న 3500 మంది ఉద్యోగులకు వేతనాలను చెల్లించలేమని అన్నారు. పిఎన్‌బి కుంభకోణంలో నీరవ్ మోడీతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఛోక్సీ.. తానెలాంటి తప్పు చేయలేదని అన్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఏమీ చేయలేనని, అంతిమంగా వాస్తవాలు బయట పడతాయని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం తన కంపెనీ విషయంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఎప్పుడు పరిస్థితి చక్కబడుతుందో చెప్పలేమని, వేరే ఉద్యోగాలు చూసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. విచారణ న్యాయంగా జరగట్లేదని, జీతాల బకాయిలు చెల్లించే వరకు కంపెనీ ఇచ్చిన ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్ ఉద్యోగులు తమ వద్దే ఉంచుకోవచ్చని స్పష్టంచేశారు. ఉద్యోగులకు రిలీవింగ్ లెటర్స్, ఎక్స్‌పీరియన్స్ లెటర్స్ అందజేస్తామని చెప్పారు. రెండు రోజుల క్రితం గీతాంజలి జెమ్స్ ఉద్యోగులు తమ జీతాల బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన చేశారు. ఇంతకుముందు నీరవ్ మోడీ కూడా ఇదేవిధంగా తన ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేను, వేరే ఉద్యోగాలు చూసుకోవాలని లేఖ రాసిన సంగతి తెలిసిందే. పిఎన్‌బి మోసం కేసు విచారణలో పలు సంస్థలు పర్యవేక్షిస్తున్నాయి. ఎన్‌సిఎల్‌టి, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి), సిబిఐ, సెబీ, వంటి సంస్థలు పిఎన్‌బి మోసం కేసు విచారణ చేపడుతున్నాయి.

నగదు విత్‌డ్రాపై పరిమితులు విధించలేదు

పుకార్లను ఖండించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్



న్యూఢిల్లీ: ఖాతాదారుల నగదు ఉపసంహరణలపై ఎలాంటి పరిమితులు విధించలేదని పంజాబ్ నేషనల్ బ్యాంకు స్పష్టం చేసింది. పరిమితులు విధించారని వచ్చిన వార్తలను ఖండించింది. ప్రతి కస్టమర్‌కు రూ.3,000 పరిమితి విధించినట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తోసిపుచ్చింది. బ్యాంక్‌లో 18 వేల మంది సిబ్బందిని ఇటీవల బదిలీ చేసినట్టు వచ్చిన వార్తల్లోనూ నిజం లేదని, 1,415 మందినే బదిలీ చేశామని తెలిపింది. బ్యాంకు శాఖల్లో సేవలు సాధారణంగానే కొనసాగుతున్నాయని, క్రికెటర్ విరాట్ కోహ్లీ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నారని స్పష్టం చేసింది. అలాగే, రూ.11,400 కోట్ల కుంభకోణంపై ఫోరెన్సిక్ ఆడిటింగ్‌కు ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్‌ను (పిడబ్ల్యూసి) నియమించుకోలేదని తెలిపింది. ఖాతాదారుల డెబిట్, క్రెడిట్ కార్డుల సమాచారం లీక్ అయిందంటూ వస్తున్న నివేదికలను బ్యాంక్ కొట్టిపారేసింది. బోర్డు ఆమోదిత సైబర్ సంక్షోభ నిర్వహణ ప్రణాళిక అమల్లోఉందని, భద్రత కోసం అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతుందని వివరించింది. పిఎన్‌బిలో మోసానికి స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన విషయం తెలిసిందే. దీంతో బ్యాంకుల మధ్య అంతర్గత సమాచారానికి వీలు కల్పించే స్విఫ్ట్ వ్యవస్థను కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌తో (సిబిఎస్) ఏప్రిల్ 1 నాటికి అనుసంధానించుకోవాలని ఆర్‌బిఐ గడువు విధించింది. సరైన అనుమతులు తీసుకోకుండా, సిబిఎస్‌లో లావాదేవీలను నమోదు చేయకుండా పిఎన్‌బి ఉద్యోగులు నీరవ్ మోడీ కంపెనీలకు ఎల్ఒయులను జారీ చేశారు. స్విఫ్ట్‌లో నామమాత్రంగా నమోదు చేశారు. స్విఫ్ట్, సిబిఎస్ మధ్య అనుసంధానత లేకపోవడంతో వారి అక్రమాలు జరిగాయిజరిగాయి.

కోలుకున్న ఈక్విటీ మార్కెట్లు

న్యూఢిల్లీ: వరుసగా మూడు వారాలుగా నష్టాలను నమోదు చేసిన తర్వాత ఎట్టకేలకు గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. వారాంతం శుక్రవారం మాత్రం షేర్లు తగ్గి ఉండడంతో కొనుగోళ్ల వెత్తి.. లాభాలు నమోదు చేశాయి. అయితే ఎల్ఒయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్) ద్వారా నీరవ్ మోడీ పిఎన్‌బిని రూ. 11,500 కోట్ల మేర మోసగించిన కేసు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీని కారణంగా బ్యాంకింగ్ షేర్లు, జువెలరీ షేర్లు నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో కుంభకోణం, అమెరికాలో వడ్డీ రేట్ల పెంపు అంచనా వెరసి మార్కెట్లు గత కొద్ది రోజులుగా పతన బాటలో పయనిస్తున్నాయి. వారాంతాన విదేశీ మార్కెట్ల ప్రోత్సాహంతో పుంజుకున్నాయి. మొత్తానికి సెన్సెక్స్ గత వారంలో 131 పాయింట్లు(0.4 శాతం) మాత్రమే లాభపడింది. ఆఖరి సెన్సెక్స్ 34,142 వద్ద స్థిరపడింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 39 పాయింట్లు(0.4 శాతం) లాభపడి 10,491 వద్ద ముగిసింది. చిన్న షేర్లు మార్కెట్ల మాదిరిగానే నష్టాలను నమోదు చేశాయి. బిఎస్ఇలో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.25 శాతం మేరకు బలహీనపడ్డాయి. రూపాయి బలహీనపడటంతో సెన్సెక్స్ దిగ్గజాలలో టిసిఎస్ 5 శాతం, ఇన్ఫోసిస్ 3 శాతం పెరిగింది. ఇదే బాటలో యస్‌బ్యాంక్ 4 శాతం, కొటక్ బ్యాంక్ 3 శాతం చొప్పున పుంజుకున్నాయి. ఆటో బ్లూచిప్స్ బజాజ్ ఆటో, ఏషియన్

వరుసగా మూడు వారాల నష్టాల తర్వాత కొనుగోళ్ల జోరు



పెయింట్స్ 4 శాతం, ఎంఅండ్ఎం, టాటా మోటార్స్ 3 శాతం నష్టపోయాయి. కాగా ఆఖరి రోజు శుక్రవారం మెటల్, ఫార్మా, ప్రైవేట్ రంగాల్లో భారీ కొనుగోళ్లు లాభాల ముగింపునకు కారణమయ్యాయి. రంగాల వారీగా చూస్తే అన్ని సెక్టార్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా మార్కెట్లు సానుకూలంగా ఉండడంతో సెంటిమెంటు బలపడింది. దీంతో దేశీయంగానూ ఎలాంటి ప్రతికూలాంశాలు లేకపోవడంతో ఇన్వెస్టర్లు, ట్రేడర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. చివరి అరగంటలో సెన్సెక్స్ సూచి అత్యధికంగా 347 పాయింట్ల లాభపడి 34168 పాయింట్ల గరిష్టస్థాయిని నమోదు చేసింది.

బ్యాంకింగ్, లోహ, లోహ, టెలికాం, హెల్త్‌కేర్ రంగాలకు చెందిన షేర్లు ర్యాలీ బాటపట్టాయి. అయితే మార్కెట్లో ప్రధానంగా మెటల్, ఫార్మా షేర్లు మంచి లాభాలతో దూకుడుగా ఉన్నాయి. మెటల్ సూచి 3.19 శాతం లాభపడి 4,028.80 వద్ద, ఫార్మా సూచి 2.64 శాతం ర్యాలీ 9,095.40 వద్ద ముగిసింది.

టాటాగ్లోబల్ బేవరేజ్‌లో వాటాలను తగ్గించుకున్న ఎల్ఐసి

న్యూఢిల్లీ : టాటా గ్రూప్ సంస్థలకు చెందిన టాటాగ్లోబల్ బేవరీజ్‌లో ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసి తన వాటాలను తగ్గించుకుంది. టాటా గ్లోబల్‌లో భారీగా పెట్టుబడులు పెట్టిన సంస్థాగత పెట్టుబడిదారుల్లో ఎల్ఐసి ఒకటి కావడం గమనార్హం. అయితే ఎల్ఐసి గతేడాది ఆగస్ట్ 23 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 21 మధ్యకాలంలో టాటాగ్లోబల్ బేవరీజ్ సంస్థకు చెందిన 2.05 శాతం వాటా అంటే 1.29 కోట్ల షేర్లను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా ఈ వాటాను విక్రయించినట్లు ఎల్ఐసి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలియజేసింది. ఈ వాటా విక్రయంతో టాటాగ్లోబల్ బేవరీజ్‌లో ఎల్ఐసికి ఉన్న 5.67 శాతం వాటా 3.62 శాతానికి పరిమితమైంది.

ఏకకాల ఎన్నికలు కష్టమే : ప్రణబ్



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఏకకాల ఎన్నికలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభిప్రాయంతో మాజీ రాష్ట్ర పతి ప్రణబ్ ముఖర్జీ భిన్నంగా స్పందించారు. లోక్‌సభ, శాసనసభల ఎన్నికలను ఏక కాలంలో నిర్వహించాలన్న ఆలోచనను అమలు చేయడం చాలా కష్టమని తెలిపారు. ఎన్నికలను కృత్రిమంగా కలపడమంటే రాష్ట్రాల ప్రజలకుగల ప్రాతినిధ్య ప్రభుత్వాల హక్కును హరించడమేనన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నిర్వహించిన లక్డావాలా స్మారకోపన్యాసంలో ప్రణబ్ మాట్లాడుతూ మన దేశంలో 29 రాష్ట్రాలున్నాయని, ప్రతి శాసనసభ ఐదేళ్ల పాటు కొనసాగాలని ఆశిస్తామన్నారు. అయితే కొన్నిసార్లు అలా సాధ్యం కాక పోవచ్చునని, ఏదైనా చట్టం ద్వారా కానీ, ప్రస్తుత చట్టానికి సవరణ చేయడం ద్వారా కానీ భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాలు కూలిపోకుండా భరోసా ఇవ్వగలరా? దీనికి సమాధానమేంటీ? అని ప్రశ్నించారు. ఒకవేళ ప్రభుత్వాలు కూలిపోతే మిగతా కాలానికి రాష్ట్రపతి పాలన పెడతారా? అందుకోసం అధికరణ 356 ప్రయోగిస్తారా? అని అడిగారు. అలా చేయవచ్చు, కానీ అది ప్రజాస్వామ్యబద్ధం కాదని ప్రణబ్ పేర్కొన్నారు.




పెళ్లి కానుకలో బాంబు

గిఫ్ట్ ప్యాక్ విప్పుతుండగా పేలుడు

వరుడు మృతి, వధువుకు తీవ్ర గాయాలు

భువనేశ్వర్ : ఒడిశా బొలాంగిర్ జిల్లాలో ఓ పెళ్లింట విషాద ఘటన చోటు చేసుకుంది. ఐదు రోజుల క్రితం జరిగిన వివాహం అనంతరం ఏర్పాటు చేసిన రిసెప్షన్ సందర్భంగా నూతన వధూవరులకు వచ్చిన ఓ గిఫ్ట్ ప్యాకెట్‌ను శుక్రవారం విప్పుతుండగా పేలింది. ఈ ఘటనలో వరుడితో పాటు ఆయన అమ్మమ్మ కూడా దుర్మరణం పాలయ్యారు. వధువు కూడా తీవ్ర గాయాలైనట్లు పోలీసులు చెప్పారు. వరుడి భామ అక్కడికక్కడే మృత్యువాత పడగా,నూతన పెళ్లికొడుకు రూర్కేలా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.అదే విధంగా ఆయన భార్య బుర్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈనెల 21న జరిగిన పెళ్లి రిసెప్షన్‌లో గుర్తుతెలియని వ్యక్తి కొంతజంటకు గిఫ్ట్ ఇచ్చాడని, దానిని విప్పుతుండగా అది పేలినట్లు వారు వెల్లడించారు. ఘటనకు సంబంధించి పోలీసులు సాక్షాధారాలు సేకరించామని, దర్యాప్తు చేస్తున్నట్లు పాట్నాగఢ్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(ఎస్‌డిపిఒ) సెసదేవ బారియా వెల్లడించారు. దుండగుడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కాగా, బొలాంగిర్ జిల్లా ముఖ్య వైద్య అధికారి ఎస్ మిశ్రా మాట్లాడుతూ ఈ పేలుడులో గాయపడిన మరో వ్యక్తి కూడా రూర్కేలాలోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడన్నారు.

నేషనల్ హెరాల్డ్ ఎడిటర్ కన్నుమూత



చెన్నై: సీనియర్ జర్నలిస్ట్, ఢిల్లీ కేంద్రంగా నడుస్తున్న నేషనల్ హెరాల్డ్ ఎడిటర్ ఇన్ చీఫ్ నీలబ్ మిశ్రా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. ఆయన వయసు 57 సం వత్సరాలు. ఆయన జీవిత భాగస్వామి కవితా శ్రీవాస్తవ, సోదరుడు శైలోజ్ కుమార్, మరదలు సుధ, కోడలు నవాష ఉన్నారని నేషనల్ హెరాల్డ్ తన వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసింది. ఈ నెల ప్రారంభంలో తీవ్ర అనారోగ్యానికి గురైన మిశ్రా చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరారు.2016లో పునర్ ప్రారంభించిన నేషనల్ హెరాల్డ్‌కు మిశ్రా సారథ్యం వహిస్తున్నారు. మిశ్రా మృతికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సంతాపం వ్యక్తం చేశారు.

మోస్ట్ వాంటెడ్ తీవ్రవాది హతం

షిల్లాంగ్ : మేఘాలయలో మోస్ట్ వాంటెడ్ తీవ్రవాది హతమయ్యాడు. తూర్పు గారో హిల్స్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చట్ట విరుద్ధ గారో నేషనల్ లిబరేషన్ ఆర్మీ (జిఎన్‌ఎల్‌ఎ) చీఫ్‌ను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఇదే జిల్లాలో ఈనెల 18న జిఎన్‌ఎల్‌ఎ జరిపి ఐఇడి దాడిలో ఎన్‌సిపి అభ్యర్థి జొనతోన్ ఎన్ సంగ్మ మృతి చెందడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున దక్షిణ, తూర్పు గారో హిల్స్ జిల్లాల్లో కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో దోబు ప్రాంతంలో జిఎన్‌ఎల్‌ఎ తీవ్రవాదుల కదలికలను గుర్తించిన నిఘా వర్గాలు ఇచ్చి సమాచారం మేరకు భద్రతా దళాలు రంగంలోకి దిగి కూంబింగ్‌ను తీవ్ర చేసినట్లు ఆపరేషన్‌లో పాల్గొన్న ఓ సీనియర్ పోలీస్ అధికారి చెప్పారు.

9మంది విద్యార్థులు దుర్మరణం

ముజఫర్‌పూర్ : బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ముజ ఫర్‌పూర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ సమయం మగిసిన అనంతరం జాతీయ రహదారి 77ను దాటు తుండగా అతివేగంగా వచ్చిన ఓ వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో 9 మంది విద్యార్థులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన నేపథ్యం లో ముజఫర్‌పూర్, ఉత్తర బీహార్‌ను అనుసంధానిస్తూ రద్దీగా ఉండే రోడ్డు రక్తసిక్తమైంది. రక్తపు మడుగులు, చెల్లాచెదురైన విద్యార్థుల మృత దేహాలతో అక్కడ భయానక వాతావరణం నెలకొన్నట్లు ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడిం చారు. కాగా, ఇప్పటి వరకు 9 మంది విద్యార్థుల మరణాన్ని ధ్రువీకరించామని, మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని తూర్పు మజఫర్‌పూర్ డిప్యూటీ ఎస్పి గౌరవ్ పాండే మీడియాకు తెలిపారు. మొదట జాతీయ రహదారిపై ఓ ట్రక్కు మహిళను ఢీకొట్టిందని, విషయాన్ని గమనించిన కొంతమంది ఆమెను రక్షించేందుకు పరుగులు పెట్టారని, అదే సమయంలో అతివేగం తో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం వారిని తప్పించబోయి విద్యార్థులను ఢీకొట్టిందన్నారు.

భిన్నత్వమే విజయానికి కీలకం: జస్టిన్

న్యూఢిల్లీ: కష్టాలనుంచి త్వరగా బయటపడడానికి, విజయ సాధనకు భిన్నత్వమే కీలకం అని కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో ఇక్కడ 'మార్పుకు ఆలంబన కాగల యువత ' అంశంపై జరిగిన 2018 మహాసభలో ప్రసంగిస్తూ సూచన చేశారు. వ్యాపార, రాజకీయ రంగాలను మరింత మెరుగ్గా రూపొందడంలో మహిళల సాధికారత బాగా అందివస్తుందని కూడా ఆయన అన్నారు. రానున్న జూన్‌లో కెనడాలో జరిగే జి– 7 సమావేశంలో లింగ భేదాల సమస్యను కూడా చర్చనీయాంశం చేయనున్నట్లు తెలిపారు. మహా సముద్రాలు, ప్లాస్టిక్ కూడా మరో అంశం కానుందని తెలిపారు.

రాజ్యసభ టివి ఎడిటర్‌గా మహాజన్

న్యూఢిల్లీ: రాజ్యసభ టెలివిజన్ కొత్త ఎడిటర్– ఇన్– చీఫ్‌గా టివి జర్నలిస్టు రాహుల్ మహాజన్‌ను నియమించారు. సభ చైర్మెన్ వెంకయ్య నాయుడు ఈ నియామకాన్ని శనివారం ఆమోదించారు. ప్రసార భారతి చైర్మెన్ సారథ్యంలోని అయిదుగురు సభ్యుల ఎంపిక సంఘం ఈ నిర్ణయం తీసుకొంది. మొత్తం 57 మంది ఈ పదవిని ఆశిం చగా 15 మందిని ఇంటర్వ్యూ చేసిన కమిటీ మహాజన్‌ను సిఫార్సు చేసింది. వయస్సు 46 ఏళ్లు. ఆయనకు మీడియాలో 26 ఏళ్ల అనుభవం ఉంది.

కేరళ హత్య కేసులో చార్జిషీట్

తిరువనంతపురం: కేరళలో గిరిజన యువకుడు మధు హత్య కేసులో ఎనిమిది మందిపై చార్జిషీట్ నమోదు చేశామని ఐజిపి, ప్రత్యేక దర్యాప్తు బృంద ఇంచార్జి ఎంఆర్ అజిత్ కుమార్ తెలిపారు. మృతుడిపై తీవ్ర దాడి జరిగిందని, ఆయన రెండు పక్కటెముకలువిరిగి పోయినట్లు పంచనామాలో వెల్లడైంది. ఆయనకు తీవ్రంగా అంతర్గత గాయాలు అయినట్లు ఫోరెన్సిక్ నిపుణులు తెలిపారు. చోరీలకు పాల్పడుతున్నాడనే అనుమానంతో కొంతమంది యువకులు మధుపై అత్యంత క్రూరంగా దాడి చేసి కొట్టి చంపడం సంచలనం రేపింది.

21 నీరవ్ ఆస్తులు అటాచ్

● మొత్తం విలువ రూ. 523 కోట్లు ● సముద్రలో వేలకొద్ది విదేశీ వాచ్‌లు ● ఫార్మ్ పెంట్‌హౌస్‌లు, సోలార్ ప్లాంట్లు.. భూములు

ముంబై /న్యూఢిల్లీ : పిఎన్‌బి మోసానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం నీరవ్ మోడీకి చెందిన 21 ఆస్తులను స్వాధీనం చేసుకుంది. వీటిలో ఒక విలాసవంతమైన పెంట్‌హౌజ్, ఫార్మ్‌హౌజ్ ఉన్నట్లు వీటివిలువ రూ 523 కోట్ల వరకూ ఉంటుందని వెల్లడైంది. ముంబైలోని వొర్లీ ప్రాంతంలో సముద్ర అభిముఖంగా నీరవ్‌కు చెందిన సముద్ర మహల్ అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. వీటి విలువ రూ 15.45 కోట్లు అని, ఇక మూడు ఫ్లాట్లు కలిపి రూపొందించిన పెంట్‌హౌజ్ రూ 81.16 కోట్ల వరకూ ఉండొచ్చునని అధికారులు తెలిపారు. వీటిని ఇతర చోట్ల ఆస్తులను ఇడి ఇప్పుడు అటాచ్ చేసుకుంది. నీరవ్ నివాసంలో జరిపిన దాడుల సందర్భంగా మొత్తం పదివేల విదేశీ వాచ్‌లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నీరవ్ ఆధీనంలో ఉన్న కంపెనీ కి చెందిన 21 స్థిరాస్తులను అటాచ్ చేసుకున్నట్లు వీటి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ 523.72 కోట్ల వరకూ ఉండనున్నట్లు , స్వాధీనపర్చుకున్న వాటిలో ఆరు నివాసిత ఆస్తులు, పది కార్యాలయాలు, పుణేలోని రెండు ఫ్లాట్లు, ఒక సోలార్ పవర్ ప్లాంట్, అలీబాగ్‌లో ఒక ఫార్మ్‌హౌజ్, అహ్మద్‌నగర్ జిల్లాలో కర్జాత్‌లో 135 ఎకరాల భూమి ఉన్నట్లు ఇడి వర్గాలు తెలిపాయి. ఇప్పటికే దర్యాప్తు సంస్థ వారు కంపెనీకి చెందిన విలువైన వజ్రాలు, ముత్యాలు, ఆభరణాలు, షేర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకూ జప్తు చేసుకున్న ఆస్తుల విలువ రూ 7000



కోట్ల వరకూ ఉంటుందని భావిస్తున్నారు. నీరవ్ కంపెనీ పిఎన్‌బిని రూ 13వేల కోట్లకు పైగా మోసగించినట్లు సిబిఐ ఇతర దర్యాప్తు సంస్థలు కేసులు నమోదు చేశాయి. సముద్ర మహల్, పుణేలోని రెండు ఇతర ఫ్లాట్లు నీరవ్ ఆయన భార్య అమీ పేరిట ఉన్నాయి. ఇతర ఆస్తులు ఆయన డైమండ్ కంపెనీ ఫైర్‌స్టార్టర్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేటు లిమిటెడ్ పేరిట ఉన్నట్లు గుర్తించారు. ఇక ఇప్పుడు స్వాధీనం చేసుకున్న 53 ఎకరాల సోలార్ ప్లాంట్ విలువ రూ రూ 70 కోట్ల వరకూ ఉంటుందని అంచనా వేశారు.

నీరవ్, ఛోక్సీ పాస్‌పోర్టులు రద్దు

పిఎన్‌బి స్కామ్‌లో కీలక పాత్రధారులు నీరవ్ మోడీ, మెహుల్ ఛోక్సీల పాస్‌పోర్టులను అధికారులు రద్దు చేశారు. రూ 11,300 కోట్ల మేర బ్యాంకు రుణాలను పొంది నీరవ్ తన మేనమామ ఛోక్సీతో పాటు అమెరికాకు వెళ్లిన నేపథ్యంలో ఇప్పుడు తొలుత పాస్‌పోర్టులను తాత్కాలికంగా నిలిపివేసిన అధికారులు వీటిని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పాస్‌పోర్టుల రద్దు గురించి నీరవ్ మోడీకి ఆయన ప్రస్తుతం ఇచ్చిన చిరునామాకు వర్తమానం పంపించినట్లు,అదే విధంగా భారతదేశంలోని ఆయన నివాసాల వద్ద కూడా తెలియచేసినట్లు విదేశాంగ మంత్రిత్వశాఖతెలిపింది. పాస్‌పోర్టు రద్దు నోటీసు జారీ చేశామని, ఇప్పుడు ఆయన నుంచి సమాధానం కోసం చూస్తూ ఉన్నామని మంత్రిత్వశాఖ ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. అయితే పాస్‌పోర్టుల రద్దు అంశంపై నీరవ్ లాయర్ విజయ్ అగర్వాల్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ సంస్థలు పరస్పర విరుద్ధ రీతిలో వ్యవహరిస్తున్నాయని, ఇడి ఒకటి చెపుతుంటే పాస్‌పోర్టు అథార్టీ మరో విధంగా వ్యవహరిస్తోందని,తొలుత పాస్‌పోర్టులను సస్పెండ్ చేశారని, ఇప్పుడు రద్దు చేశారని, మరో వైపు ఇడి వర్గాలు తమ క్లయింట్‌ను ఇండియాకు వచ్చి దర్యాప్తుకు సహకరించాలని కోరుతున్నాయని,పాస్‌పోర్టు రద్దు అయిన తరువాత విదేశాలలోని వ్యక్తి ఏ విధంగా ఇండియాకు వస్తాడని, విచారణకు సహకరిస్తారని లాయర్ ప్రశ్నించారు.

60రోజుల్లో తేల్చాలండి

బ్యాంక్ స్కాంపై కాంగ్రెస్ గడువు

న్యూఢిల్లీ : భారీ స్థాయి బ్యాంక్ స్కామ్‌లకు ఎవరు జవాబుదారి అనేది ప్రధాని మోడీ కనీసం 60 రోజుల్లో తేల్చాల్సి ఉందని కాంగ్రెస్ సవాలు విసిరింది. పిఎన్‌బి కుంభకోణంపైఆర్‌బిఐ దర్యాప్తు అవసరం అని, రూ 11,400 కోట్లకు పైగా ఆర్థిక అక్రమం ఆర్‌బిఐ దర్యాప్తుతోనే నిగ్గు తేలుతుందని కాంగ్రెస్ ప్రతినిధులు కపిల్ సిబల్ తెలిపారు. బ్యాంక్‌ల కుంభకోణానికి బాధ్యులు ఎవరు? ఆర్థిక మంత్రిత్వశాఖనా, ఆర్‌బిఐనా లేక సంబంధిత బ్యాంకుల యాజమాన్యాలా? ఏమిటనేవి రెండు నెలల్లోగా ప్రధాని జాతికి తెలియచేయాల్సి ఉందని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఇప్పుడు ఓరియంటల్ బ్యాంకుకు కూడా కన్నం సంగతి తెలియడంతో ఇప్పటివరకూ దేశానికి బ్యాంకుల వ్యవహారాలతో రూ 21,000 కోట్ల మే ర నష్టం జరిగిందని, మరికొన్ని బ్యాంకు స్కామ్ లు కూడా వెలుగులోకి రానున్నాయన్నారు. దేశానికి అత్యంత ఖరీదైన చౌకీదారుగా మోడీ ఉన్నారని, మరి ఇన్ని అవకతవకలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు.

సుప్రీంకు చిదంబరం

న్యూఢిల్లీ: గోప్యత హక్కు సహా తన ప్రాథమిక హక్కుల రక్షణ కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎయిర్‌సెల్–మాక్సిస్, ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులకు సంబంధించి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంకు సమన్లు ఇవ్వడం, కేంద్ర దర్యాప్తు సంస్థ(సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) దాడుల నేపథ్యంలో చిదంబరం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజకీయ కక్షలో భాగంగా సిబిఐ, ఇడి వేధించే విధంగా సోదాలు నిర్వహించాయని, పదేపదే సమన్లు ఇచ్చాయని తన వినతిలో ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14(న్యాయం ముందు అందరూ సమానులే), ఆర్టికల్ 19 (భావ స్వేచ్ఛ), ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ)ల కింద గోప్యత హక్కు, జీవించే హక్కు, కుంటుంబ సభ్యులతో కలసి గౌరవ ప్రదంగా జీవించే హక్కును కోరుతూ రిట్‌ను చిదంబరం దాఖలు చేశారు.

వెలుగులోకి మరో కుంభకోణం

ఓరియంటల్ బ్యాంకుకు రూ. 389 కోట్ల టోపీ

న్యూఢిల్లీ : మరో వజ్రాల కంపెనీ బ్యాంకును నిండా ముంచిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని ద్వారకాదాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఓరియంట్ బ్యాంక్‌ను రూ. 389 కోట్ల మేర మోసగించినట్లు వెల్లడైంది. వజ్రాలు, నగల ఎగుమతి లావాదేవీలలో ఉన్న ఈ కంపెనీపై సిబిఐ కేసు దాఖలు చేసింది. నీరవ్ మోడీ, మెహుల్ ఛోక్సీ, ఆ తరువాత రోటామాక్ అధినేత విక్రమ్ కొఠారీ తరువాతి క్రమంలో సిబిఐ స్పందన వెలువడింది. నీరవ్, మేనమామ ఛోక్సీలకు చెందిన గీతాంజలి వజ్రాల కంపెనీ బ్యాంకులకు భారీ స్థాయిలో టోపీ పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ కంపెనీ వారు ఓరియంటల్ బ్యాంక్‌ను ఎంచుకుని రుణాలు దండిగా తీసుకున్నట్లు వెల్లడైంది. 2007–12 మధ్యకాలంలోనే కంపెనీ వారు వివిధ రుణ పద్ధతుల ద్వారా ఈ బ్యాంకు నుంచి రుణాలు పొందారు. ఇవన్నీ తప్పుడు పద్ధతుల ద్వారా సాగిన రుణ లావాదేవీలని తేలడంతో దీనిని గుర్తించి బ్యాంక్ వారు ఆరు నెలల క్రితమే కంపెనీ పై ఫిర్యాదు చేశారు. సంస్థకు డైరెక్టర్లు సభ్య సేథ్, రీటా సేథ్, కృష్ణకుమార్ సింగ్, రవీసింగ్‌లపై కేసులు నమోదు



చేసినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. ఈ కంపెనీ డైరెక్టర్లతో పాటు ద్వారాకా దాస్ సేథ్ సెజ్ ఇన్ కార్పొరేషన్‌పై కూడా కేసు దాఖలు అయింది. ఇతర రుణాల చెల్లింపుల పేరిట ఈ ద్వారకాదాస్ కంపెనీ వారు రుణాల లేఖలు (ఎల్‌ఒసి)ను బ్యాంక్ నుంచి దక్కించుకుని రుణాలు పొందారు. తరువాత తప్పుడు లావాదేవీలతో ఈ మొత్తాలతో వజ్రాలు, ఆభరణాలను కొనుగోలు చేయడం, వేరే దేశాలకు నిధులను బంగారాన్ని తరలించడం వంటి చర్యలకు పాల్పడినట్లు గుర్తించామని బ్యాంక్ ఫిర్యాదులో వెల్లడైంది.

'అమ్మ' ద్విచక్ర వాహనాలు

మహిళా సాధికారతకు ప్రధాని మోడీ పిలుపు

చెన్నై: కుటుంబ సంక్షేమానికి పాటుపడే మహిళలను ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. మహిళల ప్రయోజనాలకు ఉద్దేశించిన పథకాలు వారి సాధికారతకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. తమిళనాడు మహిళలకు ఉద్దేశించిన... జయలలితకు ఎంతో ఇష్టమైన ద్విచక్ర వాహన పథకాన్ని ప్రధాని శనివారం ఆవిష్కరించారు. 'ఒకవేళ ఆమె జీవించి ఉంటే ఈ పథకం లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వు చూసి ఆనందించి ఉండేవారు' అని ఆయన జయలలిత గురించి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఐదుగురు లబ్ధిదారులైన మహిళలకు ప్రతీకాత్మకంగా(సింబాలికల్లీ) ద్విచక్ర వాహనం తాళం చెవులు, రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు.



ఇదే సందర్భంలో ఆయన 70 లక్షల మొక్కల పంపిణీని కూడా ఆవిష్కరించారు. మహిళల సాధికారత, ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన ఈ రెండు పథకాలు ఎంతో సాధిస్తాయన్నారు. 'కుటుంబంలోని మహిళలకు సాధికారతను మనం కల్పిస్తే మొత్తం కుటుంబం సాధికారమవుతుంది.మహిళా విద్యకు మనం సాయపడితే మొత్తం కుటుంబం విద్యావంతం అవు తుంది, మహిళలు ఆరోగ్యంగా ఉంటే మొత్తం కుటుంబం ఆరోగ్య వంతం అవుతుంది'అని చెప్పారు.'సామాన్యులు సౌఖ్యం గా బతికే సాధికారత కోసం తమ ఎన్‌డిఎ ప్రభుత్వం కృషి చేస్తోంది' అని మోడీ అన్నారు.

ఆర్థిక నేరాలను సహించేది లేదు

ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : నీరవ్ మోడీ కేంద్ర బిందువుగా ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కామ్‌పై ప్రధాని మోడీ తొలిసారి స్పందించారు. ప్రజా ధనం దుర్వినియోగం ఆమోదయోగ్యం కాదని, ఆర్థిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎకనామిక్ టైమ్స్ నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్న ప్రధాని నేరుగా పిఎన్‌బి స్కామ్‌ను ప్రస్తావించకుండా వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక మోసాలను ప్రభుత్వం సహించబోదని, వాటికి చెక్ పెడుతుందని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం వారిపై చర్యలు ఉంటాయని చెప్పా రు. భారీ స్థాయిలో బ్యాంక్ స్కామ్‌లు జరుగుతూ ఉన్నా , ఆర్థిక నేరస్తులుగా దర్యాప్తు సంస్థల విచారణలు ఎదుర్కొంటున్న వారు విదేశాలకు పారిపోతూ ఉన్నా ప్రధాని పట్టించుకోవడం లేదని విమర్శలు వెలువడ్డాయి. పత్రిక నిర్వహించిన సదస్సులో 45 నిమిషాల ప్రసంగంలో ప్రధాని మోడీ భారతీయ బ్యాంకర్లు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉందని హెచ్చరించారు. తమ ప్రభుత్వం నాలుగేళ్లలో పునే దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిందని , ఐదు బలహీనదేశాల జాబితా దశ నుంచి ఇప్పు డు ఐదు లక్షల ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారిందని తెలిపారు. ఇదంతా కూడా దృక్పథం పని తీరు మార్పిడితోనే సాధ్యం అయిందని, ఈ ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ పలు విధాలు గా కొత్త దనం సంతరించుకుందని, పోటీ తత్వా న్ని సముపార్జించుకుందని, ఆర్థిక వ్యవస్థకు ఆరో గ్య పోటీ తప్పనిసరిగా ఉండాలని, పురోగతిదశలో ఇబ్బందులూ ఉంటాయని అయితే వీటిని సవాలుగా తీసుకుని వెళ్లాల్సిఉందని ప్రధాని తెలిపారు. సమ్మిట్‌లో నూతన ఆర్థిక వ్యవస్థ, నూతన నిబంధనల ఇతివృత్తంతో జరుగుతున్న చర్చకు ప్రభుత్వం తలపెట్టిన నూతన భారతం దృక్పధానికి సంబంధం ఉందని ప్రధాని వెల్లడించారు. ఇటి ఏర్పాటు చేసిన సదస్సులో జూనియర్ ట్రంప్, బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్, నెట్‌ఫిక్స్ సిఇఒ రీడ్ హాస్టింగ్స్, ఉబెర్ సిఇఒ దారా కోస్రోవ్‌షాహీ ఇతరులు పాల్గొన్నారు.ఆర్థిక సంస్థలలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వారు మరింతగా చిత్తశుద్ధితో వ్యవహరించాలని ప్రధాని కోరారు. బ్యాం కింగ్ వ్యవస్థలో పర్యవేక్షక, నిర్వాహక స్థాయిల్లో ఉండే వారు ఖచ్చితంగా నిర్దిష్టంగా అంకితభావంతో విద్యుక్త ధర్మాన్ని పాటించాల్సి ఉందని, ఈ విధంగా వ్యవహరించకపోతే కఠినమైన చర్యలు తప్పవన్నారు.



భీముడు కాదు ప్రపంచ ఊబకాయుడు. 595 కిలోల బరువుతో రెండేళ్ల కిందట ప్రపంచ అతిభారీ స్థూలకాయుడిగా ఏకంగా గిన్నీస్ రికార్డులో పేరు తెచ్చుకున్నారు. పశ్చిమ మెక్సికోకు చెందిన జువాన్ పెడ్రో ఫ్రాన్కోకు ఆయన భారీకాయమే శత్రువుగా మారింది. ఈ భారీ కాయుడిని చూసి ప్రపంచం నవ్వుకుంది, కానీ ఆయనకు అడుగు తీసి అడుగువేయలేని స్థితి చెప్పలేనంత బాధనే మిగిల్చింది.ఆయన తనకు తానే కాకుండా ఇతరులకు కూడా భారం కాకూడదనే పట్టుదలతో ఊబకాయంపై ప్రకటించిన యుద్ధం ఫలితాన్ని ఇస్తోంది. తాను వ్యాయామం కోసం తెచ్చుకున్న అధునాతన సైకిల్‌తో కుస్తీలాగా వ్యాయామాలకు దిగుతూ ఇప్పటివరకూ 250 కిలోల బరువు తగ్గాడు. భారీ కాయంతో కేవలం మంచానికే పరిమితం అయి, ఓ వైపు డయాబెటిస్, మరో వైపు అధిక రక్తపు పోటుతో , పూర్తి స్థాయిలో దెబ్బతిన్న ఊపిరితిత్తులతో అనేక విధాలుగా నరకం అనుభవించా డు.

ఊబకాయుడి ఉనికి పోరు

● ఆపరేషన్లు ...కడుపుకోతలు

భారీ ఊబకాయ దశలో డాక్టర్లు ఆయనను పరీక్షించి బరువు తగ్గితే తప్ప ఆరోగ్యం బాగుపడదని, ఇదే విధంగా ఉంటే ప్రాణాలకే ముప్పు అని హెచ్చరించారు. దీనితో వారి సలహా మేరకు ఫ్రాన్కో రెండుసార్లు ఉదరసంబంధిత సర్జరీ చేయించుకున్నాడు. పలు రకాల ఆరోగ్య జాగ్రత్తలు చివరికి భారీ స్థాయిలో ఉండే పొట్టలోని కొంత భాగాన్ని కూడా తొలిగించుకుని ఆయన కొవ్వును తీసేసే యత్నాలకు దిగారు. అయితే కేవలం బెడ్‌కే పరిమితం అయి ఉన్న దశలో ఆయనకు వ్యాయామం కుదరదని కేవలం సర్జరీల ద్వారానే పొట్టను పేరుకుపోయిన కొవ్వును తొలిగించాల్సి ఉందని నిర్ధారించుకున్న డాక్టర్లు ఏకంగా ఆయన ఊబకాయానికి పలు ఆపరేషన్లు నిర్వహించారు. ఇప్పుడు 33 ఏళ్ల ఫ్రాన్కో బరువు 345 కిలోలకు చేరింది. 24 గంటలూ కృత్రిమ శ్వాసకు ఆక్సిజన్ ట్యూబ్‌లతో ఉండాల్సి వస్తోన్న ఫ్రాన్కో క్రమంగా వాకర్ సాయంతో నడుస్తున్నాడు. అతి తక్కువ సమయం బెడ్‌పై ఉంటున్నాడు. ఇదే విధంగా సాగితే ఆయన మరో ఏడాదిన్నరలో మరో వంద కిలోల బరువు తగ్గుతాడని డాక్టర్లు చెపుతున్నారు.





● నడవాలని ఉందంటున్న ఫ్రాన్కో

ఏళ్ల తరువాత వాకర్ సాయంతో తిరిగి తొలి అడుగులు వేస్తున్న ఫ్రాన్కో వాకర్ లేకుండా నడవాలనేదే తన కల అని చెపుతున్నాడు. తనకు నడవాలని ఉందని ఇందుకు ఎంతటి శ్రమను బాధను అయినా ఓర్చుకుంటానని చెపుతున్నాడు. చాలా కాలం ఇంటికే పరిమితం అయి, సూర్యరశ్మి కూడా సోకకుండా ఉండటంతో ఆయన శరీరం అంతా పాలిపోయినట్లుగా మారింది. అతి ఎక్కువ సమయం వ్యాయామం చేస్తూ మిగిలిన సమయంలో కూర్చుని స్వెటర్లు అల్లడం, స్వీట్లు తయారు చేయడం వంటి పనులు చేస్తూ వాటిని కుటుంబ సభ్యులు అమ్మితే వచ్చే డబ్బుతో ఇంటి అవసరాలు తీరేలా చేస్తున్నాడు. వ్యాయామంలో భాగంగా బరువులు ఎత్తుతూ , చక్రాలు తిప్పుతూ గడుపుతున్నాడు. ఆయనకు బతుకు పట్ల ఆశాభావం ఉందని, బతుకు తిరిగి గాడిలోకి పెట్టుకోవాలని, తనంతతానుగా లేచి తిరిగి అందరిలో ఒకడిగా మారాలనే తపన ఉందని, ఇది ఆయన చికిత్సకు బాగా ఉపకరించే అంశం అవుతుందని సర్జన్ జోసే ఆంటోనియో కాస్టానెడా సంతోషం వ్యక్తం చేశారు. ఐరాస ఆహార సంస్థ నివేదిక ప్రకారం లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతాలలో ఊబకాయులు ఎక్కువ.



త్రిపురలో ప్రభుత్వ ఏర్పాటుపై సిపిఐ(ఎం) ధీమా

అగర్తలా: త్రిపురలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆ రాష్ట్రంలోని అధికారిక పార్టీ సిపిఐ (ఎం)శని వారం ధీమాను వ్యక్తం చేసింది. 8వ సారి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం తిరిగెన్నిక కాగలదని ఆ రాష్ట్ర సిపిఐ(ఎం) కార్యదర్శి బిజన్ ధర్ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశానంతరం చెప్పారు. సమావేశానికి ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ కూడా హాజరయ్యారు.త్రిపురలో 59 స్థానాలకు ఫిబ్రవరి 18న ఎన్నికలు జరిగాయి.ఓట్ల లెక్కింపు మార్చి3న జరగను న్నది. సిపిఐ(ఎం) అభ్యర్థి ఒకరు మరణించిన కారణంగా ఒక నియోజకవర్గం ఎన్నిక వాయి దా పడింది. ఆ ఎన్నిక మార్చి 12న జరుగుతుంది. 2013లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ 52.32 శాతం ఓట్లు, 50 సీట్లు గెలుచుకుంది. తర్వాత 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో సిపిఐ(ఎం) కూటమి గెలిచింది. 'ఈసారి ఇంకా ఎక్కువ సీట్లు గెలుచుకుంటారా?'అని అడిగిన ప్రశ్నకు బిజన్ ధర్ 'మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.దీనికి మించి మేము వేరే ఏమి పార్టీ కమిటీ సమావేశంలో చర్చించ లేదు' అన్నారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బిజె పి, దాని మిత్రపక్షం ఇండీజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఉద్రిక్తతను సృష్టించి హింసను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నా యన్నారు. ప్రజలు శాంతిని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కారుబాంబు దాడుల్లో 38 మంది మృతి

మొగదీషు : సోమాలి రాజధాని మొగదీషులో శుక్రవారం రెండు కారు బాంబుదాడులు జరిగాయి. ఈ దాడుల్లో మొత్తం 38 మంది మృతి చెందారు. దేశ అధ్యక్ష భవనం, ఓ హోటల్‌ను లక్ష్యంగా చేసుకొని బాంబుదాడులు చోటు చేసుకున్నాయి. మొదటగా విల్లా సోమాలియాకు అత్యంత సమీపంలో ఉన్న భద్రతా తనిఖీ కేంద్రం వద్ద పేలుడు జరగగా, ఆ వెంటనే ఓ హోటల్ వద్ద రెండవ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ దాడులకు పాల్పడింది తామేనని ది షబాబ్ ఇస్లామిస్ట్ తీవ్రవాద గ్రూపు ఆన్‌లైన్‌లో ఒక ప్రకటనను విడుదల చేసింది. తమ లక్ష్యం ప్రభుత్వ, భద్రతా సర్వీసులేనని పేర్కొంది.

2018లో ఏడుగురు జడ్జిల రిటైర్




న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి 1 తర్వాత ఏడుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పటికే సుప్రీంకోర్టుకు ఆరుగురు న్యాయమూర్తుల కొరత ఉంది. పైగా ఇద్దరు న్యాయమూర్తులను నియమించేందుకు చేసిన సిఫార్సులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. మార్చి 1న న్యాయమూర్తి అమితవ రాయ్ పదవీ విరమణ చేయనున్నారు. తర్వాత మే 4న న్యాయమూర్తి రాజేశ్ అగర్వాల్ కూడా పదవి నుంచి తొలగనున్నారని సుప్రీంకోర్టు వెబ్‌సైట్, న్యాయమంత్రిత్వ శాఖ తెలిపాయి. న్యాయమూర్తి రాయ్‌కు శుక్రవారమే చివరి పనిదినం కానున్నది. ఎందుకంటే సుప్రీంకోర్టు హోలి పర్వదిన సెలవుల తర్వాత మళ్లీ మార్చి 5నే తెరుచుకోనున్నది. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ అయిన న్యాయమూర్తి జె. చలమేశ్వర్ రావు జూన్ 22న పదవి నుంచి విరమించనున్నారు. తర్వాత జులై 6న న్యాయమూర్తి ఆదర్శ్ గోయల్ పదవి నుంచి దిగిపోనున్నారు. ఒక భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అక్టోబర్ 2న పదవీ విరమణ చేయనున్నారు. తర్వాత నవంబర్ 29న న్యాయమూర్తి కురియన్ జోసఫ్, డిసెంబర్ 30న న్యాయమూర్తి మదన్ బి లోకుర్ పదవీ విరమణ చేయనున్నారు. ఇలా వరుసగా న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడం వల్ల, ఇప్పటికే ఆరుగురు జడ్జీల కొరత కారణంగా కొత్తవారి పేర్లను నామినేట్ చేసే ఒత్తిడి కొలీజియంపై పెరుగనున్నది. అంతేకాక కొత్త న్యాయమూర్తుల నియుక్తి ప్రభుత్వం వేగిరం చేయాల్సి ఉంటుంది. సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా, ఉత్తర్ ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.ఎం. జోసఫ్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టు కొలీజియం గత నెల ప్రభుత్వానికి వారి పేర్లను పంపింది. అయితే ఆ సిఫార్సుల పరిశీలనను ప్రభుత్వం ఇంకా ఆమోదించాల్సి ఉంది.

ఉప ఎన్నికల్లో 70–77 % పోలింగ్

భోపాల్/భువనేశ్వర్: మధ్యప్రదేశ్‌లోని రెండు అసెంబ్లీ స్థానాలకు, ఒడిశాలోని ఒక స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో 70 నుంచి 77 శాతం పోలింగ్ జరిగి ఉంటుందని అంచనావేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మూడు స్థానాలను ఇదివరలో కాంగ్రెస్‌కుండేవి. ఈ ఏడాది ఉత్తరార్ధ భాగంలో బిజెపి అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది బిజెడి అధికారంలో ఉన్న ఒడిశాలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఉప ఎన్నికల ఫలితాల కోసం అందరూ ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాజకీయ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు జరిగినట్లు ఎన్నికల సంఘం అధికారి తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ముంగోలి, కొలారస్ అసెంబ్లీ నియోజక వర్గాల్లో 77, 70 శాతం పోలింగ్ జరిగింది. ఈ రెండు నియోజక వర్గాల బరిలో 13 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ముంగోలి ఎంఎల్‌ఎ మహేంద్ర సింగ్ కలుఖెడ, కొలారస్ ఎంఎల్‌ఎ రామ్‌సింగ్ యాదవ్ మరణించినందున ఈ ఉప ఎన్నికలు జరిపారు. ఒడిశాలోని బిజేపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో 72 ఓటర్లు తమ ఓటు వినియోగించుకున్నారని అంచనా. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ప్రధాన ఎ న్నికల అధికారి సురేంద్ర కుమార్ చెప్పారు. బరాగఢ్ జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత ఐదు పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సమాచారం. ఈ మూడు నియోజకవర్గాల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 28న జరగనున్నది. ఒడిశాలో బిజెడి, కాంగ్రెస్, బిజెపిల మధ్య ముక్కోణపు పోటీ ఉన్నట్లు తెలిసింది. 2017 ఆగస్టులో బిజేపూర్ నియోజకవర్గం ఎంఎల్‌ఎ సుబల్ సాహు(కాంగ్రెస్) చనిపోవడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది.

పెళ్లి ఖర్చులు పెట్టే శక్తి లేదు : సల్మాన్



ముంబై :కండలవీరుడిగా పేరొందిన బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ చిత్రాల పరంగా పులినే. అయితే పెళ్లి దగ్గరికి వచ్చేసరికి పిల్లి అయిపోతున్నాడు. పెళ్లా? అబ్బో తనకు పెళ్లి చేసుకునే శక్తి లేదని చెపుతున్నాడు. ఈ హీరో ఇండస్ట్రీలో పెళ్లికి అర్హుడైన వాడిగా నిలిచాడు. అయితే ఇప్పటివరకూ పెళ్లి ఎందుకు చేసుకోవడం లేదనేది సస్పెన్స్‌గానే మారింది. ఈ మధ్యనే విలేకరులు సల్మాన్‌ను పెళ్లి గురించి మరో మారు అడిగారు. అయితే పెళ్లి చేసుకునే శక్తి తనకు లేదని సల్మాన్ జవాబు ఇచ్చారు. పెళ్లంటే ఆషామాషీ కాదని, ఖర్చుతో కూడిన వ్యవహారం అని, అంతస్తులు లేదా హోదాలకు తగ్గట్లుగా పెళ్ళిళ్లు జరగాల్సి ఉంటుందని అంతా చెపుతుంటారని, ఇప్పుడు పెళ్లంటే లక్షల నుంచి కోట్ల రూపాయలతో ముడివడి ఉన్న వ్యవహారం అని సల్మాన్ సీరియస్‌గానే చెప్పారు. ఒక మంచి అమ్మాయిని వెతుక్కోవాలి. అందుకు డబ్బులు ఖర్చు అవుతాయి. తరువాత పెళ్లికి ఖర్చులు. ఆ తరువాత కూడా భార్యకోసం జంజాటం,వారు కోరుకున్న రీతిలో ఖర్చులు పెట్టాల్సి ఉంటుంది. ఈ విధంగా తనకు ఇది భరించలేని ఖర్చే అవుతుందని తనకు ఆ శక్తి లేదని ఈ శక్తిమాన్ సల్మాన్ చెప్పారు. తన ఒంటరితనానికి ఇదే కారణం అన్నారు. అయితే ఆయన చెపుతున్నదానికి ఆయన పరపతికి సంబంధం లేదనేది వాస్తవం. ఫోర్బ్స్ లిస్ట్‌లో అగ్రస్థానంలో ఉన్న సెలబ్రిటి, సోదరి అర్పిత పెళ్లికి కోట్లు కుమ్మరించి,దేశంలోనే అత్యంత విలాసవంతమైన ఫలక్‌నుమా ప్యాలెస్‌లో వేడుకలు నిర్వహించిన సల్మాన్ ఇప్పుడు పిసినారి మాటలకు దిగడం విచిత్రంగానే ఉంది. తన తండ్రి వివాహానికి అయిన ఖర్చు అప్పట్లో మొత్తం కలిపి రూ 180 అని ఇప్పుడు దీనిని ఊహించుకోవచ్చా అని ప్రశ్నించే సల్మాన్ సంగీత బిజ్లానీ, ఐశ్వర్యా రాయ్ నుంచి మొన్నటివరకూ కత్రినా వరకూ పలు హీరోయిన్లతో పెళ్లికి దారితీయని ప్రేమలు సాగించినట్లు వార్తలు వెలువడ్డాయి.

రూ. 25 కోట్లతో అగ్రిటెక్ పార్క్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని రైతులకు ఆధునిక సాగు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) ఆధ్వర్యంలో అగ్రికల్చర్ టెక్నాలజీ పార్క్ ఏర్పాటు కానుంది. వివిధ వ్యవసాయ పరిశోధన సంస్థల సహకారంతో ఆధునిక పద్ధతులు, సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 70 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ ఏడాది చివరికల్లా ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇందుకు రూ. 25 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా. ఈ నిధులను సమకూర్చేందుకు కేంద్రం అంగీకరించినట్లు సమాచారం. అగ్రిటెక్ పార్క్ ఏర్పాటైన తరువాత రెండు, మూడు సంవత్సరాలలో ఒక లక్ష మంది రైతులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా కూడా నిర్దేశించుకున్నట్లు తెలిసింది.

భారత్, చైనాలే కారణం!

పారిస్ ఒప్పందం నుంచి వైదొలగడానికి కారణం ఆ రెండు దేశాలే : ట్రంప్



వాషింగ్టన్: చారిత్రక పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా ఉపసంహరణకు భారత్, చైనాలే కారణమంటూ నెపమంతా భారత్, చైనాలపైనే నెట్టేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. 2017 జూన్‌లో పారిస్ ఒప్పందం నుంచి ఉపసంహరించుకుంటున్నామని ఆయనే ప్రకటించారు. ఆ ఒప్పందం కారణంగా అమెరికా ట్రిలియన్ల కొద్దీ డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని, ఉద్యోగాలు నశిస్తాయని, చమురు, గ్యాస్, బొగ్గు తయారీ పరిశ్రమలు కుంటుపడతాయని నాడు ప్రకటన చేస్తున్న సందర్భంలో ఆయన అన్నారు. అంతేకాక ఒప్పందంపై పునఃచర్చిస్తామని కూడా చెప్పారు. పారిస్ ఒప్పందం నుంచి చైనా, భారత్‌లు లాభపడుతున్నాయని, కానీ అమెరికా విషయంలో అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పారిస్ ఒప్పందం వల్ల అమెరికా వ్యాపారం, ఉద్యోగాలు దెబ్బతిన్నాయని అన్నారు. పారిస్ ఒప్పందం వినాశకరంగా ఉందని, ముఖ్యంగా అమెరికాకు వినాశకరంగా ఉందని ఆయన కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కమిటీని ఉద్దేశించి ప్రసంగిస్తూ చెప్పారు. 'అమెరికా దగ్గర ఉన్న అపార బొగ్గు, చమురు నిక్షేపాలను ఉపయోగించొద్దని వారంటున్నారు. అంటే మనం ఇతర దేశాలతో పోటీపడకూడదన్న అర్థంలో మాట్లాడుతున్నారు. కానీ ఆ ఎత్తుగడను సాగనివ్వబోమని నేను వారికి చెప్పాను' అని ట్రంప్ వివరించారు. 'వారు అభివృద్ధి చెందుతున్న దేశాలని చెప్పుకుంటూ లబ్ధి పొందుతున్నారు. అమెరికాను అభివృద్ధి చెందిన దేశంగా లెక్కగట్టేశారు. దాంతో అమెరికానే చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. 'వారి షరతుల ప్రకారం మనం ఏవీ నిర్మించకూడదు, వ్యవసాయం చేయకూడదు. ఒకవేళ పొలంలో నీటి గుంట ఉన్నా దానిని వారు చెరువు అంటారు. అది పర్యావరణకు సంబంధించిందంటారు. ఇదంతీ విపరీతం అని నేనంటాను' అని ట్రంప్ వివరించారు.

ఉ.కొరియాపై కఠిన ఆంక్షలు

ఉత్తరకొరియాకు అమెరికా ఊహించని షాక్ ఇచ్చింది. ఇంతకముందు ఎన్నడూ ఏ దేశం మీద విధించని అత్యంత కఠినమైన ఆంక్షలను ఉత్తరకొరియా మీద విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ వెల్లడించారు. శుక్రవారం వాషింగ్టన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉ.కొరియాపై భారీగా ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. ఉ.కొరియాకు చెందిన 56 నౌకలు, షిప్పింగ్ కంపెనీలు, ఇతర కార్యకలాపాలపై ఈ ఆంక్షలు అమలుకానున్నాయన్నారు. సరికొత్త ఆంక్షల ద్వారా ప్యాం గ్యాంగ్ నుంచి నిషేధం విధించిన ఆయుధాలను సరఫరా చేసే నౌకలు, అక్రమంగా బొగ్గు, ఇంధన రవాణా చేస్తున్న నౌకలను అడ్డుకోని వాటిని స్వాధీనం చేసుకోవచ్చు. దీని వల్ల ఆ దేశ వాణిజ్యంపై అధిక ప్రభావం పడుతోంది. అమెరికా ఆంక్షలు కాదని ఎవరైనా ఉత్తరకొరియాతో వాణిజ్య, వ్యాపార లావాదేవీలు జరపాలని చూసిన దేశాలతో యూఎస్ వ్యాపారాలను తెగదెంపులు చేసుకుంటుందని ట్రంప్ హెచ్చరించారు. ఒకవేళ ఆంక్షలు విధించినప్పటికీ.. ప్యాంగ్యాంగ్‌లో ఎటువంటి మార్పు రాకపోతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు మరింత భయంకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.


జయ విగ్రహం ఆవిష్కరణ



చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నిలువెత్తు విగ్రహాన్ని ఇక్కడ ఎఐఎడిఎంకె పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం నాడు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి కె పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఈ ఆవిష్కరణ జరిపారు.పార్టీ అధికారిక తమిళ దిన పత్రిక ' నామదు పురచ్చి తలైవి అమ్మ' ను కూడాఈ సభలో వారు ఆవిష్కరించారు. జయ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. గత ఏడాది శశికళ, దినకరన్‌లను పార్టీ నుంచి బహిష్కరించి, స్వామి, సెల్వం దగ్గరయ్యాక ఇది అటువంటి మొదటి కార్యక్రమం.

అఫ్ఘానిస్థాన్‌లో ఆత్మాహుతి దాడులు

23 మంది మృతి



కాబూల్: అఫ్ఘానిస్థాన్‌లో శనివారం జరిగిన అనేక వరుస ఆత్మాహుతి దాడుల్లో కనీసం 23 మంది చనిపోగా, డజన్లకొద్దీ మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. పక్షం రోజుల్లో తాలిబన్లు ఫరా పశ్చిమ ప్రాంతంలోని సైనిక స్థావరంపై అతి పెద్ద దాడి చేయడంతో కనీసం 18 మంది సైనికులు చనిపోయారు. 'ఘటన స్థలికి మరిన్ని బలగాలను పంపాము' అని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి దౌలత్ వజీర్ చెప్పారు. దాడులకు పాల్పడింది తామేనంటూ తాలిబన్లు ప్రకటించారు. దాడి దర్యాప్తు కోసం బల బులుక్ ప్రాంతానికి అధికారులు నిజనిర్ధారణ బృందాన్ని పంపినట్లు డిప్యూటీ ప్రావిన్షియల్ గవర్నర్ యూనుస్ రసూలీ తెలిపారు. ' ఓ ఆత్మాహుతి బాంబర్ కాలినడకన వచ్చి ఉ. 8.30 గంటలకు చెక్‌పాయింట్ వద్ద తనను తాను పేల్చేసుకున్నాడు. దాంతో ముగ్గురు చనిపోగా, ఐదుగురు గాయపడ్డారు' అని అంతర్గత డిప్యూటీ మంత్రి నస్రత్ రహీమీ చెప్పారు. ఆ పేలుడు నేషనల్ డైరెక్టరేట్ ఆఫ్ సెక్యూరిటీ(ఎన్‌డిఎస్) వద్ద జరిగిందని పేరు తెలుప నిరాకరించిన ఓ భద్రతాధికారి తెలిపారు.ఎన్‌డిఎస్ ప్రాంగణం నాటో ప్రధాన కార్యాల యం, అమెరికా దౌత్యకార్యాలయంకు సమీపంలో ఉంది. డిసెంబర్‌లో కూడా కాలినడకన వచ్చిన ఓ ఆత్మాహుతి బాంబర్ ఇదే కాంపౌండ్‌లో తనను తాను పేల్చేసుకున్నాడు. అప్పుడు ఆరుగురు చనిపోయారు. హెల్మండ్ ప్రాంతంలో శనివారం జరిగిన మరి రెండు దాడుల్లో ఇద్దరు సైనికులు మరణించగా, డజన్లకొద్దీ మంది గాయపడ్డారని అధికారులు చెప్పారు. హెల్మండ్‌లో జరిగిన రెండు దాడులకు తమదే బాధ్యత అని తాలిబన్లు ప్రకటించారు.

నైజీరియాలో స్కూల్‌పై బోకోహరం ఉగ్రవాదుల దాడి

105 మంది బాలికలు అదృశ్యం

కనో(నైజీరియా): ఈశాన్య నైజీరియాలో సోమవారం ఓ స్కూల్‌పై బోకోహరం ఉగ్రవాదులు దాడి చేయడంతో వంద మందికి పైగా బాలికలు కనిపించకుండా పోయారు. ఈ దాడి తర్వాత యోబ్ రాష్ట్రంలోని దాప్చిలో తల్లిదండ్రులు బృందంగా ఏర్పాటయ్యారు. తప్పిపోయిన 105 మంది బాలికల పేర్లతో కూడిన సమగ్ర జాబితా తయారు చేయడమే తమ ఉద్దేశ్యమని నూతన బృంద చైర్మన్ బషీర్ మాంజో తెలిపారు. 2014లో చిబోక్‌లో 200 మందికి పైగా బాలికలను కిడ్నాప్ జ్ఞాపకాలను నూతన బృందం గుర్తు చేసుకుంది. మారుమూల పట్టణంలో సాయుధులైన బోకోహరం ఉగ్రవాదులు ఓ స్కూల్లోకి ప్రవేశించి చెట్ల పొదల్లోకి పారిపోవాలని బాలికలను భయభ్రాంతులకు గురి చేశారు. వారిలో అనేక మంది బాలికలు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో డజన్ల కొద్దీ బాలికలు కిడ్నాప్ అయినట్లు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

● తృటిలో తప్పిన ఘోర ప్రమాదం ● తెల్లవారు జామున ఇళ్లు వదిలి పరుగులు పెట్టిన స్థానికులు



మన తెలంగాణ / రాజేంద్రనగర్ : రోడ్డు ప్రమాదంలో ఒక ఇండియన్ ఆయిల్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా అదుపుతప్పిన వాహనం పివి. నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ఢీకొట్టడంతో ఈ ఘటన సంభవించింది. భారీ శబ్ధంతో స్థానికులు ఉలిక్కి పడి లేచి బ్రతుకు జీవుడా అంటూ పరుగులు పెట్టారు. ఆయిల్ ట్యాంకర్‌కు మంటలు అంటుకొని ఉంటే ఊహించని పరిణామాలు ఉండేవి. రాజేంద్రనగర్ పోలీసులు, ఫైర్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి డీజిల్ ట్యాంకు కు నిప్పు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకుకోవడంతోపాటు రాకపోకలు మళ్లించి, స్థానికులను సంఘటనా స్థలం .నుంచి ఖాళీ చేయించి కొద్ది దూరం తరలించారు. శనివారం తెల్లవారు జాము 4 నుంచి 4.30 గంటల ప్రాంతంలో చర్లపల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా ఇన్నర్‌రోడ్డులో అత్తాపూర్ వైపు ఎపి28సిఇ7789 నెంబర్ గల ఆయిల్ ట్యాంకర్ సుమారు 20 వేల లీటర్ల డీజిల్ తీసుకుని వెళుతుంది. డ్రైవర్ నిద్రమత్తులో అదుపుతప్పిన ఆయిల్ ట్యాంకర్ పివి. నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 273 వద్ద రోడ్డు ఢీవైడర్‌కు ఢీకొట్టింది. దాంతో భారీ శబ్ధంతో వాహనం రోడ్డు పై పల్టీ కొట్టింది. ట్యాంకర్ స్వల్పంగా ధ్వసం కావడంతో డీజిల్ రోడ్డుపై పారింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకోవడతో పాటు ఫైర్ సర్వీసుకు సమాచారం అందించారు. రోడ్డు పై పారుతున్న డిజిల్ పై మట్టి, ఇసుక వేయించడంతోపాటు ఇన్‌రింగ్ రోడ్డు పై వాహనాలరాకపోకలను నిలిపివేశారు. శివరాంపల్లి వార్డు కార్యాలయం వద్ద నుంచి ప్రేమావతి పేట్ మీదుగా డైరీఫాం వైపు వాహనాలను మళ్లించారు. ఫైర్ సిబ్బంది రోడ్డు పై పారుతున్న డీజిల్ పై ఫోమ్ చల్లి మంటలు అంటుకోవడానికి ఆస్కారం లేకుండా చేశారు. దాదాపు 4 గంటలు శ్రమించిన రాజేంద్రనగర్ పోలీసులు, ఫైర్ సిబ్బంది భారీ క్రేన్ సహాయంతో పల్టీకొట్టిన ట్యాంకర్‌ను ఎంతో జాగ్రత్తగా సంఘటన స్థలి నుంచి తొలగించి కొద్ది ముందుకు తీసువెళ్లి నిలిపారు. దాంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

మనతెలంగాణ/కరీంనగర్ క్రైం: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్లా జిల్లా బోయినపల్లి మండలంలో వరదవెల్లిగ్రామానికి చెందిన కంది ప్రశాంత్(23) నేరళ్ల కిషన్(22) అనే యువకులు మృతి చెందా రు. వ్యక్తిగతమైన పనిమీద కరీంనగర్‌కు విచ్చేసి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో బావుపేట వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో తీవ్ర గాయలై అక్కడికక్కడే చనిపోయారు.

రాంగోపాల్ వర్మపై కేసులు

హైదరాబాద్: సినీ నిర్మాత రాంగోపాల్ వర్మపై ఆంధ్రప్రదేశ్‌లో పలు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. విజయవాడ, సూర్యారావు పేట పోలీస్ స్టేషన్లలో వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తుమ్మలిపల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 560, 509 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

గుంతకల్లు రైల్వే డివిజన్ కోసం హైకోర్టులో పిల్

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. గుంతకల్లులో రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది.అనంతపురం జిల్లా గుంతకల్లులో రైల్వే డివిజన్ ఉందని, ఇక్కడ అవసరమైన భూమి కూడా ఉన్నందున రైల్వే జోన్‌ను ఏర్పాటు చేసేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరుతూ గుంతకల్లుకు చెందిన శ్రీనివాస్‌చౌదరి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని వేశారు. ఏపీ పునర్ విభజన చట్టం2014లోని 93,94 సెక్షన్ల ప్రకారం రైల్వే డివిజన్ వెంటనే ఏర్పాటుకు కేంద్రం చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలన్నారు. చట్ట ప్రకారం ఆరు మాసా ల్లో రైల్వే జోన్ ఏర్పాటు చేయకపోవడాన్ని రిట్‌లో ఎత్తిచూపారు. ఇందులో రైల్వే శాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ప్రతివాదులుగా చేశారు. 27న ఈ పిల్‌ను హైకోర్టు విచారించే అవకాశముంది.



టిఆర్ఎస్ ఒత్తిడితోనే ఓట్లను తొలగించారు



మన తెలంగాణ/ హైదరాబాద్ : అధికార టిఆర్ఎస్ ఒత్తిడితో ఆదిలా బాద్ జిల్లా ఉట్నూర్ దంతా న్ పల్లి గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికలలో 742 ఓట్లను అధికారులు తొలగించారని కాంగ్రెస్ నేత మర్రిశశిధర్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అనంతరం మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉప ఎన్నిక ల్లోనే ఇలాంటి పరిస్థి తులుంటే రానున్న పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ మరిన్ని అక్రమాలకు పాల్పడే ప్రమాదం ఉన్నదని అను మానం వ్యక్తం చేశారు. ఇలాంటివి జరగకుండా ముందుగానే తాము ఎన్నికల సంఘాన్ని కోరుతామని, అప్పటికీ స్పం దన రాకుంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. అధికార పార్టీ నేతల ఒత్తిడికి అధికా రులు తప్పులు చేస్తున్నారని, ఇలాంటి అధికారులను తాము అధి కారంలోనికి రాగానే చట్టపర ంగా చర్యలు తీసుకుంటామని, అధికారు లు రిటైర్ అయినా వారికి పెన్షన్ రాకుండా చేస్తామని హెచ్చరించారు. దంతాన్‌పల్లి గ్రామ ఉప ఎన్నిక ల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్‌ను స్థానిక ఎంఎల్‌ఎ కనీసం ప్రచారం చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.

పెట్టుబడులకు ఎపి గమ్యస్థానం



విశాఖ : పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా నిలుస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో సీఎం కీలకోపన్యాసం చేశారు. రాష్ట్రంలో మూడోసారి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నందుకు తనకెంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో శాశ్వత కన్వెన్షన్ కేంద్రం, షాపింగ్‌మాల్స్, హోటళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. గతేడాది కంటే ఈసారి భాగస్వామ్య సదస్సుకు స్పందన బాగుందని హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో భారీగా విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్టు చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. 2022 నాటికి దేశంలో మూడో స్థానంలో ఆంధ్రప్రదేశ్‌ను నిలపడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు. 2029 నాటికి దేశంలో అగ్రస్థానంలో నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈసారి రాష్ట్రంలో 13.8 శాతం లోటు వర్షపాతం నమోదైందన్నారు. నీటి నిర్వహణ పద్ధతుల ద్వారా వ్యవసాయంలో గణనీయంగా వృద్ధిరేటు సాధిస్తున్నట్టు సీఎం చెప్పారు.

కేరళ ఘటనపై సిగ్గుపడుతున్నా: సెహ్వాగ్



న్యూఢిల్లీ: దొంగ తనానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ కేరళలో మతిస్థిమితం లేని ఓ యువకుడిని కొందరు చంపేసిన ఘటనపై టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలాంటి సంఘటన జరిగిన సమాజంలో ఉన్నందుకు సిగ్గు పడుతున్నానని వ్యాఖ్యానించాడు. వేల కోట్ల రూపాయలు దోచుకొని విదేశాల్లో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్న బడాబాబులను కనీసం ప్రశ్నించే స్థితిలో లేని సమాజం కడు దారిద్ర్యంతో కొట్టు మిట్టాడుతున్న పేద ప్రజల ప్రాణాలను తీయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించాడు. ఈ మేరకు సెహ్వాగ్ చేసి ట్వీట్ వైరల్‌గా మారింది. దీనికి అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కేరళలో మధు అనే యువకుడిని కొందరు యువకులు దొంగతనం చేశాడనే ఆరోపణతో తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మధు అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కాగా, మతిస్థిమితం లేని యువకుడిని కొందరు తీవ్రంగా కొడుతున్న ఆపే ప్రయత్నం చేయకుండా సెల్ఫీలు దిగి ఎంజాయ్ చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై సెహ్వాగ్ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు. దీనికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరాడు.



మళ్లీ బరిలోకి బెన్‌స్టోక్స్

హామిల్టన్: వివాదంలో చిక్కుకొని చాలా కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ మళ్లీ జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో స్టోక్స్ బరిలోకి దిగనున్నాడు. ఓ వ్యక్తిపై దాడి కేసులో స్టోక్స్ విచారణను ఎదుర్కొవడంతో ఇంగ్లాండ్ బోర్డు అతనిపై తాత్కాలిక నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయితే అతనిపై విచారణ పూర్తి కావడంతో మళ్లీ జాతీయ జట్టులోకి ఎంపిక చేశారు. ఆరు నెలల సుదీర్ఘ విరామం తర్వాత స్టోక్స్ మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్నాడు. దీంతో అందరి కళ్లు అతనిపైనే నిలిచాయి. ఇదిలావుండగా ప్రాక్టీస్ లేదనే కారణంతో అతన్ని తొలుత మొదటి మ్యాచ్‌కు ఎంపిక చేయలేదు. కానీ కెప్టెన్ మోర్గాన్ కోరడంతో జట్టు యాజమాన్యం అతనికి తొలి వన్డేలో ఛాన్స్ ఇచ్చింది. దీంతో స్టోక్స్ బరిలోకి దిగేందుకు మార్గం సుగమం అయ్యింది. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్న స్టోక్స్ తరచు వివాదాల్లో చిక్కుకుంటూ కెరీర్‌ను క్లిష్టంగా మార్చుకుంటున్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన స్టోక్స్ కెరీర్‌కు వివాదాలు ప్రతికూలంగా పరిణమించాయి. ఇప్పటికైనా అతను వివాదాలకు దూరంగా ఉంటే అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులను బద్దలు కొట్టడం ఖాయమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

చరిత్ర సృష్టించిన తెలుగుతేజం

- ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్‌లో అరుణకు కాంస్యం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరుగుతున్న వరల్డ్ కప్ జిమ్నాస్టిక్ పోటీల్లో భారత జిమ్నాస్ట్, తెలుగుతేజం అరుణా రెడ్డి కాంస్య పతకం గెలిచి చరిత్ర సృష్టించింది. వరల్డ్‌కప్ జిమ్నాస్టిక్స్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం. శనివారం జరిగిన ఫైనల్లో అరుణ అసాధారణ ప్రతిభను కనబరుస్తూ తన ఖాతాలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ క్రమంలో జిమ్నాస్టిక్ వరల్డ్‌కప్‌లో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌లో భారత్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. గతంలో అశిష్ కుమార్, దీపా కర్మాకర్‌లు అంతర్జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌లో భారత్‌కు పతకాలు సాధించి పెట్టారు. ఇద్దరు కూడా కామన్‌వెల్త్ పోటీల్లోనే పతకాలు సాధించడం గమనార్హం. కాగా, హైదరాబాద్‌కు చెందిన 22 ఏళ్ల అరుణ వరల్డ్‌కప్ జిమ్నాస్టిక్స్‌లో చారిత్రక ప్రదర్శనతో ఆకట్టుకుంది. హేమాహేమీ జిమ్నాస్ట్‌లు పాల్గొన్న ఈ మెగా చాంపియన్‌షిప్‌లో అరుణ 13,649 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. స్లోవేనియాకు చెందిన టిజాసా కిస్లెఫ్ 13,800 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. మరోవైపు ఆతిథ్య ఆస్ట్రేలియాకు చెందిన జిమ్నాస్ట్ ఎమిలి వైట్‌హెడ్ 13,699 పాయింట్లతో రజత పతకాన్ని దక్కించుకుంది. కాగా, భారత్‌కు చెందిన మరో జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ 13,416 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. కాగా, భారత్‌కు చెందిన స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ రియో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకం గెలుచుకునే అవకాశాన్ని చేజార్చుకున్న విషయం తెలిసిందే. అయితే ప్రపంచకప్‌లో అరుణ అసాధారణ ఆటతో పతకం గెలిచి భారత ఖ్యాతిని నలుమూలలా చాటింది. కాగా, వరల్డ్‌కప్‌లో పతకం గెలవడంపై అరుణ ఆనందం వ్యక్తం చేసింది. ఈ పోటీల కోసం కఠోర సాధన చేశానని, శ్రమ ఫలించి పతకం దక్కడం ఎంతో గర్వంగా భావిస్తున్నట్టు తెలిపింది. భవిష్యత్తుల్లో జరిగే ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన ముందున్న ఏకైక లక్ష్యమని అరుణ స్పష్టం చేసింది. ఇదిలావుండగా తెలుగుతేజం అరుణా రెడ్డి ఇప్పటికే పలు జిమ్నాస్టిక్స్ పాల్గొని భారత్‌కు పతకాల పంట పండించింది. తాజాగా ప్రపంచకప్‌లో కాంస్యం నెగ్గడం ద్వారా తెలుగు రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప చేసింది. విపరీత పోటీ ఉండే ప్రపంచకప్‌లో పతకం సాధించడం అంత తేలికకాదు. అయితే కఠోర సాధన, అంకితభావంతో కూడిన ప్రతిభతో అరుణారెడ్డి పతకాన్ని సొంతం చేసుకుని భారత క్రీడా చరిత్రలో కొత్త మైలురాయిని చేర్చింది.



భారత మహిళలకు సిరీస్

- చివరి టి-20లో సౌతాఫ్రికా చిత్తు



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా మహిళా జట్టుతో జరిగిన ట్వంటీ–20 సిరీస్‌ను భారత్ 3–1తో గెలుచుకుంది. శనివారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 54 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసి సిరీస్‌ను సొంతం చేసుకుంది. తొలి రెండు మ్యాచుల్లో భారత్ గెలవగా, మూడో పోటీలో సౌతాఫ్రికా నెగ్గింది. నాలుగో మ్యాచ్ వర్షం వల్ల రద్దయ్యింది. కీలకమైన ఐదో టి–20లో విజయం సాధించిన టీమిండియా సిరీస్‌ను దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన సౌతాఫ్రికా కేవలం 112 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం పాలైంది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఆతిథ్య సఫారీ రెండు విభాగాల్లోనూ చేతులెత్తేసింది. భారత బౌలర్లు శిఖా పాండే, రాజేశ్వరి గైక్వాడ్‌లు అద్భుత బౌలింగ్‌తో జట్టును గెలిపించారు. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అతిథ్య సౌతాఫ్రికాకు ప్రారంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి.

ఓపెనర్లు లిజెల్లి లీ (3), వాన్ డికార్క్ (10)లను రుమాలిధర్ ప్రారంభంలోనే పెవిలియన్ పంపించింది. వన్‌డౌన్‌లో వచ్చిన స్టార్ క్రికెటర్ సూనె లూస్ (5) కూడా జట్టును ఆదుకోవడంలో విఫలమైంది. డు ప్రిజ్ (17) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయింది. ఈ రెండు వికెట్లు శిఖా పాండే ఖాతాలోకి వెళ్లాయి. మరో వైపు ట్రియాన్ (25), మరిజానె కాప్ (27) తప్ప మిగతావారు విఫలం కావడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ 19 ఓవర్లలో 112 పరుగుల వద్దే ముగిసింది. భారత బౌలర్లలో శిఖా పాండే, రాజేశ్వరిలు మూడేసి వికెట్లు పడగొట్టారు.

మిథాలీ మెరుపులు..



అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఓపెనర్లు మిథాలీ రాజ్, స్మృతి మందన శుభారంభం అందించారు. ఇద్దరు సౌతాఫ్రికా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. అయితే మూడు ఫోర్లతో 13 పరుగులు చేసిన మందనను కాప్ వెనక్కి పంపింది. దీంతో భారత్ 32 పరుగుల తొలి వికెట్‌ను కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను మిథాలీ తనపై వేసుకుంది. యువ క్రికెటర్ జమిమా రోడ్రిక్స్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఇద్దరు దూకుడుగా ఆడడంతో స్కోరు వేగంగా పరిగెత్తింది. ఈ జోడీని విడగొట్టేందుకు సౌతాఫ్రికా బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కీలక ఇన్నింగ్స్ ఆడిన జెమిమా మూడు ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో 34 బంతుల్లోనే 44 పరుగులు చేసింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 27 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. మరోవైపు అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన మిథాలీ రాజ్ 3సిక్స్‌లు, 8 ఫోర్లతో 50 బంతుల్లోనే 62 పరుగులు చేసింది. భారత్ స్కోరు 166 పరుగులకు చేరింది. కాగా, అద్భుత ఇన్నింగ్స్ ఆడిన మిథాలీకి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది. అంతేగాక నిలకడైన బ్యాటింగ్‌ను కనబరచడంతో ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డును సైతం కైవసం చేసుకుంది.





సఫారీ లక్ష్యం 173

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న చివరి టి–20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి బరిలోకి దిగలేదు. దీంతో భారత జట్టు కెప్టెన్సీ బాధ్యతలను రోహిత్ శర్మ చేపట్టాడు. టాస్ గెలిచిన సౌతాఫ్రికా ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ప్రారంభంలోనే షాక్ తగిలింది. సిరీస్‌లో పేలవమైన ఫాంతో సతమతమవుతున్న ఓపెనర్ రోహిత్ శర్మ ఈసారి కూడా నిరాశ పరిచాడు. 8 బంతుల్లో రెండు ఫోర్లతో 11 పరుగులు చేసిన రోహిత్ డాలా బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికి పోయాడు. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా తనపై వేసుకున్నాడు. అతనికి ఓపెనర్ ధావన్ అండగా నిలిచాడు. రైనా దూకుడైన బ్యాటింగ్‌తో చెలరేగి పోయాడు. మరోవైపు ధావన్ సమన్వయంతో బ్యాటింగ్ చేశాడు. ఇద్దరు కలిసి రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన రైనా స్కోరును పరిగెత్తించాడు. అయితే కుదురుగా ఆడుతున్న రైనాను షంసి వెనక్కి పంపాడు. దీంతో 65 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మరోవైపు ధావన్ కూడా మెరుగైన బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నాడు. సమన్వయంతో ఆడిన ధావన్ 3ఫోర్లతో 47 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తర్వాత వచ్చిన వారు ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయారు. హార్దిక్ పాండ్య (21), మనీష్ పాండే (13), ధోని (12), దినేష్ కార్తీక్ (12) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. చివర్లో దక్షిణాఫ్రికా బౌలర్లు వరుసగా వికెట్లు తీయడంతో భారత్ స్కోరు 172 పరుగులకే పరిమితమైంది. సఫారీ బౌలర్లలో డాలా మూడు, మోరిస్ రెండు వికెట్లు పడగొట్టారు.

ఫైనల్లో మెదక్ మావెరిక్స్

- చెలరేగిన అభిరథ్ రెడ్డి
- సెమీస్‌లో హైదరాబాద్‌పై ఘన విజయం
- నేడు ఆదిలాబాద్‌తో తుది పోరు

మన తెలంగాణ/ హైదరాబాద్: మెదక్ మావెరిక్స్ జట్టు జి.వెంకటస్వామి స్మారక తెలంగాణ టి–20 లీగ్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకుంది. శనివారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన సెమీఫైనల్లో మెదక్ ఆరు వికెట్ల తేడాతో హైదరాబాద్ థండర్‌బోల్ట్స్‌ను చిత్తు చేసింది. మరో సెమీఫైనల్లో ఆదిలాబాద్ టైగర్స్ విజయం సాధించింది. కాగా, తొలి సెమీఫైనల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన హైదరాబాద్ 19 ఓవర్లలోనే కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. స్టార్ ఆటగాడు అభిరత్ రెడ్డి 84(నాటౌట్) జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. లక్ష్యఛేదనకు దిగిన హైదరాబాద్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు మల్లికార్జున్, అభిరథ్ రెడ్డిలు హైదరాబాద్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా ఫోర్లతో స్కోరు వేగం తగ్గకుండా చూశారు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన మల్లికార్జున్ 4ఫోర్లు, ఒక సిక్స్‌తో 25 బంతుల్లో 31 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యంలో పాలు పంచుకున్నాడు. మల్లికార్జున్ ఔటైనా తర్వాత అభిరథ్ రెడ్డి జోరును పెంచాడు. మికిల్ జైస్వాల్ అతనికి అండగా నిలిచాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురు దాడికి దిగిన అభిరథ్ వరుస ఫోర్లు, సిక్సర్లతో అలరించాడు. అతన్ని కట్టడి చేసేందుకు ప్రత్యర్థి బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మరోవైపు జైస్వాల్ (11) పరుగులు చేసి వెనుదిరిగాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ సందీప్ (5), చైతన్య కృష్ణ (3) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అభిరత్ జోరును కొనసాగించాడు. గణేష్ 10(నాటౌట్) అండతో అభిరథ్ మరో వికెట్ కోల్పోకుండానే జట్టును ఫైనల్‌కు చేర్చాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన అభిరథ్ 54 బంతుల్లోనే మూడు సిక్సర్లు, మరో పది ఫోర్లతో 84 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అభిరత్ జోరుతో మెదక్ మరో ఓవర్ మిగిలివుండగానే విజయాన్ని అందుకుంది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 7వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. చైతన్య 35 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 43 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. డాని డారెక్ ప్రిన్స్ (27), చందన్ సహాని (31), జైరాం రెడ్డి (25) మెరుగైన బ్యాటింగ్‌తో హైదరాబాద్‌కు అండగా నిలిచారు. మెదక్ బౌలర్లలో మికిల్ జైస్వాల్, సందీప్ పొదుపుగా బౌలింగ్ చేసిన హైదరాబాద్ బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేశారు. అభిరథ్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇదిలావుండగా ఫైనల్‌కు చేరిన మెదక్ జట్టును ఫ్రాంఛైజీ యజమాని జగన్మోహన్ రావు అభినందించారు. సమష్టి పోరాటంతోనే జట్టు ఫైనల్‌కు చేరిందన్నారు. ఫైనల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన జట్టు సభ్యులను, కోచ్‌ను అభినందించారు.







రైజర్స్‌కు టైగర్స్ షాక్...

రెండో సెమీఫైనల్లో పటిష్టమైన రంగారెడ్డి రైజర్స్‌కు చుక్కెదురైంది. సెమీస్‌లో ఆదిలాబాద్ టైగర్స్ 16 పరుగుల తేడాతో రంగారెడ్డిను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. మీర్ జావిద్ అలీ విధ్వంసక ఇన్నింగ్స్‌తో ఆదిలాబాద్‌ను ఆదుకున్నాడు. చెలరేగి ఆడిన జావిద్ ఐదు సిక్సర్లు, మరో రెండు ఫోర్లతో 23 బంతుల్లోనే 45 పరుగులు చేశాడు. రవితేజ (24), నీరజ్ బిస్త్ (40), హిమా తేజా (40) కూడా మెరుగైన బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రంగారెడ్డి రైజర్స్ 19 ఓవర్లలో 166 నకెగెలు ఆలౌటైంది. అక్షత్ రెడ్డి 39 బంతుల్లోనే ఆరు సిక్స్‌లు, మరో 4ఫోర్లతో 81 పరుగులు చేసినా జట్టును గెలిపించలేక పోయాడు. ఆదిలాబాద్ టైగర్స్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ జట్టును ఫైనల్‌కు చేర్చారు. ఆదిలాబాద్ ఆదివారం రాత్రి ఉప్పల్‌లో జరిగే ఫైనల్లో మెదక్ మావెరిక్స్‌తో తలపడుతుంది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.